# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

బుధవారం, ఆగస్టు 20, 2014

**WEDNESDAY, THE 20TH AUGUST, 2014**

14వ శా.స. 2 వ సమావేశం, వాల్యూం-2 నంబరు-3

**14TH L.A. II– SESSION, VOL- 2, NO. 3.**

శక సంవత్సరం-1936, శ్రావణం -29

**29- Sravan, 1936 – S.E.**

శాసన సభ సచివాలయం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | ః | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | ః | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | ః | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | ః | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

– – –

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
(రెండవ సమావేశము : మూడవ రోజు )

**బుధవారం, ఆగస్టు 20, 2014**
**సభ గం.09.00లకు లకు ప్రారంభమైనది**
**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

----------

# విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభ సమావేశం (ఉ.గం.9.00 లకు) | .... | 5 |
| 1. | నక్షత్ర గుర్తు గల ప్రశ్నలు మరియు సమాధానములు | .... | 5-43 |
| 2. | జీరో అవర్ | .... | 44-47 |
| 3. | సభాపతి ప్రకటన (నిబంధన 344 క్రింద చర్చకు తీసుకోవలసిన అంశాల గురించి) | .... | 47 |
| 4. | గౌరవ ఆర్థిక శాఖా మాత్యులచే సభకు 2014-15 ఆదాయ-వ్యయాల పట్టిక సమర్పణ | .... | 48-82 |
| 5. | సభ వాయిదా (మ. గం.12.23 లకు) | .... | 82 |

**ఆంధ్రప్రదేశ్ శాసన సభ**

**14వ శాసనసభ, 2వ సమావేశం**

**బుధవారం, 20వ తేది ఆగస్టు, సం.2014.**

**(సభ ఉదయం గం.09.00లకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

* * *

**ప్రశ్నలు - వాగ్రూప సమాధానాలు**

**MR SPEAKER: Question Hour. Question No. 15 (21)**

**సర్వశ్రీ / శ్రీమతి**
**జి.వి. ఆంజనేయులు, అశోక్ బెండలమ్, కోళ్ల లలిత కుమారి, అనిత వంగలపూడి.**
**– ఎం.ఎల్.ఏ.లు**

అ) రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల, గృహసంబంధ అవ్యవస్థీకృత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాల వివరాలు ఏమిటి?
ఆ) కార్మికుల సంక్షేమం కోసం భవన, ఇతర కార్మికుల సంక్షేమ నిధిని వినియోగించడం లేదన్న విషయం వాస్తవమేనా?
ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

**కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి శ్రీ కింజరావు అచ్చెన్నాయుడుః**

అ) 1. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి చేపట్టిన పథకాలను తెలిపే వివరణను సభా సమక్షంలో ఉంచడమయింది.
2. గృహ కార్మికుల కోసం ఎటువంటి పథకాన్ని అమలు చేయలేదు.
ఆ) లేదండీ.
ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**15 లోని(ఎ) ఖండానికి సమాధానంః**

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి చేపట్టిన పథకాలను తెలిపే వివరణః

| | | |
|---|---|---|
| 1. వ్యక్తిగత ప్రమాద మరణ సహాయం | ః | రూ. 2 లక్షలు |
| 2. శాశ్వత అంగవైకల్య సహాయం | ః | రూ. 25,000 – రూ.2 లక్షల వరకు |
| 3. సహజ మరణ సహాయం | ః | రూ. 30,000 |
| 4. ప్రసూతి సంబంధ సహాయం | ః | రూ. 10,000 |
| 5. తాత్కాలిక అశక్తత సహాయం (ఆసుపత్రి ఖర్చులు) | ః | రూ. 4,500 వరకు |
| 6. అంత్యక్రియ ఖర్చులు | ః | రూ. 10,000 |
| 7. భద్రత, నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ | ః | రూ. 8,000 (ఒక్కో కార్మికునికి) |
| 8. పింఛను పథకం (ఎన్‌పిఎస్ & స్వావలంబన్) | ః | రూ. 3,000 (వార్షిక విరాళం)<br>(i) వర్కర్ ః రూ. 1,000<br>(ii) బోర్డుః రూ. 1,000<br>(iii) కేంద్ర ప్రభుత్వంః రూ. 1,000 |
| 9. వివాహ కానుక | ః | రూ. 5,000 |
| 10. నమోదు కాని కార్మికులకు ఆర్థిక సహాయం | ః | |

ఎ) ప్రమాదవశాత్తు మరణించిన వారికి సహాయంః రూ.50,000

బి) శాశ్వత అంగవైకల్యం అయినవారికి సహాయంః రూ.10,000 నుండి రూ.20,000

11. భవన నిర్మాణ కార్మికులపై ఆధారపడిన వారికి వృత్తి సంబంధ శిక్షణ.

* * *

మిస్టర్ స్పీకర్ః శ్రీ జి. వి. ఆంజనేయులు .

శ్రీ జి.వి. ఆంజనేయులు (ఉంగుటూరు)ః అధ్యక్షా, గత పది సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలనలో భవన కార్మికుల బ్రతుకులు చితికిపోయాయి. నిర్మాణ రంగం కుదేలు అయ్యింది. కార్మిక సోదరులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అలాగే, కార్మిక సంక్షేమం కోసం వసూలు చేసినటువంటి డబ్బును కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పనులకు మళ్ళించింది. కార్మికుల ప్రయోజనాలను కాలరాయడం, వారికి కేటాయించిన

నిధులను సద్వినియోగం చేయకపోవడం చాలా బాధాకరం. గత పదేళ్ళ నుండి కార్మికులకు జరిగిన అన్యాయాన్ని తీర్చిదిద్దాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదేవిధంగా, ఇళ్ళల్లో పనిచేసే చిన్న చిన్న కార్మికులను, వ్యవసాయ కూలీలను కూడా కార్మికశాఖ పరిధిలోకి తీసుకువస్తే, కార్మికులకు, ప్రజలకు చాలా మేలు చేసినట్లవుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. కష్టపడి పనిచేసే కార్మికులు, వారికి 60 సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత, అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. కాబట్టి, వారికి 60 సంవత్సరాల వయస్సు తరువాత పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకుని, వారికి అండదండలు కల్పించాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిస్టర్ గారు.

శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు (టెక్కలి)ః అధ్యక్షా, మన రాష్ట్రంలోని 13 జిల్లాల్లో దాదాపు 13,97,000 మంది కార్మికులను కార్మికశాఖ రిజిస్టర్ చేయడం జరిగింది. ఈరోజు వీరి కొరకు ఒక సొసైటీ కూడా ఏర్పడింది. రాష్ట్రంలో ఎవరైనా బిల్డింగ్ కట్టుకుంటే, వారు ఒక శాతం సెస్‌ను ఈ సొసైటీకి కట్టవలసి ఉంటుంది. అయితే, గత ప్రభుత్వంలో చట్టాలన్నీ, వారికి చుట్టాలుగా మారిపోవడం వల్ల ఈరోజు ఈ సమస్యలన్నీ వచ్చాయి. క్రొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత, చట్టాలన్నీ బయటకు తీసి, ఏ ఆశయం మేరకు ఆయా చట్టాలు ఏర్పడ్డాయో, అందుకనుగుణంగా అమలు చేయడానికి శ్రీ చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో మేము కృషి చేస్తున్నాం.

2008వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 'అసంఘటిత కార్మికుల చట్టం'ని తీసుకురావడం జరిగింది. ఇళ్ళలో పనిచేసేవారు, భవన కార్మికులు, తోపుడు బళ్ళవాళ్ళు, వివిధ రంగాల్లో ఉన్న కార్మికులందరికీ న్యాయం చేయాలని, 2008లో కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకువస్తే, ఇంతవరకు ఆ చట్టానికి అతీగతీ లేకుండా చేసినటువంటి ప్రభుత్వాలను మనం ఇంతవరకు చూశాం. మా ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ చట్టాన్ని బయటకు తీసింది. ఈరోజు ఈ చట్టాన్ని మనం చక్కగా అమలు చేయగలిగితే, ఈ 13 జిల్లాల్లో ఒక కోటి ఎనిమిది లక్షల మందికి అనేక విధాలుగా మనం సహాయ పడడానికి అవకాశం ఉంటుంది.

గత ప్రభుత్వాలు ఒక శాతం సెస్ కింద ఇప్పటికే కలెక్ట్ చేసినటువంటి మొత్తంలో, రాష్ట్ర విభజన తరువాత మన రాష్ట్ర వాటా క్రింద 13 జిల్లాలకు రూ.850 కోట్లు సొసైటీ డబ్బు రావడంజరిగింది. ఇప్పటికి వివిధ విషయాల్లో రూ.64.17కోట్లు ఖర్చు చేయడం జరిగింది.

11 అంశాలలో కార్మికులకు సహాయపడడం జరుగుతోంది. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.2,00,000/- కార్మికశాఖ నుండి ఇప్పటివరకు అందజేస్తున్నాం. శాశ్వత అంగవైకల్యం జరిగిన వారికి, రూ.25,000/- నుండి రూ.2,00,000/- వరకు సహాయాన్ని అందించడానికి ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా సహజమరణ సహాయం రూ.30,000/-లు ఇస్తున్నాం. ప్రసూతి సంబంధిత సహాయం రు.10,000/-లు ఇస్తున్నాం. ఎవరైనా తాత్కాలికంగా అస్వస్థతకు గురైతే వారికి రూ.4500/-లు ఇస్తున్నాం. ఎవరైనా కార్మికుడు చనిపోతే, వారి అంత్యక్రియలకు రూ.10,000/- ఇస్తున్నాం. భద్రత-నైపుణ్యం-అభివృద్ధిలో కార్మికుడి శిక్షణ గురించి రూ.8000/- ఇస్తున్నాం. పింఛను పథకం గురించి రూ.3000/-లు ఇస్తున్నాం. ఎవరైనా కార్మికుడి ఇంట్లో వివాహం జరిగితే రూ.5000/- ఇస్తున్నాం. దురదృష్టవశాత్తు మరణించిన వారి ఆర్థిక సహాయం గురించి, ఈ కార్యక్రమాలన్నీ చేస్తున్నాం.

ఏ ఉద్దేశంతో అయితే ఈ సెస్‌ను వసూలు చేస్తున్నామో, ఆ ఉద్దేశం నెరవేరేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుంది. ఈ డబ్బులు మన దగ్గర చాలా ఉన్నాయి. ఇప్పుడిస్తున్న పరిహారం తక్కువగా ఉండడంతో దానిని పెంచడానికి ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అయితే, చనిపోయిన కార్మికుడి కుటుంబానికి ఒకేసారి ఈ పరిహారం మొత్తాన్నిస్తే, వేగంగా ఖర్చు అయిపోతుందన్న భావనతో, ఈ పరిహారాన్ని పెంచి, దానిని ఒక డిపాజిట్ రూపంలో చేసి, ప్రతి ఒక్క కార్మికుడి కుటుంబానికి ప్రతి నెల రూ.1000/- లేదా రూ.2000/- పెన్షన్ వచ్చే విధంగా ఒక పథకాన్ని కూడా ఆలోచిస్తున్నామని మీద్వారా సభ్యులందరికి తెలియజేస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలలో కార్మికులు ఉన్నారు. రాష్ట్రంలోని 80 శాతం మంది ఈ కార్మిక ఉపాధి శాఖపై ఆధారపడి ఉన్నారు. అటువంటి శాఖను గత ప్రభుత్వం మూలన పడేసింది. ఈ సభకూ, సభలో ఉన్న సభ్యులందరికీ, ఈ సభ తరపున కార్మికులందరికీ కూడా నేను తెలియజేసేదేమంటే ఏ ఒక్క కార్మికుడికి ఏవిధమైన కష్టమొచ్చినా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఈ ప్రభుత్వం సహాయ సహకారాలందించే విధంగా కార్మిక ఉపాధి శాఖను పునరుద్ధరిస్తుంది.

ఈమధ్య చెన్నైలో జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన చాలామంది కార్మికులు చనిపోయారు. గౌరవ ముఖ్యమంత్రిగారు వెంటనే అధికారులను అప్రమత్తం చేయడమే కాకుండా స్వయాన వారే అక్కడకు వెళ్ళారు. నేను కూడా అక్కడకు వెళ్ళి వారం రోజులపాటు అక్కడే ఉండి, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి, డెడ్‌బాడీలను వారి స్వగ్రామాలకు తరలించడమే కాకుండా, వారిని అన్ని విధాల ఆదుకునే కార్యక్రమాలన్నీ చేశామని తెలియజేస్తున్నాను. ప్రతిపక్షాలతోపాటు ఎవ్వరూ కూడా

ఒక్క ఆరోపణ కూడా చేయలేదు. 'శబాష్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాగా చేసింది' అని అనిపించుకోవడం జరిగింది.

సభ్యులు శ్రీ ఆంజనేయులు గారు చెప్పిన విషయాలన్నీ పరిగణనలోనికి తీసుకుని అన్నివిధాల కార్మికులకు న్యాయం చేయడానికి ఈ ప్రభుత్వం పనిచేస్తుందని సభాముఖంగా సభ్యులకు, ప్రజలకు తెలియజేస్తున్నాను.

...

శ్రీ జి.వి. ఆంజనేయులు (ఉంగుటూరు): అధ్యక్షా, గత 10 సంవత్సరాలలో యాక్సిడెంట్ జరిగిన కార్మికులకు, గాయపడిన వారిని సరిగా ఆదుకోలేని సందర్భాలు అనేకం ఉన్నాయి. అటువంటి వారికి పరిహారం సక్రమంగా అందేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పెంచాలని ప్రభుత్వాన్ని, మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను. గత 10 సంవత్సరాలుగా కార్మిక సభ్యత్వ నమోదు కార్యక్రమం సరిగా జరగలేదు. ఇంకా అనేక మంది కార్మికులు సభ్యత్వ నమోదు చేసుకోలేదు. వినతులు/ఫిర్యాదులు రోజూ సభ్యత్వం నమోదు చేసుకొనే అవకాశం వారికి కల్పించాలని కోరుతున్నాను.

శ్రీమతి వి.అనిత (పాయకరావు పేట): అధ్యక్షా, మొట్టమొదటిసారిగా మాట్లాడడానికి అవకాశమిచ్చినందుకు ఇక్కడున్న వాళ్లందరికీ ధన్యవాదాలు. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు గాని, 1996 (27) యాక్ట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు గాని, 2008కి సంబంధించిన యాక్ట్ ప్రకారం గానీ ఈ రోజు వరకు కార్మికులకు సంబంధించిన ప్రయోజనాలు వారికి అందలేదని తెలియజేస్తున్నాను. ఈ రోజు గౌరవ మంత్రివర్యులు చెప్పిన విధంగా కార్మిక నమోదు చాలా తక్కువగా జరుగుతున్నాయన్న విషయాన్ని సభాపూర్వకంగా గౌరవ మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను. అదేవిధంగా ప్రమాదంలో గాయపడిన వారికి జీవిత బీమా, సంక్షేమం, వైద్య, భద్రత విషయాలలో ప్రభుత్వ అండదండలు ఉండాలి. ఎందుకంటే రాబోయే కాలంలో భవననిర్మాణ కార్మికుల పాత్ర చాలా ఎక్కువగా ఉంటుంది. ఈరోజు మనమందరం ఇంత మంచి భవనాల్లో ఉన్నామంటే, ప్రభుత్వాలు, పట్టణాలు ఆధునీకరణ జరిగాయంటే కార్మికులే పునాది. కాబట్టి, కార్మికుల విషయంలో చిన్న చూపు చూడకుండా, వాళ్లకి కావలసిన ప్రతి సదుపాయం కల్పించే విధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను. బీమా విషయంలో రూ.68/-, రూ.12/- ప్రీమియం అని మంత్రివర్యులు తెలియజేసారు. ఆ ప్రీమియాన్ని పెంచే ఉద్దేశం ఏమైనా ఉందా అని మంత్రివర్యులను అడుగుతున్నాను. ఒక చిన్న విన్నపము అధ్యక్షా. వివాహ కానుక క్రింద రూ.5,000/- కార్మికులకు ఇస్తున్నారు. ఆ స్కీమ్ వర్తింపునకు వీఆర్వో సంతకం తప్పకుండా ఉండాలని నిబంధన పెట్టారు. 'ఏ చెట్టుకు ఆ గాలి' ఉంటుందన్నట్లుగా వీఆర్వోల పరిధిలో కూడా అవినీతి ఎక్కువగా ఉంటోంది. గత 10 సంవత్సరాలలో ఇంచుమించుగా రాష్ట్రం మొత్తం అవినీతిలో కూరుకుపోయింది. ఈ రూ.5,000/-లకు సంతకం పెట్టడానికి వీఆర్వోలు

కార్మికులను చాలా ఇబ్బంది పెడుతున్న సందర్భాలు మా దృష్టికి వచ్చాయి. వీటిని కూడా సరిచేయాలని మంత్రివర్యులను కోరుతున్నాను. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ విషయంలో ప్రత్యేక ప్యాకేజ్ ఇవ్వగలిగితే బాగుంటుంది. వికలాంగులకు, బెడ్‌పేషంట్స్‌కు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, వారికి పెన్షన్ ఇవ్వగలిగితే బాగుంటుంది. గత ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు, మన ప్రభుత్వంలోనైనా వారిని మంచి బాటలో నడిపించాలని కోరుతున్నాను.

శ్రీ బొండా ఉమామహేశ్వర రావు (విజయవాడ సెంట్రల్)ః భవన నిర్మాణ కార్మికుల చట్టం పూర్తిగా అందరికీ ఉపయోగపడాల్సిన అవసరముంది. ఇందులో 13 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని గౌరవ మంత్రి గారు చెప్పారు. సభ్యుల నమోదును పూర్తిస్థాయిలో పెంచాల్సి ఉంది. భవననిర్మాణ కార్మికులు, కాంట్రాక్టర్ల క్రింద పనిచేసే వ్యక్తుల గురించి సరైన సమాచారం అందక లేబర్ యాక్ట్ ప్రకారం నమోదు కార్యక్రమం పూర్తిస్థాయిలో సక్రమంగా జరగడంలేదు. 90 రోజులు పనిచేయాలని, తెల్ల రేషన్‌కార్డులు ఉంటేనే సభ్యత్వ నమోదు చేసుకోవాలనే నిబంధనలు ఈ యాక్ట్‌లో ఉండటం వల్ల చాలా మంది సభ్యత్వం తీసుకోలేకపోతున్నారు. గౌరవ మంత్రిగారు మాట్లాడుతూ, 20 లక్షల మంది భవననిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారని, కానీ సభ్యులుగా 13 లక్షల మంది మాత్రమే నమోదయ్యారన్నారు. దీనికొరకు 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించి, కాంట్రాక్టర్లు/బిల్డర్స్ నుంచి పూర్తిస్థాయిలో కార్మికుల వివరాలు సేకరించి, ఎక్కువమంది కార్మికులు నమోదు అయ్యేట్లుగా, వారికి ఉపాధి కల్పించేవిధంగా ఈ చట్టంలో మార్పులుచేసి, పకడ్బందీగా అమలుచేస్తే బాగుంటుంది. అలాగే ఆటోడ్రైవర్లు, ఆటోమెబైల్స్ రంగంలో పనిచేసే మెకానిక్కులకు, చిన్న చిన్న ముఠా కార్మికులకు, అసంఘటిత కార్మికులకు కూడా ఈపథకం వర్తింపచేస్తే వారందరికీ మేలు జరుగుతుంది. ఇది ప్రభుత్వం నుంచి ఇచ్చే నిధులు కాదు కాబట్టి, భవన నిర్మాణ వ్యయంలో 1 శాతం చొప్పున వసూలుచేసిన నిధులు కనుక ఈ పథకం పూర్తి స్థాయిలో అమలుచేస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు (టెక్కలి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ వీరాంజనేయులు, శ్రీమతి అనిత, శ్రీ బొండా ఉమామహేశ్వర రావు మొదలగు వారు చెప్పిన విషయాలు నేను మొదటనే చెప్పడం జరిగింది. 20 లక్షల మంది సభ్యులుగా చేరవలసిన అవసరముంది. ఇప్పటికి 13 లక్షల మంది సభ్యులుగా నమోదు చేసుకున్నారు. ఇతర ప్రాంతాలలో కార్మికులు చనిపోతే ఆ సమాచారం కూడా వచ్చే పరిస్థితి లేదు. అందుకోసం ప్రత్యేక డ్రైవ్ పెట్టాం. పైలట్ ప్రాజెక్ట్ క్రింద మొదటగా శ్రీకాకుళం జిల్లాను ఎంపిక చేసి, రెవెన్యూ, లేబర్ శాఖాధికారులు ప్రతి ఇంటికి వెళ్ళి మన రాష్ట్రంలోనే కాకుండా, ఇతర ప్రాంతాలలో పనిచేసే కార్మికుల సమాచారం కూడా సేకరించి ప్రతి ఒక్కరినీ సభ్యులుగా చేర్చడానికి ప్రయత్నం చేస్తున్నాం. సభ్యులు శ్రీ వీరాంజనేయులు గారు చెప్పినట్లు ప్రమాదం జరిగిన కార్మికులకు ప్రమాద తీవ్రతను బట్టి రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు పరిహారం ఇస్తున్నాము. దీనిని కూడా పెంచాలని ప్రయత్నం చేస్తున్నాం.

వ్యవసాయ వృత్తులలో ఉన్నవారిని కూడా కార్మికులుగా గుర్తించేందుకు కూడా ప్రభుత్వం తగు చర్యలు చేపడుతుంది. కొత్తగా ఎన్ఆర్ఇజీఎస్ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇందులో పనిచేసిన కార్మికులను కూడా ఈ చట్టంలోకి తీసుకొని అన్ని సదుపాయాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత 10 సంవత్సరాల ప్రభుత్వ కార్యక్రమానికి, ఇప్పుడున్న ప్రభుత్వ కార్యక్రమానికి 5, 6 మాసాలలో వ్యత్యాసం చూస్తారు. ఈ ప్రభుత్వం బాగా పనిచేస్తుందని, మా సంక్షేమం గురించే పని చేస్తుందని రాష్ట్రంలో కార్మికులు చెప్పుకొనే విధంగా చేయాలనేదే మా ప్రభుత్వ ధ్యేయం. గౌరవసభ్యులు మా దృష్టికి తీసుకొని వచ్చిన సమస్యలను, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మా ప్రభుత్వం పనిచేస్తుందని మీ ద్వారా సభ్యులకు, రాష్ట్రంలోని కార్మిక సోదరీ సోదరులందరికీ తెలియజేస్తున్నాను.

(ఈ సందర్భంలో సభా ప్రతిపక్ష నాయకుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి తను మాట్లాటడానికి మైక్ కావాలని సభాపతిని కోరసాగారు)

MR.SPEAKER: We have to complete the Question Hour by 10 O'clock.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, మామూలుగా ప్రమాదం జరిగినపుడు ఆ ప్రమాద తీవ్రతను బట్టి తీవ్రత ఎక్కువగా ఉంటే రూ.5 లక్షల దాకా పరిహారం ఇస్తున్నారు. ఇన్సిడెంట్ ప్రొఫైల్ సరిగా లేకపోతే, అంత పెద్ద ప్రమాదంగా ప్రొజెక్ట్ కాకపోతే రూ.5 లక్షలు కాదు కదా, రూ.50 వేలు లేదా రూ.30 వేలు ఇచ్చే పరిస్థితి ఉంటుంది, ఒక్కొక్కసారి అది కూడా ఉండదు. ఎంత పరిహారం ఇస్తున్నామో కూడా మరచిపోతున్నాం. మొన్ననే శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు నేను కూడా వెళ్లాను. ఎక్కడైతే ఆ ప్రమాదం జరిగిందో ఆ బిల్డర్‌పై కేసు నమోదు చేయడం, వారినుంచి కూడా పరిహారం వచ్చేటట్లు చేస్తే ఆ కుటుంబానికి చాలా మంచిచేసిన వారమవుతాం. ఇటీవల చెన్నైలో జరిగిన ప్రమాదంబారిన పడిన 42 మంది ఇంటికి మేము వెళ్ళడమే కాకుండా, వారికి కోర్టులలో మాపార్టీ తరపున అండగా నిలిచాం. పార్టీ తరపున చేయడమనేది ప్రక్కనపెట్టి, ప్రభుత్వమే పాలసీపరంగా స్పందించాల్సిన అవసరముంది. దయచేసి దీన్ని దృష్టిలో పెట్టుకోవాల్సిందిగా సవినయంగా మంత్రివర్యులను కోరుతున్నాను.

...

శ్రీ కె.అచ్చెన్నాయుడు (టెక్కలి): అధ్యక్షా, మొన్న చెన్నైలో జరిగిన భవన ప్రమాదం సంఘటనకు సంబంధించి ఈ ప్రభుత్వం ఎంతవరకు చెయ్యాలో అంతా చేసింది. అయితే మన కార్మికులు ఇతర రాష్ట్రాలలో పని చేస్తున్నప్పుడు వర్క్‌మెన్ కాంపెన్సేషన్ అన్నది యాక్ట్ ప్రకారం మన కార్మికులు ఏ రాష్ట్రంలో పని చేస్తున్నారో ఆ రాష్ట్ర ప్రభుత్వం, ప్రమాదం జరిగినప్పుడు ఎక్కడైతే పని చేస్తున్నారో ఆ పనికి సంబంధించిన భవన యాజమాన్యాలు చెల్లించాల్సినఅవసరముంది. ఆ ఘటన జరిగిన వెంటనే సంబంధిత ప్రిన్సిపల్ సెక్రటరి

మరియు కమీషనర్లకు నేను ఆదేశాలివ్వడం జరిగింది. దానిపై ప్రభుత్వం మరియు సంబంధిత యాజమాన్యాలతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. తమిళనాడు ప్రభుత్వం కూడా సంబంధిత యజమానులపై కేసులు బుక్ చేసింది. ఆ యాజమాన్యాల నుంచి కాంపెన్సేషన్ కింద సుమారు ఏడెనిమిది లక్షల రూపాయలు రావలసివుంది. దానిపై మన అధికారులు కూడా సంబంధిత యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. వారి నుంచి కాంపెన్సేషన్‌ను తప్పకుండా బాధిత కార్మిక కుటుంబాలకు ఇప్పించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నాము. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. అట్లాగే మొన్న జరిపించిన ఒక సర్వేలో ఉత్తరాంధ్ర జిల్లాల కార్మికులు దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాలకు కూడా చాలా దూరం వలసలు పోతున్నట్లు తేలింది. వలసలు కూడా రెండు రకాలుగా పోతున్నట్లు తేలింది. పని లేనందువలన వలసలు పోతున్న వారు ఒక రకమైతే రెండు మూడు నెలలపాటు ఒక కుటుంబంలోని వారు ఒక ప్రాంతానికి పోయి 50, 60 వేల రూపాయలు సంపాదించుకొని రావచ్చన్న ఆలోచనతో ఇంకొక రకం వారు పోతున్నారు. మన దగ్గర భవన నిర్మాణ కార్మికులకు రోజుకు వంద రూపాయలో నూటా యాభై రూపాయలో ఇస్తుంటే తమిళనాడులో దాదాపు ఆరువందల రూపాయల వరకు ఇస్తున్నారు. అందువలన మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు కూడా మన రాష్ట్ర కార్మికుల వలసలు నివారించాలన్న ఆలోచనతోవున్నారు. మన రాష్ట్రంలో కూడా తమిళనాడు తరహాలో రోజువారీ కార్మికుల వేతనాన్ని పెంచే ఆలోచన చేయమని చెప్పారు. మేము ఆ దిశగా కూడా ప్రయత్నాలు చేస్తున్నాము. ఏదేమైనా మన రాష్ట్రం నుండి కార్మికులు ఉపాధి కోసం వలసలు పోకుండా నివారించడానికి అవసరమైన అన్ని చర్యలూ ఈ ప్రభుత్వం తీసుకుంటుందని తెలియజేస్తున్నాను. మన రాష్ట్రంలో కార్మికుల వేతనాలు ఎక్కడైతే తక్కువగా వున్నాయో వాటిని పెంచి కార్మికుల వలసలను నివారించేందుకు అన్నివిధాలా ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేస్తున్నాను. అదే విధంగా గౌరవ సభ్యులిచ్చిన సలహాలు మరియు సూచనలు కూడా తీసుకుని ప్రభుత్వం ముందుకెళ్తుందనే విషయాన్ని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

**MR. SPEAKER: Question No. 166 (22) , Minister for Social Welfare**

**ప్రశ్న నెంబర్ 166(22)**

**సర్వశ్రీ కిడారి సర్వేశ్వరరావు, రాజన్నదొర పేడిక, శ్రీమతి గిడ్డి ఈశ్వరి, ఎమ్మెల్యేలు**

**గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం, సాధికారత మరియు గిరిజన సంక్షేమం, సాధికారత శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;**

అ) ఎస్‌సి, ఎస్‌టి ఉప- ప్రణాళిక క్రింద విభిన్న పథకాల కోసం మంజూరు చేసిన నిధుల వివరాలు;

ఆ) జిల్లా వారీగా మంజూరు చేసిన నిధుల వివరాలు?

**సాంఘిక సంక్షేమం, సాధికారత మరియు గిరిజన సంక్షేమం, సాధికారత శాఖ మంత్రి (శ్రీ రావెల కిషోర్‌బాబు) (ప్రత్తిపాడు– ఎస్సీ):**

అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు అడిగినటువంటి ప్రశ్నకు జవాబు చెప్పే ముందు ఒక చిన్న విషయాన్ని తమరి ద్వారా సభకు తెలియజేయాలని అనుకుంటున్నాను. ఈ సభకు తెలుసు. 2013వ సంవత్సరం జనవరి మాసం 24వ తేదీనాడు ఎస్.సి. ఎస్.టి. సబ్ ప్లాన్‌ను ప్రభుత్వం సభ ముందు ఆమోదం నిమిత్తం ఉంచడం జరిగింది.

అధ్యక్షా, ఎస్‌సిఎస్‌టి సబ్ ప్లాన్‌కు సంబంధించి గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్న రెండు భాగాలుగా ఉంది. ఏమిటంటే "1) Details of funds sanctioned for different schemes under SC, ST Sub-Plan; 2) District wise details of funds sanctioned".

సభ్యుల ప్రశ్నకు సమాధానం చెప్పిన తదుపరి పూర్తి వివరంగా సభకు వినిపించదలిచాను.

అ) ఎస్‌సిఎస్‌పి క్రింద మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 8584.83 కోట్ల మొత్తాన్ని కేటాయించడమయింది. ఇందులో రూ.7576.27 కోట్లను 42 శాఖాధిపతులకు కేటాయించడం జరిగింది. మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013-14 సంవత్సరానికి ఎస్‌సిఎస్‌పి క్రింద మొత్తం వ్యయం రూ.5013.95 కోట్లు. ఎస్‌సిఎస్‌పి 2013-14 క్రింద శాఖ వారీగా, పథకం వారీగా వ్యయం, విడుదల, ఖర్చు వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

రూ.366659.68 లక్షల వ్యయంతో 2013-14 సంవత్సరంలో గిరిజన ఉప- ప్రణాళికను అమలుపరచడమయింది. ఇందులో మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 261708.57 లక్షలను విడుదల చేయడమయింది. ఖర్చు చేసిన మొత్తం రూ.203078.79 లక్షలు. వ్యయం 60.37 శాతంగా ఉంది. 2013-14 సంవత్సరంలో శాఖవారీగా, పథకం వారీగా నిధుల విడుదలలు, వ్యయం మిగులు వివరాలను అనుబంధం - I గా సభా సమక్షంలో ఉంచడమయింది.

ఆ) 2013-14 సంవత్సరం కోసం ఎస్‌సిఎస్‌పి క్రింద నూతన ఆవిర్భావ రాష్ట్రానికి సంబంధించి 42 హెచ్‌ఓడిలకు గాను 24 హెచ్‌ఓడిలు ఖర్చు చేసిన రూ. 1820.14 కోట్ల వ్యయానికి సంబంధించి జిల్లా వారీ వివరాలను జతపర్చడమయింది. మిగిలిన 18 హెచ్‌ఓడిలకు సంబంధించిన జిల్లా వారీ వివరాలను సంకలనం చేయడమవుతున్నది. దానిని త్వరలోనే సభా సమక్షంలో ఉంచడమయింది.

గిరిజన ఉప- ప్రణాళిక క్రింద, 2013-14 సంవత్సరంలో పథకాలు, పనుల కార్యక్రమాన్ని అమలుపర్చేందుకు రూ.203078.79 లక్షల మొత్తాన్ని వినియోగించడమయింది. పథకాలు, మంజూరు చేసిన జిల్లా వారీ నిధుల వివరాలను అనుబంధం - II,III లుగా సభా సమక్షంలో ఉంచడమయింది.

**(A 31-page annexure was enclosed to the answer which would become part of the proceedings at the time of printing)**

అధ్యక్షా, రూ.8584.83 కోట్లు ఎస్.సి. సబ్ ప్లాన్ క్రింద గత 2013-14 సంవత్సరానికి నిధులను కేటాయించడం జరిగింది. కేటాయించిన మొత్తంలో రూ.7576.27 కోట్లను 42 డిపార్ట్‌మెంట్స్‌కు కేటాయించడం జరిగింది. కేటాయించిన మొత్తంలో రూ.5013.95 కోట్లు ఉమ్మడి రాష్ట్రంలో ఎస్.సి.సబ్‌ప్లాన్ క్రింద ఖర్చుచేయడం జరిగింది. జిల్లా వారీగా కేటాయించిన మొత్తం గురించిన వివరాలను తెలియజేయమని గౌరవ సభ్యులు అడిగారు.

జిల్లా వారీగా వివరాలకొచ్చేసరికి మనకు కొత్తగా ఏర్పడినటువంటి రాష్ట్రంలోని 13 జిల్లాలకు సంబంధించిన వివరాలను నేను సభాముఖంగా ఇవ్వదలిచాను. శ్రీకాకుళం జిల్లాకు ఎస్‌సి సబ్ ప్లాన్ క్రింద రూ. 109.98 కోట్లు, విజయనగరం జిల్లాకు రూ. 126.89 కోట్లు, విశాఖపట్టణం జిల్లాకు రూ. 532.38 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాకు రూ. 249.12 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాకూ రూ. 82.11 కోట్లు, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు రూ.31.17 కోట్లు, కృష్ణా జిల్లాకు రూ. 21.81 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ. 29.65 కోట్లు, ప్రకాశం జిల్లాకు రూ. 41.81 కోట్లు, చిత్తూరు జిల్లాకు రూ. 26.11 కోట్లు, అనంతపురం జిల్లాకు రూ. 13.93 కోట్లు, వైఎస్ఆర్ కడప జిల్లాకు రూ.9.85 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ. 36.19 కోట్లు.

తరువాత ఎస్‌టి సబ్ ప్లాన్ క్రింద గత సంవత్సరం 2013-14 సంవత్సరంలో రూ.366659.68 లక్షలు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. అందులో నుంచి రూ. 261708.57 లక్షలను విడుదల చేయడం జరిగింది. ఖర్చుకు వచ్చేసరికి రూ.203078.79 ఉమ్మడి రాష్ట్రంలో ఖర్చు చేయడం జరిగింది. వ్యయం 60.37 శాతంగా ఉంది. మన రాష్ట్రంలోని 13 జిల్లాల వారీగా వివరాలకొచ్చేసరికి శ్రీకాకుళం జిల్లాకు రూ. 73.28 కోట్లు, విజయనగరం జిల్లాకు రూ. 60.26 కోట్లు, విశాఖపట్టణం జిల్లాకు రూ. 69.12 కోట్లు, తూర్పు గోదావరి

జిల్లాకు రూ. 184.19 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాకూ రూ. 150.70 కోట్లు, కృష్ణా జిల్లాకు రూ. 176.82 కోట్లు, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు రూ.120.57 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ. 148.32 కోట్లు, ప్రకాశం జిల్లాకు రూ. 160.49 కోట్లు, చిత్తూరు జిల్లాకు రూ. 225.44 కోట్లు, అనంతపురం జిల్లాకు రూ. 140.66 కోట్లు, వైఎస్ఆర్ కడప జిల్లాకూ రూ. 151.25 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ. 159.00 కోట్లు.

ఎస్సి–ఎస్టి సబ్‌ప్లాన్‌కు సంబంధించిన జిల్లాల వారీగా వివరాలను సభకు తెలియజేయడం జరిగింది. ఆ నిధులను 44 డిపార్ట్‌మెంట్స్‌కు విడుదల చేయడం జరిగింది. ఎస్సిఎస్టి సబ్ ప్లాన్ అమలుకు సంబంధించి 2013 సంవత్సరం జనవరి 24 వ తారీఖున ప్రభుత్వం ఒక చట్టం చేయడం జరిగింది. చట్టం రావడానికి గల ప్రధానమైనటువంటి కారణం 1975 వ సంవత్సరం నుంచి ప్లానింగ్ కమీషన్ ద్వారా అమలుజరుగుతున్నటువంటి ఎస్సి ఎస్టి సబ్ ప్లాన్ ఏదైతే ఉందో ఆ కార్యక్రమం భారత దేశ వ్యాప్తంగా సరిగా అమలుజరగడంలేదనేదే ప్రధాన కారణం. అందులో భాగంగానే మన రాష్ట్రంలో కూడా ఎస్సిఎస్టి సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వ్యయం చేయాలనే ఉద్దేశంతో చట్టం తీసుకురావడం జరిగింది. గతంలో ప్లానింగ్ కమీషన్ ద్వారా ఖర్చుచేస్తున్న ఎస్సిఎస్టి సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయకపోగా వాటిని దారిమళ్లించడం జరుగుతూ ఉండేది.

MR.SPAKER: O.K. Minister garu, you can go into the details at the time of supplementaries. Sri K.Sarveswara rao.

శ్రీ కిడారి సర్వేశ్వరరావు (అరకు వ్యాలీ): అధ్యక్షా, గౌరవ మంత్రి గారు చెప్పినదంతా బాగుంది. అయితే మనకు స్వాతంత్ర్యం వచ్చి 68 సంవత్సరాలు పూర్తయింది. మొన్ననే మనం అంతా కూడా 68 వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్నాం. ప్రభుత్వం హరిజన, గిరిజన ప్రజల కోసం, గిరిజన తండాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వేల కోట్ల నిధులను వెచ్చిస్తున్నామనే వార్తలను ప్రతి నిత్యం దినపత్రికల్లో మనం చూస్తూనే ఉన్నాం. కానీ నాకు తెలిసి గిరిజన తండాలు, గిరిజన ప్రాంత ప్రజానీకం తినడానికి తిండి లేకుండా, ఉండటానికి ఇల్లు లేకుండా, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి కనీస రవాణా సౌకర్యం లేకుండా, కనీసం తాగడానికి మంచినీరు కూడా లేనటువంటి ప్రాంతాలు అనేకం ఉన్నాయి. అందుకుగల ప్రధాన కారణం ప్రభుత్వాల లోపమని కూడా నేను అనుకుంటున్నాను. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 68 సంవత్సరాలు పూర్తి అయిందని మనమేదైతే బీరాలు పలుకుతున్నామో అందుకు తగ్గట్టుగా గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం చేసినదేమిటనే విషయాన్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది.

MR.SPEAKER: No speeches please. Only supplementaries.

శ్రీ కిడారి సర్వేశ్వరరావు (అరకు వ్యాలీ): అధ్యక్షా, రాష్ట్రంలోని గిరిజన ప్రజానీకం అంతా ఎదురుచూస్తోంది. ప్రభుత్వం నుంచి సహాయాన్ని ఆశిస్తున్నారు.

నేను గిరిజన శాసనసభ్యుడిని కావున నాకు కొంచెం సమయం ఎక్కువగా ఇవ్వమని కోరుతున్నాను. ఐటీడీఏల ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చెబుతున్నారు. కానీ ఏజెన్సీ ఏరియాలో మలేరియా మరణాలు సంభవిస్తున్నా, కొత్త కొత్త జబ్బులు వచ్చినా గిరిజనులను పట్టించుకొనే నాథుడు లేని పరిస్థితి ఉంది. ఇప్పుడే మంత్రిగారు సమాధానమిస్తూ 1980లోనే దీనికి రూపకల్పన జరిగింది, కానీ 24.01.2013న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలులోకి వచ్చిందని చెప్పారు. కానీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక ఈ చట్టానికి రూల్స్ రూపకల్పన చేయలేకపోయింది. ఈ ప్రభుత్వంలో అయినా ఈ చట్టానికి రూల్స్ రూపొందించాల్సిన అవసరం చాలా ఉందని మీకు తెలియజేస్తున్నాను. చట్టంలోని లొసుగుల వల్ల కోట్లాది రూపాయల ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పడుతున్న పరిస్థితి ఉంది. కాబట్టి సబ్‌ప్లాన్ లోని నిధులను పక్కదారి పట్టకుండా ఎస్సీ, ఎస్టీ ప్రజానీకానికే ఆ నిధులు వెచ్చించేలా వారి సంక్షేమానికి ఉపయోగపడే విధంగా ఏర్పాటుచేయమని మిమ్మల్ని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః గొల్లపల్లి సూర్యారావు గారూ......

శ్రీ కె.సర్వేశ్వరరావు (అరకు వ్యాలీ- ఎస్టీ)ః అధ్యక్షా, ఒక్క నిమిషం సమయం ఇవ్వండి. ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న.

మిస్టర్ స్పీకర్ః అన్ని ప్రశ్నలు ముఖ్యమైనవే.

శ్రీ కె.సర్వేశ్వరరావు (అరకు వ్యాలీ)ః అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఈ రాష్ట్రంలోని చట్టాలలో చాలా ముఖ్యమైనది. గత బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఎంత మొత్తం కేటాయించారు? ఆ నిధులను ఎంతవరకు వినియోగించారు? ఆ నిధులు ఇంకా మిగిలి ఉంటే ఈ బడ్జెట్‌లో కలిపి ఖర్చుపెట్టడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు పెట్టడానికి కొన్ని రాష్ట్రాలలో గిరిజన సలహా మండళ్లను ఏర్పాటుచేశారు. ఆ విధంగా మీరు కూడా గిరిజన సలహా మండలి ఏర్పాటుచేయడానికి ఏమైనా ఆలోచన చేస్తున్నారా? గత సంవత్సరం 120 మంది శాసనసభ్యులతో అరకులో గిరిజనులతో సమావేశమై గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని డిక్లరేషన్ కూడా చేశారు. ఆ డిక్లరేషన్‌ను అమలుచేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? గవర్నర్ గారి ప్రసంగంలో కూడా 50 సంవత్సరాలు పైబడిన గిరిజనులందరికి పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు.

మిస్టర్ స్పీకర్: మీరు వేసిన ప్రశ్న ఒకసారి చూడండి. ఆ ప్రశ్నకు సంబంధించి మాట్లాడండి. లేదంటే మరో ప్రశ్న వేయండి. దయచేసి కూర్చోండి. గొల్లపల్లి సూర్యారావు గారూ.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు –ఎస్సీ): అధ్యక్షా, సుమారు పది సంవత్సరాల తరవాత, (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ కె.సర్వేశ్వరరావు తదితరులు వెల్‌లోకి వచ్చారు) 2004 నుంచి 2013 వరకు రెండు ప్రభుత్వాలు మా సామాజికవర్గానికి చెందినవారికి సాంఘిక సంక్షేమ మంత్రి పదవి ఇవ్వని విషయాన్ని, మా సాధకబాధకాలు, మా అవసరాలను గమనించిన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు పది సంవత్సరాల తర్వాత మొట్టమొదటగా మా సామాజికవర్గానికి చెందినవారికి సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖలు కేటాయించినందుకు వారికి ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

హరిజన, గిరిజనులకు ఉద్ధరించడానికి, వారి స్థితిగతులు మెరుగుపరచుకొనేందుకు దళిత సామాజికవర్గానికి చెందిన శాసనసభ్యుడికి సంక్షేమ శాఖల మంత్రిగా నియమించిన సందర్భంలో ఇక్కడ మమ్మల్ని మాట్లాడకుండా చేయడం చాలా బాధాకరంగా ఉంది. మంత్రిగారు చెప్పినవన్నీ వాస్తవాలు.

మిస్టర్ స్పీకర్: జగన్మోహన్ రెడ్డి గారూ, మీ శాసనసభ్యులను వారి సీట్లకు వెళ్లమని చెప్పండి.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు): మంత్రిగారి పర్యవేక్షణలో వేలాది కోట్ల రూపాయలు దుర్వినియోగం కాకుండా పదమూడు జిల్లాలలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వెచ్చించేలా పర్యవేక్షణ మాత్రం తప్పకుండా చేయాలి. అవసరమైతే విజిలెన్స్, మానిటరింగ్ కూడా చేయాలి. (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తమ సీట్లకు తిరిగి వెళ్లారు) భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరవాత డా.బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో దళిత, గిరిజన వర్గాలకు పొలిటికల్ రిజర్వేషన్లు కావాలని కోరారు. అదే విధంగా పంచాయతీ సర్పంచ్ నుంచి పార్లమెంట్ సభ్యునివరకు పొలిటికల్ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. రెండోది ఉద్యోగాలలో రిజర్వేషన్లు. అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఆర్థిక సమానత్వం సాధించడం కోసం బిల్లుపెట్టి వేలాది కోట్ల రూపాయలు ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులను సక్రమంగా వెచ్చించేలా మంత్రిగారు పర్యవేక్షణ పూర్తిగా చేయాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్‌: సర్వేశ్వరరావు గారూ, ఒక్క నిమిషంలో ముగించండి.

శ్రీ కె.సర్వేశ్వరరావు (అరకువ్యాలీ): అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో ముఖ్యమంత్రిగారి విచక్షణాధికారం మేరకు నిధులు మళ్లించే అవకాశం, వెసులుబాటు ఉందని, తద్వారా కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పడతాయని దళిత, గిరిజన సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఆ విధంగా వెసులుబాటు కల్పించే అవకాశం ఏమైనా ఉందా? గిరిజన ప్రాంతాలలోని గిరిజన ప్రజానీకానికి తాగునీరు, వైద్యం, రోడ్లు వంటి మౌలికసౌకర్యాలు కల్పించే ఆలోచన ఏమైనా చేస్తున్నారా? గిరిజన ప్రాంతంలోని ఐటీడీఏలకు ఎంత మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారో కూడా చెప్పాల్సిన అవసరముంది.

శ్రీమతి జి.ఈశ్వరి (పాడేరు): అధ్యక్షా, మొట్టమొదటిసారిగా ఈ సభలో నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు గౌరవసభాపతి గారికి నమస్కారం. అలాగే మా పార్టీ అధ్యక్షులకు నమస్కారం. మన రాష్ట్రంలో 175 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. మా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు శాసనసభా నియోజకవర్గాలుంటే అందులో ఆరింటిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే కేవలం ఒక్క నియోజకవర్గంలో మాత్రమే తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ఈ ప్రభుత్వానికి ఏమైనా చిత్తశుద్ధి ఉంటే వారి పార్టీ నుంచి ఒక గిరిజన శాసనసభ్యుడు ఎన్నికైనా కూడా వారికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఎందుకు ఇవ్వలేదని నేను ప్రశ్నిస్తున్నాను. గిరిజనులకు మంత్రి పదవి కేటాయించకపోవడం చూస్తుంటే ఎస్సీ, ఎస్టీలకు ఈ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో..,

మిస్టర్ స్పీకర్: మీరు ముందుగా ప్రశ్న అడగండి.

శ్రీమతి జి.ఈశ్వరి (పాడేరు): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నిధులను పూర్తిగా వారి సంక్షేమానికి వినియోగించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సంక్షేమ పథకాలలో కలుపుతున్నారా, లేక ప్రత్యేకంగా చూపిస్తున్నారా? సబ్‌ప్లాన్ నిధులు నోడల్ ఏజెన్సీ ద్వారా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఎస్సీ, ఎస్టీ నిధుల పర్యవేక్షణ కమిటీలు, గిరిజన సలహా మండళ్లలో అధికార పార్టీ శాసనసభ్యులతోబాటు ప్రతిపక్షపార్టీల శాసనసభ్యులను, ప్రజాసంఘాలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులను కూడా నియమించాలని కోరుతున్నాను.

....

(శ్రీ పీడిక రాజన్నదొర మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

మిస్టర్ స్పీకర్: ఇంకా చాలా ప్రశ్నలున్నాయి. దయచేసి కూర్చోండి.

శ్రీ రావెల కిషోర్‌బాబు (ప్రత్తిపాడు ): అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు నిధుల మళ్లింపు గురించి మాట్లాడారు. దీని గురించి నేను ఒక స్టేట్‌మెంటు ఇవ్వాలనుకుంటున్నాను. దయచేసి మీరు(ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) ఈ విషయంలో అన్యథా భావించి వెల్‌లోకి వచ్చి గొడవ చేయవద్దు. సబ్‌ప్లాను నిధులను దారి మళ్లించిన ఘనత గత ముఖ్యమంత్రి దివంగత శ్రీ రాజశేఖర్ రెడ్డి గారికి దక్కుతుందని నేను తెలియచేస్తున్నాను. రూ.40,000 కోట్ల సబ్‌ప్లాన్ నిధులు రాజశేఖర్ రెడ్డి గారు దారి మళ్లించారు. ఆయన ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి ధన యజ్ఞం చేసి, జలయజ్ఞానికి నిధులు మళ్లించిన విషయాన్ని గౌరవ శాసన సభ్యులు గమనించాలి. గత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు రూ.40,000 కోట్ల ఎస్సీ, ఎస్టీ నిధులను జలయజ్ఞం కోసం దారి మళ్లించిన విషయాన్ని గౌరవ శాసన సభ్యులు గమనించాలని కోరుతున్నాను. రాష్ట్రంలో దళితులకు భూమి ఉన్నది కేవలం 6 శాతం. ఈ 6 శాతం భూమి కూడా డ్రై ల్యాండ్ ప్రాంతంలో వుంది. అది రాళ్లు, రప్పలతో కూడిన భూమి. ఇరిగేషన్ డిపార్ట్‌మెంటుకు నీళ్లివ్వడానికి జల యజ్ఞం పేరుతో రూ.40,000 కోట్లు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాను నుంచి నిధులను మళ్లించడం జరిగింది. ఇది ఎంత వరకు న్యాయం? ఇది చాలా దుర్మార్గమని నేను భావిస్తున్నాను. అంతే కాకుండా ఎస్సీ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేసిన ఘనత కూడా గత ప్రభుత్వాలది ఇంకా చెప్పాలంటే గత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు ఎస్సీ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేశారు.

(ఈ సందర్భంలో వైసిపీ సభ్యులు తమ స్థానంలో నిలబడి అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

ఇది చరిత్ర. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలి. మీరు మంచి ప్రశ్న అడిగినప్పుడు జవాబు చెప్పాలి. ఎస్సీ, ఎస్టీ నిధులను ఏ విధంగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి వినియోగించాలన్న అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు దయచేసి సభ్యులంతా సంయమనం పాటించాలని కోరుతున్నాను. గతంలో ఎన్‌టి రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ కార్పోరేషన్‌కు సంబంధించిన నిధులను చక్కగా వినియోగించి లక్షలాది మందికి లబ్ధి చేకూర్చారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి హయాంలో 1994-95 నుంచి 2003-04 కాలంలో 7,41,000 లబ్ధిదారులుంటే 2004-05 నుంచి 2013-14 సంవత్సరానికి వచ్చే సరికి ఈ లబ్ధిదారుల సంఖ్య 4,95,000 కు కుదించబడింది. గతంలో ఉన్న ముఖ్యమంత్రి గారు ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ లోన్లను, సఫాయ్‌కర్మచారీ లోన్లను మాకు వద్దని చెప్పడం వలన వేలాది మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు నష్టపోయారు. వీటన్నింటిని మేము సరిచేసి ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ లోన్లను, సఫాయ్‌కర్మచారీ లోన్లను మేము పునరుద్ధరించడానికి ప్రయత్నం చేస్తున్నాం. అంతే కాకుండా సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల విషయంలో 2004-05 సంవత్సరం నుంచి 2013-14 సంవత్సరాల మధ్యలో 2312 హాస్టళ్లు వుంటే 2240 హాస్టళ్లకు తగ్గిపోయాయి. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి హయాంలో..

MR.SPEAKER: Minister garu, please confine your answer to the question.

శ్రీ రావెల కిషోర్ బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాను నిధులను ఎవరో దారి మళ్లించారని గౌరవ శాసన సభ్యులు అభియోగం మోపినప్పుడు, ఆ విధంగా దారి మళ్లించకుండా మీరు చర్యలు తీసుకోండని చెప్పినప్పుడు ఎవరు దారి మళ్లించారో తెలుసుకోవాలి. ఎందుకు దారి మళ్లించారో తెలుసుకోవాలి. దానిని మనం సరి చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీల భవిష్యత్తు కోసం నిధులను సక్రమంగా వినియోగించుకోవాలి.

మిస్టర్ స్పీకర్: ఓకె. మినిస్టర్ గారూ, ప్లీజ్ కన్‌క్లూడ్.

శ్రీ రావెల కిషోర్ బాబు (ప్రత్తిపాడు ): అధ్యక్షా, రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ల్యాండ్ ఎలియనేషన్ ప్రొహిబిషన్ యాక్టుకు అమెండ్‌మెంటు తీసుకుని వచ్చి పేద ప్రజల అసైన్డు భూములను ప్రభుత్వం లాగేసుకుని సెజ్‌లకు కేటాయించిన విషయాన్ని కూడా నేను మీదృష్టికి తీసుకు వస్తున్నాను. ఈ విధంగా గత ప్రభుత్వాలు చేసిన దుర్మార్గాల వలన, గత ప్రభుత్వాలు చేసిన అవినీతి వలన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లానులో నిధులన్నీ కూడా దారి మళ్లిపోయాయి.

(ఈ సందర్భంలో వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

గౌరవ శాసన సభ్యురాలు మాట్లాడుతూ గిరిజన శాఖను ఎస్సీ వ్యక్తికి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. గిరిజనులు, దళితులు అన్నదమ్ములు. మనం ఇక్కడ రాజకీయాలు మాట్లాడుకోకూడదు. మనం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాను గురించి మాట్లాడుతున్నప్పుడు, దళితుల అభివృద్ధి గురించి మాట్లాడుతున్నప్పుడు రాజకీయాలను తీసుకు రాకూడదు. పార్టీలకతీతంగా మనం పనిచేయాలి. పార్టీలకతీతంగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి గురించి మనం మాట్లాడాలి తప్ప రాజకీయాలు మాట్లాడకూడదని గౌరవ సభ్యురాలికి తెలియచేస్తున్నాను. ఎస్సీ, ఎస్టీల నిధులకు సంబంధించి ఈ మధ్య ఒక చట్టం వచ్చింది. ఈ చట్టం రావడానికి ప్రధాన కారణం గత ప్రభుత్వాలు చేసిన దుర్మార్గం, గత ప్రభుత్వాలు చేసిన అవినీతి, గత ప్రభుత్వాలు దారి మళ్లించిన విధానం వలన ఈ చట్టం వచ్చింది. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాను నిధులను మేము ప్రతీ పైసా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి మాత్రమే వినియోగిస్తాము. (మైకు ఆపు చేయబడింది)

మిస్టర్ స్పీకర్: క్వశ్చన్ అవర్‌ని ఒక గంటలో పూర్తి చేసుకోవాలి. ఒక్క ప్రశ్నకే ఇంత సమయం తీసుకుంటే మిగతా ప్రశ్నలన్నీ ఎప్పుడు పూర్తవుతాయి?

శ్రీ సి.హెచ్.అయ్యన్న పాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, ఒక్క నిమిషం. ఇది మంచి సంప్రదాయం కాదు. ఎందుచేతనంటే ఎస్సీ, ఎస్టీ నిధులు దారి మళ్లించారా అని వారు అడిగారు. దారి మళ్లించిన విషయం వాస్తవం. ఎప్పుడు మళ్లించారు, ఎందుకు మళ్లించారో మంత్రి గారు చెబుతున్నప్పుడు వాళ్లు వినాలి కదా? ఇదేమి సంప్రదాయం?

మిస్టర్ స్పీకర్: నెక్స్ట్ క్వశ్చన్. మినిస్టర్ ఫర్ ఇరిగేషన్.

(వైసీపీ సభ్యులచే అంతరాయం)

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, మంత్రి గారు సమాధానం చెప్పిన తరువాత క్లారిఫికేషన్ అడగటానికి మాకు మైకు ఇవ్వాలి కదా? అధ్యక్షా, ప్రశ్న ఏమిటంటే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద వివిధ పథకాల కోసం మంజూరు చేసిన నిధుల వివరాలేమిటి అనేది ప్రశ్న. రెండవ క్వశ్చన్ జిల్లాల వారీగా మంజూరు చేసిన వివరాలు ఏమిటనేది. కానీ దానికి మంత్రి గారు ఏమని సమాధానం చెబుతున్నారు? గతంలో నిధులను దారి మళ్లించారు, ఏమేమో చేశారు అని ఏవేవో విషయాలను ప్రస్తావనకు తీసుకు వస్తున్నారు (మైకు కట్ చేయబడింది).

MR.SPEAKER: Jagan Mohan Reddy garu, Minister has answered the question substantially. Members have asked supplementary questions. He has answered supplementary questions also.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, రాజన్నదొర గారు నేరుగా మంత్రి గారిని ఒకే ప్రశ్న అడగదలచుకున్నారు. ఆ ప్రశ్న ఏమిటంటే ట్రైబల్ సబ్‌ప్లానుకు ఇంతకు ముందు మీరు కేటాయించిన నిధులకు, ఖర్చు చేసిన నిధులకు తేడా వుంది, ఖర్చు చేయని నిధులను ఇప్పుడు మీరు ప్రవేశ పెట్టబోయే సబ్‌ప్లాను నిధుల్లో కలుపుతున్నారా లేదా అని ప్రశ్నించారు. ఒక్క నిమిషం ఆయనకు అవకాశం ఇవ్వండి. ఆ ప్రశ్నను అడిగిన సభ్యులు రాజన్న దొర గారే కదా ఆయన పేరు కూడా ఆ ప్రశ్నలో ఉంది కదా! ఒకే ఒక్క నిమిషం పడుతుంది, వారికి అవకాశం ఇవ్వండి.

మిస్టర్ స్పీకర్ : ప్రతి ప్రశ్నకు చాలా మంది సిగ్నెటరీస్ ఉన్నారు. అవకాశం ఇవ్వాలి. We have to complete the entire Question Hour in one hour. అటువంటప్పుడు తర్వాత ప్రశ్నలకు సమయం సరిపోదు. మీ సభ్యురాలు ఈశ్వరి గారు ఎప్పుడు మాట్లాడలేదంటే అందరినీ బ్యాలెన్స్ చేసుకుంటూ అవకాశం ఇస్తున్నాం. We are following the balancing mechanism.

(ఈ దశలో సభ్యులు శ్రీ పీడిక రాజన్నదొర తనకు అవకాశం ఇవ్వాల్సిందిగా అభ్యర్థించసాగారు)

మీ ప్రశ్నని, on your behalf, Leader of the Opposition has already asked the question. మినిస్టర్ సోషల్ వెల్ఫేర్ .. రాజన్నదొర గారి తరఫున Leader of the Opposition has asked question. (Addressing the Minister) Can you answer it now ?

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు ): అధ్యక్షా, ఏవైతే సబ్‌ప్లాన్ నిధులు..

(ఈ దశలో తమ సభ్యుడు శ్రీ పీడిక రాజన్నదొరకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ ప్రతిపక్ష నాయకులు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అభ్యర్థించసాగారు)

మిస్టర్ స్పీకర్ : ఎస్.. రాజన్నదొరగారూ.

శ్రీ పీడిక రాజన్న దొర (సాలూరు): ఎక్కువ ప్రశ్నలు అడగను సార్. రెండే రెండు ప్రశ్నలను తమరి ద్వారా ప్రభుత్వాన్ని అడగదల్చుకున్నాను. వారిచ్చిన లెక్కల ప్రకారం ఎస్సీ ప్లాన్ క్రింద రూ.3,570 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. వాళ్లు 60 శాతమని చూపించారు, కానీ అది 55 శాతం మాత్రమే. అలాగే ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద రూ.1,635 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. అంటే 55 శాతం మాత్రమే ఖర్చు పెట్టారు. మిగిలిన దానిని రేపు మీరు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఓపెనింగ్ బ్యాలెన్స్‌గా తీసుకొస్తున్నారా? మిగిలిన నిధులను క్యారీ ఫార్వార్డ్ చేస్తున్నారా ఆ విషయాన్ని క్లారిఫై చేయమని కోరుతున్నాను.

శ్రీ రావెల కిషోర్ బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, ఈ సబ్‌ప్లాన్ యాక్ట్‌ను గత ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు వారు కూడా సభ్యులుగా ఉన్నారు. వారికి అన్ని విషయాలు తెలుసు. యావరేజ్ ఎక్స్‌పెండీచర్ వచ్చేసి, శాంక్షన్‌కి అలాట్‌మెంట్‌కి, బీఆర్‌ఓ రిలీజ్ చేసిన దానికి, అల్టిమేట్ ఎక్స్‌పెండీచర్‌కి, ప్రతి దానికి పది పది శాతం చొప్పున తేడా ఉంది. ఈ అన్‌స్పెంట్ అమౌంట్‌ని నాన్ లాప్సబుల్‌గా చేసి తర్వాత బడ్జెట్‌లోకి తీసుకురావడానికి సంబంధించిన చర్చ జరిగినప్పుడు వారు కూడా సభ్యులుగా ఉన్నారు. దాని తర్వాత సంవత్సరంలో ప్రవేశపెట్టే బడ్జెట్‌ని శాసనసభ ఆమోదించాలి. కాబట్టి శాసనసభ ఆమోదించే బడ్జెట్ గురించిన విషయాలను ముందుగా మనం ఊహించకూడదు, రీజడ్జ్ చేయకూడదు. తర్వాత జరిగిన శాసనసభ అనుమతితో unspent moneyని తర్వాత బడ్జెట్‌లోకి తీసుకురావాలని అప్పుడు నిర్ణయం జరిగింది. తప్పకుండా ఈ నిధులను నాన్-ల్యాప్సబుల్ చేస్తాము. అయితే మీరు అడిగిన ప్రశ్న దారి మళ్లింపు అన్నది మాత్రం, దానికి మీరే బాధ్యులు అనే విషయాన్ని మీరు గమనించాలి. ఎందుకంటే మీలో చాలా మంది ఆ ప్రభుత్వంలో ఉన్నారు. మేము మాత్రం ఆ పని చేయమని మనవి చేస్తున్నాము.

**MR. SPEAKER: Now, Question No. 63 (23); Minister for Irrigation..**

**ప్రశ్న నెం.63 (23)**

**శ్రీ జి. బుచ్చయ్య చౌదరి, ఎం.ఎల్.ఎ.**

**గౌరవనీయులైన సాగునీటి పారుదల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారాన్ని తెలియజేస్తారా?**

(అ) గోదావరి డెల్టా ఆధునికీకరణకు సంబంధించిన పనులను చేపట్టిన విషయం వాస్తవమేనా?
(ఆ) అయితే, ఇప్పటివరకు ఆ పనులను పూర్తి చేయకపోవడానికి కారణాలేమిటి?
(ఇ) గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

గౌరవనీయులైన సాగునీటి పారుదల శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు) ః

(అ) అవునండీ.

(ఆ) పనులు పూర్తికాకపోవడానికి గల కారణాలు ః

1. పనులను పూర్తి చేయడంలో జాప్యానికి ఒప్పంద సంబంధ అంశాలు, తగినన్ని పని కాలావ్యవధులు లభ్యంగా లేకపోవడం ప్రధాన కారణాలుగా ఉన్నాయి.
2. పలుమార్లు టెండర్లను ఆహ్వానించినప్పటికీ ఎటువంటి స్పందన లేదు.

(ఇ) వచ్చే రెండు సంవత్సరాల కాలంలో తగురీతిగా నిపుణుల కమిటీతో సంప్రదించి ఆధునికీకరణ పనులను పూర్తి చేయాలని కార్యక్రమాన్ని రూపొందించడమైనది.

శ్రీ జి.బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్)ః అధ్యక్షా, 2007వ సంవత్సరంలో గోదావరి డెల్టాను ఆధునికీకరణ కార్యక్రమం క్రింద రూ.3,660 కోట్లతో ఈ పథకాన్ని రూపొందించి ఆ రోజున టెండర్లను పిలిచారు. రూ.2000 కోట్లకు ఆ టెండర్ ఖరారైన విషయం మంత్రి గారికి కూడా తెలుసు. ఆ రోజున పెద్ద పెద్ద ప్యాకేజీలను పిలిచారు. జలయజ్ఞంలో ఏ విధంగా దోపిడీ చేశారో, అదే విధంగా గోదావరి డెల్టా మోడ్రనైజేషన్‌లో కూడా దోపిడీకి తెరలేపి, పెద్ద పెద్ద ప్యాకేజీలకు టెండర్లను పిలిచారు. అడ్వాన్స్ మొబిలైజేషన్ కూడా ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు కేవలం రూ.750 కోట్లకు సంబంధించిన పనులు మాత్రమే జరిగాయనేది సూటిగా తెలుస్తున్న విషయం. మరి ఎందువల్ల ఈ పెద్ద పెద్ద ప్యాకేజీలు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు, ముఖ్యంగా ఎవరైతే ఈ మధ్య కోర్టు కేసుల్లో ఉన్నారో వారికి ఇవ్వడం జరిగింది. రాంకీ అనే కంపెనీ పెద్ద ప్యాకేజీలన్నింటినీ దక్కించుకొని కనీస పనులను కూడా చేయకుండా

నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా ఒదిలేసి వెళ్లిన విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందా? అదే విధంగా ఏవైతే ప్రపోజ్ చేశారో, ఏది అవసరమో, ఏది అనవసరమో తేల్చకుండా అనవసరమైన విషయాలన్ని చేర్చి పెద్ద ప్యాకేజీలుగా చేర్చడం వల్ల, ఈ పనులు ఆగిపోతున్న విషయం యదార్ధమేనా? పంట విరామం ఇవ్వడానికి రైతులు సిద్ధంగా లేనప్పుడు తక్కువ కాలంలో ఎక్కువ మంది కాంట్రాక్టర్లను పెట్టి చిన్న చిన్న ప్యాకేజీలను సత్వరం పూర్తి చేయడానికి చర్యలను తీసుకోకుండా ఎందుకు ఊరుకున్నారని అడుగుతున్నాను.

అదే విధంగా దీని మీద దాదాపుగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ గానీ డ్రెయిన్స్ గానీ ఎనిమిదిన్నర కిలో మీటర్ల పరిధిలో పనులు చేయాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ కెనాల్స్ అన్నీ పూడిపోయాయి. ముఖ్యంగా కోనసీమ లాంటి ప్రాంతంలో వర్షా కాలం వస్తే అవుట్ ఫాల్స్ ఏదీ పని చేయనందు వల్ల పంట పోలాలన్నీ మునిగిపోతున్నాయి. మరి ఏదైతే మీరు ప్యాకేజీలు ఇచ్చారో వాళ్లకు లాభాలు వచ్చే పనులను మాత్రమే చేస్తూ, నిర్మాణాలు ఏవైతే ఉన్నాయో.. లాగ్ చేంబర్స్ గానీ, అవుట్‌ఫాల్స్ లిస్టులు గానీ, వంతెనలు గానీ అవేవి పనులను మొదలు పెట్టకుండా ఒదిలేశారు. ఇవాళ జల రవాణాకు అనుగుణంగా ఉండాలని మోడ్రన్ డ్రైనేజ్ స్కీములను పెట్టారు. ఆ విధంగా ఎక్కడా చేయడం లేదు. ఏదీ మొదలు పెట్టాలేదు. ఇవాళ మేము ఒక్కటే కోరుతున్నాము. దీని మీద ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని వేసి సమగ్ర విచారణ చేసి బాధ్యులను శిక్షించడం, మరొకటి సత్వరమే మోడ్రన్ డ్రైనేజ్ స్కీముని పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

అట్లాగే అవుట్ ఫాల్ లిస్టులన్నీ కూడా డెవలప్ చేయాలి. రెవెన్యూ ఛానెల్స్ ఏవైతే ఆక్రమణలకు గురవుతున్నాయో వాటన్నింటినీ తొలగించాలి. గతంలో చంద్రబాబు నాయుడు గారి హయంలో డ్రైనేజీ ఆధునికీకరణ చేయడం జరిగింది. మరలా వాటి మెయింటెనెన్స్ లేకుండా పోతోంది. వాటి విషయంలో ఏమి చర్య తీసుకుంటారు. ఈ ఫండ్స్‌లో రూ.3660 కోట్లు ఏదైతే మిగులుతుందో ప్రాధాన్యతా క్రమంలో దేనికి మార్పులు, చేర్పులు చేస్తారో తెలియజేయాల్సిందిగా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

అట్లాగే, గోదావరి కాలుష్యానికి ప్రధానంగా రాజమండ్రి నగరం, ధవళేశ్వరం ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాలతో కూడిన మురుగంతా మంచి నీళ్లలో కలుస్తుంది. మేము ఒక ప్రపోజల్ ఇచ్చాము. ఏదైతే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ స్కీము ఈస్టరన్ కెనాల్ క్రిందకు వెళుతుందో, ఆనకట్ట దిగువ భాగంలోని ఇసుక ప్రాంతంలోకి ఆ మురుగు వెళ్లవలసి ఉంది. కనీసం దానికి ఈస్టర్న్ కెనాల్ క్రింద ఒక యుటి(అండర్ టన్నెల్) కట్టి, కాటన్ గారి టైమ్‌లో కట్టిన కాలువ ఏదైతే ఉందో దాని ఆక్రమణలను తొలగించి క్వారీ కెనాల్‌ను అభివృద్ధి చేసి, నీటినంతా దిగువ భాగానికి తరలించే కార్యక్రమం చేపడతారా లేదా, తెలియజేయాల్సిందిగా మంత్రి గారిని అడుగుతున్నాను. దానికి తగిన నిధులను కూడా కేటాయించాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ వి.జోగేశ్వరరావు (మండపేట)ః అధ్యక్షా, ఈ గోదావరి మోడ్రనైజేషన్ స్కీము మా మండపేట నియోజక వర్గంలో మూడు మెయిన్ కెనాల్స్ వెళుతున్నాయి. ఒకటి మండపేట మెయిన్ కెనాల్, రెండవది పోరంకి మెయిన్ కెనాల్, మూడవది మొయిన్ కెనాల్. దీంట్లో రాంకీ సంస్థ వారు పనులను మొదలు పెట్టారు తప్ప, ఎక్కడా పనులను పూర్తి చేయలేదు. కేవలం మట్టి పనులను మాత్రమే చేసి కాంక్రీట్ పనులన్నింటినీ ప్రక్కన పెట్టారు. 2008వ సంవత్సరం నుంచి 4 షార్ట్ క్లోజర్లు, ఒక లాంగ్ క్లోజర్ ఇచ్చినప్పటికీ మండపేట మెయిన్ కెనాల్‌ని 35 శాతం మాత్రమే పూర్తి చేశారు. ఒక్క బ్రిడ్జ్‌ని కూడా కట్టలేదు. బ్రిడ్జ్‌లను మొదలు పెట్టారు గానీ అన్నింటిని సగంలోనే ఒదిలేసి వెళ్లిపోయారు. మండపేట మున్సిపల్ లిమిట్స్‌లో ఒక బ్రిడ్జ్‌ని కూలగొట్టి అట్లాగే ఒదిలేసి వెళ్లారు. దాని వల్ల ఒక వ్యక్తి చనిపోవడం కూడా జరిగింది. ఈ పనులన్నీ ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? అసలు చేస్తారా చేయరా? 61వ క్లాజ్ ప్రకారం గత ప్రభుత్వం రాంకీ వారి మీద ఎందుకు చర్యలు తీసుకోలేదు? పై వివరాలను తెలియజేయాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం)ః అధ్యక్షా, 2007వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం దాదాపు రూ.3,361 కోట్లతో గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులను చేస్తామని చెప్పడం జరిగింది. ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి ఈ రెండు జిల్లాల్లో ప్రధానంగా రూ.2,042 కోట్లకు సంబంధించిన టెండర్లను పిలిచి రూ.725 కోట్లకు సంబంధించిన పనులను పూర్తి చేయడం జరిగింది. గౌరవ సభ్యులు బుచ్చయ్య చౌదరి గారు గానీ, జోగేశ్వరరావు గారు గానీ ఈరోజున ఆ ప్రాంతానికి సంబంధించిన ఏ శాసన సభ్యుడికి అయినా మీరు మైక్ ఇచ్చినట్లయితే అరగంటసేపు వాళ్ల నియోజక వర్గాల్లోని బాధలు, కష్టాల గురించి చెబుతారు. ఏవరైతే గుత్తేదార్లు రాంకీ గానీ ఇతర సంస్థల గురించి గౌరవ సభ్యులు చెప్పారో ఆ అంశాలన్నింటినీ నోట్ చేసుకున్నాము. దీని మీద ఒక నిపుణుల కమిటీని వేసి, గోదావరి డెల్టా పరిధిలో రెండు జిల్లాలకు సంబంధించిన శాసన సభ్యులు ఎవరైతే వస్తారో వాళ్లందరినీ కూడా మా చేంబర్‌కి పిలిచి, ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రయారటైజ్ చేసి రాబోయే రెండు సంవత్సరాల్లో ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నిస్తాం. ఎందుకంటే గత ప్రభుత్వాలు కాలువ పనులకు ఇపిసి ద్వారా టెండర్లను పిలిచారు. ఏవైనా చేయలేని పనులకు ఇపిసి సిస్టం పెడతారు. కానీ గత పాలకులు చేసిన ఘనకార్యాలు, వాళ్ల పాపాలన్నీ ఇవాళ మాకు శాపాలుగా మారాయి.

...

(అధికారపక్షం వైపు సభ్యుల నుంచి సభలో చప్పట్లు)

కాబట్టి వాటినన్నింటినీ సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ప్రజలు మరియు రైతులు ఆ బాధ్యతను మాపైన పెట్టారు. తప్పకుండా ఈ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపల శాసనసభ్యులనందరినీ కూర్చోబెట్టి వాళ్లు చెప్పే కష్టాలు గానీ, బాధలు గానీ, వారి వారి నియోజకవర్గాల్లోని అనుభవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎక్స్‌పర్ట్ కమిటీకి ఇచ్చి ఆ

కమిటీతో ప్రయార్టైజ్ చేయించి అందుకు సంబంధించి ప్రభుత్వం వైపు తీసుకోవాల్సిన నిర్ణయానికి అనుగుణంగా నిధులను కేటాయించి తప్పకుండా రాబోయే రెండు సంవత్సరాల్లో గోదావరి డెల్టా మాడ్రనైజేషన్ పనులను పూర్తిచేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. అదే విధంగా శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు మరియు శ్రీ వి.జోగేశ్వరరావు గారు చెప్పినవన్నీ మరియు శ్రీ జ్యోతుల నెహ్రూ గారు చెప్పాలనుకునే వన్నీ అంశాలను పరిగణనలోకి తీసుకుని గోదావరి డెల్టా మాడ్రనైజేషన్ పనులను పూర్తిచేస్తామని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

**MR.SPEAKER: Question No. 24 (113), Minister for Rural Development.**

ప్రశ్న నెంబర్: **113 (24)**
**శ్రీ రాజన్నదొర పీడిక, ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;**

అ) రాష్ట్రంలో 1983 కు పూర్వం వివిధ ప్రభుత్వ పథకాల క్రింద మంజూరు చేసిన, నిర్మించిన గృహాల జిల్లా వారీ వివరాలేమిటి;

ఆ) రాష్ట్రంలో 1983 నుండి 2003 వరకు మంజూరు చేసిన, పూర్తి చేసిన గృహాల జిల్లా వారీ వివరాలు;

ఇ) 2004 నుండి 2013 వరకు మంజూరైన, నిర్మించిన గృహాల జిల్లావారీ వివరాలు;

ఈ) 1979 నుండి 2014 వరకు దళితులకు, గిరిజనులకు ప్రత్యేకంగా మంజూరు చేసిన గృహాల వివరాలు;

ఉ) యూనిట్ వ్యయ వివరాలతోపాటు ప్రస్తుతం కొత్త గృహాల మంజూరు విధివిధానాలేమిటి?

**గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, పరిసరాల పరిశుభ్రత (శ్రీమతి కిమిడి మృణాళిని) (చీపురుపల్లి) మంత్రి గారి సమాధానం:**

అ) 1983కు పూర్వం రాష్ట్రంలో 37,508 గృహాలను మంజూరు చేసి, నిర్మించడమయింది. జిల్లా వారీ వివరాలను అనుబంధం - I లో చూపడమయింది.

ఆ) రాష్ట్రంలో 1983 నుండి 2003 వరకు 29,03,672 గృహాలను మంజూరు చేసి, పూర్తి చేయడమయింది. జిల్లా వారీ వివరాలను అనుబంధం - IIలో చూపడమయింది.

ఇ) రాష్ట్రంలో 2004 నుండి 2013 వరకు 39,55,209 గృహాలను మంజూరు చేసి, నిర్మించడమయింది. జిల్లా వారీ వివరాలను అనుబంధం -III లో చూపడమయింది.

ఉ) రాష్ట్రంలో 1979 నుండి 2014 వరకు ఎస్సిలకు 20,82,390 గృహాలను, ఎస్టిలకు 6,60,427 గృహాలను మంజూరు చేసి, పూర్తి చేయడమయింది. జిల్లా వారీ వివరాలను అనుబంధం -IV లో చూపడమయింది.

ఊ) పథకం ఖరారు చేసే దశలో ఉంది.

ప్రశ్న నెం. 113 లోని (ఎ) ఖండానికి అనుబంధం

అనుబంధం - I

**1983** కు పూర్వం వివిధ పథకాల క్రింద మంజూరైన, నిర్మించిన గృహాల సంఖ్య వివరాలు

| వరుస సంఖ్య | జిల్లా | 1983 కు పూర్వం వివిధ పథకాల క్రింద మంజూరైన, నిర్మించిన గృహాల సంఖ్య |
|---|---|---|
| 1 | 2 | 3 |
| 1 | శ్రీకాకుళం | 3691 |
| 2 | విజయనగరం | 1757 |
| 3 | విశాఖపట్నం | 5911 |
| 4 | తూర్పు గోదావరి | 4244 |
| 5 | పశ్చిమ గోదావరి | 1541 |
| 6 | కృష్ణా | 2626 |
| 7 | గుంటూరు | 2554 |
| 8 | ప్రకాశం | 3201 |
| 9 | నెల్లూరు | 3489 |
| 10 | చిత్తూరు | 3215 |
| 11 | అనంతపురము | 1827 |
| 12 | కడప | 1819 |
| 13 | కర్నూలు | 1633 |
| | మొత్తం | **37508** |

కిమిడి మృణాళిని

గ్రామీణాభివృద్ధి మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి

ప్రశ్న నెం.113(బి) ఖండానికి అనుబంధం

## అనుబంధం - II

**1983 నుండి 2003 వరకు మంజూరైన, పూర్తయిన గృహాల వివరాలు**

| వరుస సంఖ్య | జిల్లా | 1983 నుండి 2003 వరకు మంజూరైన, పూర్తయిన గృహాల సంఖ్య |
|---|---|---|
| 1 | 2 | 3 |
| 1 | శ్రీకాకుళం | 200014 |
| 2 | విజయనగరం | 199053 |
| 3 | విశాఖపట్నం | 288650 |
| 4 | తూర్పు గోదావరి | 294212 |
| 5 | పశ్చిమ గోదావరి | 235611 |
| 6 | కృష్ణా | 213493 |
| 7 | గుంటూరు | 236071 |
| 8 | ప్రకాశం | 225755 |
| 9 | నెల్లూరు | 236002 |
| 10 | చిత్తూరు | 195795 |
| 11 | అనంతపురము | 223379 |
| 12 | కడప | 180883 |
| 13 | కర్నూలు | 174754 |
| | **మొత్తం** | **2903672** |

**కిమిడి మృణాళిని**
**గ్రామీణాభివృద్ధి మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి**

ప్రశ్న నెం. 113 లోని (సి) ఖండానికి అనుబంధం

అనుబంధం - III

**2004 నుండి 2013 వరకు మంజూరైన, పూర్తయిన గృహాల వివరాలు**

| వరుస సంఖ్య | జిల్లా | 2004 నుండి 2013 వరకు మంజూరైన, పూర్తయిన గృహాల సంఖ్య |
|---|---|---|
| 1 | 2 | 3 |
| 1 | శ్రీకాకుళం | 238530 |
| 2 | విజయనగరం | 287770 |
| 3 | విశాఖపట్నం | 356452 |
| 4 | తూర్పు గోదావరి | 415519 |
| 5 | పశ్చిమ గోదావరి | 283999 |
| 6 | కృష్ణా | 201835 |
| 7 | గుంటూరు | 266119 |
| 8 | ప్రకాశం | 222340 |
| 9 | నెల్లూరు | 232256 |
| 10 | చిత్తూరు | 332739 |
| 11 | అనంతపురము | 391898 |
| 12 | కడప | 317766 |
| 13 | కర్నూలు | 407986 |
| | **మొత్తం** | **3955209** |

**కిమిడి మృణాళిని**

**గ్రామీణాభివృద్ధి మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి**

ప్రశ్న నెం. **113** లోని (డి) ఖండానికి అనుబంధం
అనుబంధం - **IV**

**1979-2004** వరకు ఎస్ సి, ఎస్ టి లకు మంజూరైన, నిర్మించిన గృహాల వివరాలు

| వరుస సంఖ్య | జిల్లా | 1979-2004 వరకు మంజూరైన, నిర్మించిన గృహాలు | |
|---|---|---|---|
| | | ఎస్ సిలు | ఎస్ టిలు |
| 1 | 2 | 3 | 4 |
| 1 | శ్రీకాకుళం | 63482 | 54220 |
| 2 | విజయనగరం | 92122 | 68097 |
| 3 | విశాఖపట్నం | 72049 | 166729 |
| 4 | తూర్పు గోదావరి | 244246 | 51302 |
| 5 | పశ్చిమ గోదావరి | 220834 | 22303 |
| 6 | కృష్ణా | 163849 | 14827 |
| 7 | గుంటూరు | 188894 | 47816 |
| 8 | ప్రకాశం | 185804 | 23675 |
| 9 | నెల్లూరు | 200033 | 87355 |
| 10 | చిత్తూరు | 187417 | 32578 |
| 11 | అనంతపురము | 134230 | 32004 |
| 12 | కడప | 129414 | 45155 |
| 13 | కర్నూలు | 200016 | 23366 |
| | మొత్తం | **2082390** | **669427** |

కిమిడి మృణాళిని
గ్రామీణాభివృద్ధి మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి

(ప్రతిపక్ష నాయకులు శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వారి స్థానంలోనుండి గోదావరి డెల్టా మోడర్నైజేషన్‌కు సంబంధించిన ప్రశ్నకు సప్లిమెంటరీ కింద మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతి గారిని కోరారు. అదే సమయంలో ప్రతిపక్షపార్టీ సభ్యులు సర్వశ్రీ జ్యోతుల నెహ్రూ, చిర్ల జగ్గిరెడ్డి, డి.రాజా, కె.సర్వేశ్వరరావు తదితరులు వారి స్థానాలను వదిలి పోడియం వద్దకు చేరి తమ పార్టీ సభ్యులకు గోదావరి డెల్టా మాడ్రనైజేషన్‌కు సంబంధించన ప్రశ్నకు సప్లిమెంటరీ క్రింద మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

MR.SPEAKER: Kindly listen. గోదావరి డెల్టా మోడర్నైజేషన్ అనేది ముఖ్యమైన సబ్జెక్ట్. గౌరవ మంత్రిగారు వివరంగా చెప్పారు. గౌరవ సభ్యులందరితో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు చెప్పే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి ఎక్స్‌పర్ట్ కమిటీకి నివేదించి రాబోయే రెండు సంవత్సరాల కాలంలో గోదావరి డెల్టా మోడర్నైజేషన్ పనులను పూర్తిచేయడం జరుగుతుందని చాలా క్లియర్‌గా గౌరవ మంత్రి గారు చెప్పారు. కాబట్టి క్వశ్చన్ అవర్‌ను పూర్తిచేసుకునేందుకు సహకరించండి. తదుపరి బడ్జెట్ ప్రవేశపెట్టే కార్యక్రమం ఉంది.

(ప్రతిపక్షపార్టీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ మరియు శ్రీ చిర్ల జగ్గిరెడ్డి పోడియం దగ్గర నిల్చొని మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ సభకు అంతరాయం కల్గించసాగారు)

మిస్టర్ స్పీకర్: జ్యోతుల నెహ్రూ గారూ మీకు తెలుసు. గోదావరి డెల్టా మోడర్నైజేషన్ అనేది చాలా సీరియస్ సబ్జెక్ట్. You come in a different form. You come under either Rule 344 or 74. I will give you an opportunity to speak. But it is not possible during the Question hour. (అంతరాయం కొనసాగింపు) You come in a different form. You are not a signatory to this question. Please go back to your respective seats. Please co-operate. గోదావరి డెల్టా మోడర్నైజేషన్‌అనేది పెద్ద సబ్జెక్ట్. మీకు తెలియంది కాదు. రూల్ 344 క్రింద గానీ, 74 క్రింద గానీ చర్చను కోరండి అనుమతిస్తాను. దయచేసి మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి. సభ సజావుగా నడిచేందుకు సహకరించండి. బడ్జెట్ ప్రవేశపెట్టే కార్యక్రమం ఉంది. క్వశ్చన్ అవర్ పూర్తికావల్సి ఉంది. దయచేసి అందరి సహకారం అవసరం. గోదావరి డెల్టా మోడర్నైజేషన్ సబ్జెక్ట్‌ను ఎల్ఏక్యూ క్రింద టేకప్ చేయడం కష్టం. కాబట్టి రూల్ 344 క్రింద నోటీస్ పంపండి. తప్పకుండా చర్చకు అవకాశం కల్పిస్తాను. I understand the seriousness of the subject. You come under Rule 344 and I will give you an opportunity. Please try to understand. మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి. దయచేసి అర్థం చేసుకుని సహకరించండి.

రాజన్న దొర గారు మీరు సప్లిమెంటరీ క్రింద మాట్లాడండి.

(అంతరాయం కొనసాగింపు)

(ప్రతిపక్షపార్టీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ, శ్రీ డి. రాజా మరియు శ్రీ చిర్ల జగ్గిరెడ్డి పోడియం నుంచి వారి స్థానాలకు వెళ్లిపోయారు.)

శ్రీ రాజన్నదొర పీడిక (సాలూరు): అధ్యక్షా, మాట్లాడేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. అధ్యక్షా, నేను అడిగే ప్రశ్న ఏమిటంటే, "District-wise details of the houses sanctioned and constructed" నేను అడిగిన ప్రశ్నకు గాను "only constructed houses" వివరాలు మాత్రమే గౌరవ మంత్రి గారి సమాధానంలో ఉంది. కానీ మంజూరు చేసిన గృహాలు మరియు నిర్మించిన గృహాలు వేరు వేరుగా ఉంటాయి. ఉదాహరణకు వంద గృహాలు మంజూరైతే యాభై గృహాలు గానీ, అరవై గృహాలు గానీ మాత్రమే నిర్మించే అవకాశం ఉంటుంది. ఆ వివరాలు సమాధానంలో పొందుపర్చలేదు. తమరు గౌరవ మంత్రిగారిని ఆదేశించి నేను కోరిన వివరాలను సభకు సమర్పించవలసిందిగా కోరుతున్నాను.

అధ్యక్షా, ఈమధ్య కాలంలో అందరం చూస్తున్నదేమిటంటే ఎక్కడ చూసినా "ఇల్లు - బిల్లు" అనే మాటలే వినబడుతున్నాయి. ఎక్కడ చూసినా ఇదే సమస్యతో ప్రజలు బాధపడుతున్నారు. ఇల్లు నిర్మించుకున్న వారికి బిల్లు చెల్లింపు జరగలేదని, ఇల్లు మంజూరు కానీ వారు ఇల్లు మంజూరు కావాలని కోరుతున్నారు. కానీ ఇల్లు గానీ, బిల్లు గానీ ఏదీ లేదు. తనిఖీలు చేసి, విచారించి గతంలో అర్హులు కాని వారికి ఇండ్లు మంజూరు చేసి ఉంటే రద్దుపరుస్తామని, వాటిని అర్హులైన నిరుపేదలకు ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. చాలా సంతోషమే. సత్వరమే విచారణ జరిపి అర్హులైన వారికి ఇండ్లు మంజూరుచేయవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ సందర్భంగా నేను ఎక్కువ సమయం తీసుకోకుండా రెండే రెండు అంశాలను ప్రస్తావించదలిచాను. ఇండ్లు నిర్మించుకున్న పేదవారికి చెల్లించాల్సిన బిల్లులను ఎప్పటిలోగా చెల్లింపు చేస్తారు. ఇల్లు కట్టుకున్న వారికి ఏ తేదీ లోపల పెండింగ్ బిల్లును చెల్లిస్తారనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా సభకు చెప్పాలనేది మొదటి అంశం.

రెండవ అంశమేమిటంటే, చాలా మంది నిరుపేదలు ఇంటి మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. అర్హులైన ఎస్.టి. ఎస్.సి. వారికి సబ్ ప్లాన్ క్రింద 1.50 అలాగే మిగతా వారికి 1.00 నిష్పత్తి ప్రకారం ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ప్రభుత్వం ఏదైతే చె ప్పిందో ఆపద్ధతిలో కొత్తవారికి ఇండ్లు ఎప్పుడు మంజూరు చేయబోతున్నారు? ఈ రెండు అంశాలకు సంబంధించిన జవాబును గౌరవ మంత్రి గారు చెబుతారని ఆశిస్తున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళిని (చీపురుపల్లి): అధ్యక్షా, ఇప్పుడు హౌసింగ్ మీద రాష్ట్రమంతటా ఒక అయోమయ పరిస్థితి నెలకొని ఉంది. ఇదంతా గత ప్రభుత్వ హయాంలో, పది సంవత్సరాల కాలంలో గృహాల మంజూరులో గానీ, నిర్మాణాల్లో గానీ జరిగిన అవకతవకలు, అవినీతి తదితర కారణాల వల్ల ఈరోజున ఉన్నటువంటి నిజమైన అర్హులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎందుకంటే రాష్ట్రంలో 1,68,822 ఇండ్లు disabled positionలో ఉన్నాయి. వాటి పునర్నిర్మాణం కొరకు ప్రభుత్వం రూ.351.00 కోట్లు మంజూరుచేసి నిధులను విడుదల చేయడం జరిగింది. బిల్లుల చెల్లింపు ప్రక్రియ కూడా జరుగుతోంది. Disabled position లో ఉన్న houses ను ఏ విధంగా గుర్తించడం జరిగిందో వివరించదలిచాను.

...

ఈ రోజు కాంగ్రెస్ పార్టీ పైననో లేదా గత ప్రభుత్వాల పైననో మరెవరిపైనో నిందమోపడం కాదు. డిజేబుల్డ్ హౌసెస్ గుర్తించడమనేది గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. ఈ 1,68,822 ఇళ్లు కూడా ఏకారణాలతో డిజేబుల్డ్ అయ్యాయంటే డూప్లికేట్ రేషన్‌కార్డ్స్, రెండవది Invalid ration cards, మూడవది ineligible beneficiaries, and payment for two in one. ఒక ఇంటిపై రెండు బిల్లులు, ఒక ఇంటిపై మూడు బిల్లులు లేదా పాత ఇంటిపై బిల్లులు చూపించడం జరిగింది. అదే విధంగా ఇంటిపై ఇల్లు కట్టడం జరిగింది. ఈ విదంగా డబుల్ పేమెంట్స్ జరిగాయి.

(వై.ఎస్.ఆర్‌సీపీ సభ్యులచే అభ్యంతరం )

ఈ విధంగా రాష్ట్రంలో 656 మండలాలు ఇన్‌వాల్వ్ అయి ఉన్నాయి. ఈ విధంగా ఖర్చు అయిన మొత్తాలు అనంతపూర్ జిల్లాలో రూ.కో62.49లక్షలు కర్నూల్ జిల్లాలో రూ. కో60.71లక్షలు ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాల్లో ఇటువంటి అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇవన్నీ గత ప్రభుత్వం హయాంలోనే జరిగాయి. ఇటువంటి నిర్మాణాలపై విచారణ కూడా గత ప్రభుత్వమే చేపట్టింది. విచారణ చేపట్టడంతోపాటు ఈ విషయాలన్నీ గుర్తించడం కూడా గత ప్రభుత్వ హయంలోనే జరిగింది. అందువలనే అవసరమైన చెల్లింపుల అంశాలు కూడా confusion stage లో ఉన్నాయి. ఎవరైతే ఇళ్ల నిర్మాణానికి అర్హులైన నిరుపేదలున్నారో అటువంటి వారికి నిజంగా ఇళ్లు నిర్మించక పోగా మీ పేరుతో ఇల్లు ఉంది అంటే వారు ఆశ్చర్యపోయే పరిస్థితి నెలకొని ఉంది. నిజంగా ఎవరైతే అర్హులైన హౌస్ హోల్డర్స్ ఉన్నారో అటువంటి వారందరికి చెల్లింపులు చేయడం జరుగుతుంది. అదే విదంగా అనర్హులనుండి సొమ్మును ప్రభుత్వానికి తిరిగి రాబట్టడం కూడా జరుగుతుంది.

**MR.SPEAKER: Question No.(25) 75, Minister for Irrigation. From now, single supplementaries.**

ప్రశ్న నెంబరు.75 (25)

శ్రీ గొల్లపల్లి సూర్యారావు – ఎం.ఎల్.ఎ

**గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా.**

ఎ) తూర్పు గోదావరి జిల్లాలో రాజోలు సమీపంలో ఉన్న గోదావరి గట్టు పూర్తిగా నదిలోకి కూరుకు పోయిన విషయం వాస్తవమేనా ?

బి) రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, యుద్ధ ప్రాతిపదికపై సదరు గట్టు పునరుద్ధరణ పనులు శాశ్వత ప్రాతిపదికన చేపడతారా ?

సి) అయితే, ఎప్పటిలోగా పనులు పూర్తి చేయడమవుతుంది?

**సాగునీటి శాఖా మంత్రి ( శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు) :**

ఎ) అవునండి, తూర్పుగోదావరి జిల్లా రాజోలు సమీపంలో గోదావరి గట్టు పెద్ద ఎత్తున కొట్టుకు పోయి సెటిల్‌మెంట్స్ ఏర్పడ్డాయి.

బి) అవునండి కొట్టుకు పోయిన భాగం పునరుద్ధరణ కోసం శాశ్వత ప్రాతిదికన, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడం జరిగింది, పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

సి ) ప్రశ్నకు సమాధానం 2015 జూన్ చివరి నాటికి పూర్తిచేయడం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్ : సూర్యారావు గారు.

శ్రీ జి. సూర్యారావు (రాజోలు) : గౌరవ మంత్రిగారు చెప్పిన సమాధానంతో నేను పూర్తిగా సంతోషపడుతున్నాను. మంత్రిగారి హుందాతనం, ఈ శాఖ పట్ల వారికున్న అంకితభావం పట్ల I got respect. I am really happy with the answer given by the Hon`ble Minister for Irrigation. (వై.ఎస్.అర్ సభ్యులచే అంతరాయం ) నేను గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లిన విషయంపై మంత్రిగారు అక్కడున్నటువంటి ఇబ్బందుల పట్ల చాలా స్ఫూర్తిదాయకంగా అంగీకరించారు. అందుచే బాధ్యత కలిగిన ఆ ప్రాంత శాసన సభ్యునిగా ప్రభుత్వాన్ని మరియు సంబంధిత మంత్రిగారిని అభినందించాల్సి ఉంది కాబట్టి అభినందిస్తున్నాను. నేనేమి తప్పుగా మాట్లాడటం లేదు. అందుకు వారు హేళనగా స్పందిస్తుంటే సంయమనం పాటించాల్సిందిగా తమద్వారా వారికి తెలుపుతున్నాను. గోదావరి నది మహారాష్ట్రలో నాశిక్ వద్ద జన్మించి అచట నుండి ప్రవహిస్తూ వచ్చి సముద్రంలో కలుస్తోంది.

మిస్టర్ స్పీకర్ : సప్లమెంటరీ అడగండి.

శ్రీ జి. సూర్యారావు (రాజోలు) : సప్లమెంటరీ వద్దు సార్, క్షమించండి. సభ్యులు గోదావరి గట్లు ఆధునికీకరణపై మాట్లాడిన సందర్భంలో నేను ఉపప్రశ్న వేయలేక పోయాను. ఐనప్పటికీ దానికి అనుబంధంగానే ప్రస్తుతం మాట్లాడుతున్నాను. 2007వ సంవత్సరంలో రూ.1300కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్స్ పిలిచారు. కానీ సుమారు 35శాతం పనులు కూడా పూర్తి కాలేదు. కోనసీమలో దాదాపు 548 కిలోమీటర్ల ఏటిగట్టు పరిధిలో సాగు మరియు త్రాగు నీటి కాలువలు సుమారు 231కిలోమీటర్ల పరిధిని కలిగిఉన్న ప్రాంతం అది. పలు సందర్భాలలో వరదలు, తుఫాన్లు, ఉప్పెనల వంటి అనేకానేక ప్రకృతి వైపరిత్యాలకు నిలయమైన ప్రాంతం మా డెల్టా ప్రాంతమే అయి ఉందని కూడా మీకు ఈ సందర్భంగా తెలియపరచుకుంటున్నాను.

వచ్చే సంవత్సరం జూలై మాసంలో మనకు గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. పుష్కరాలతోపాటు 142 సంవత్సరాలకు ఒకసారి జరిగే కుంభమేళ కూడా వస్తోంది. ఈ రెండు పండుగలకు యావత్తు భారతదేశం నుండి పుష్కర స్నానాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి ఈ ప్రాంతంలో పుష్కర స్నానం చేస్తుంటారు. అప్పటికి ఇంకా పనులు పూర్తి కాకుంటే మిక్కిలి ఆటంకంగా ఉంటుంది. ప్రస్తుతం డ్రైనేజ్ వ్యవస్థ కుప్పకూలి పోయింది. కాలువగట్లపై రాకపోకలు ఇబ్బందికరంగా మారి భయాందోళనగా ఉంది. కాబట్టి తమద్వారా మంత్రిగారిని కోరేదేమనగా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాల్సిందిగా కోరుతున్నాను.

MR.SPEAKER: Minister for Legislative Affairs.

శ్రీ యనమల రామకృష్ణుడు (ఆర్థిక మరియు శాసనసభ వ్యవహారాల శాఖామాత్యులు): అధ్యక్షా, తమ దృష్టికి తీసుకు రావలసిన విషయమేమనగా, ఉదయం 10.00 గంటల సమయానికల్లా ఈ నాటి ప్రశ్నోత్తరాలు ముగించుకోవాలని మనం బీఏసీలో అనుకున్నాం. అనంతరం తదుపరి బిజినెస్‌ను చేపట్టాలని అనుకున్నాం. That is the decision of the BAC. Now, I request the Hon'ble Speaker to run the House as per the decisions taken in the BAC meeting.

MR. SPEAKER: Yes, Minister for Irrigation.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు (మైలవరం): గౌరవ సభ్యులు చెప్పిన విధంగా తప్పకుండా పనులు పూర్తి చేస్తాం.

**MR. SPEAKER: Minister for panchayat Raj on Question No.127(26).**

**ప్రశ్న నెంబరు 127**(26).

**సభ్యులు, సర్వశ్రీ / శ్రీమతి.. గౌరు చరితా రెడ్డి, జ్యోతుల నెహ్రూ, రామకృష్ణారెడ్డి పిన్నెల్లి, అత్తర్ చాంద్ బాషా, కలమట వెంకట రమణమూర్తి – ఎమ్మెల్యేలు .**

**గౌరవనీయులైన పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి గారు, దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా.**

ఎ) గ్రామాలు, పట్టణాలలో మినరల్ వాటర్‌ను సరఫరా చేసే ఏదేని ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉన్నదా ?
బి ) అయితే, దీని కొరకు ప్రభుత్వం ఏవేని ప్రణాళికలను రూపొందించిందా ?
సి ) ఎప్పటిలోగా మినరల్ వాటర్‌ను సరఫరా చేయడమవుతుంది ?

పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ నీటిసరఫరా శాఖ మంత్రి (శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడుః

ఎ) ప్రతి కుటుంబానికి 20లీటర్లు చొప్పున సురక్షిత త్రాగు నీటిని సమకూర్చడం కోసం స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి పేరుతో " ఎన్‌టిఆర్ సుజల పథకం" ను అమలు చేయడానికి ఒక విధానపరమయిన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది.

బి) ప్రతి కుటుంబానికి సురక్షిత త్రాగునీటి సరఫరా కోసం అన్ని విషయాలను చూడడానికి మంత్రిమండలి ఉప సంఘాన్ని, సాంకేతిక నిపుణుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

సి) 2014 అక్టోబర్ 2వ తేది నుండి "ఎన్‌టిఆర్ సుజల పథకం" కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకాన్ని దశల వారీగా అమలు చేయడమవుతుంది.

మిస్టర్ స్పీకర్ ః నెహ్రూ గారు.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట)ః గౌరవ మంత్రి వర్యులు సమాధానం చెప్పిన విధంగా ప్రతి కుటుంబానికి 20లీటర్లు చొప్పున త్రాగునీరు అందిస్తామని చెప్పడం జరిగింది. ఐతే దానితోపాటు ఇటువంటి అవసరాలు తీర్చడం కోసం మంత్రిమండలి నుండి ఉప సంఘాన్ని సాంకేతిక నిపుణులతో కూడిన సలహా సంఘాన్ని కూడా నియమిస్తామని మంత్రిగారు చెప్పడం జరిగింది. గతం నుండి కూడా చెపుతున్నారు. శుద్ధి చేసిన మంచినీరు గ్రామీణ ప్రాంతాలకు

అందించే కార్యక్రమాన్ని కొన్ని స్వచ్ఛంద సంస్థలు స్థానిక గ్రామాల్లోని దాతల సహకారంతో పనిచేస్తున్నాయి. ఎంపీ గ్రాంటుతో చేపడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

ఇక్కడున్నటువంటి లోపాల్ని సభ దృష్టికి తీసుకు రాదల్చుకున్నాను. ఆ లోపాల్ని సరిచేసి ఈ పథకాన్ని అమలు చేయాలనేది మా ఆలోచన. ముఖ్యంగా గతంలో నిర్వహిస్తున్న విధానం చూసుకున్నట్లైతే, మొదట రెండు మూడు నెలలు పనిచేయడం తర్వాత సాంకేతిక పరమైన లోపాలు తలెత్తడం, నిర్వహణ ఖర్చు ఊహించిన దానికన్నా ఎక్కువుగా రావడంతో రక్షిత మంచినీరు అందించే ప్లాంట్స్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఒక్క గ్రామాల్లోనే కాదు, విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ విద్యాలయాల్లో కూడా మిషనరీస్ సరిగా పనిచేయకపోవడం, మిషనరీస్ కు సంబంధించిన టెక్నీషియన్స్ అందుబాటులో లేనందువల్ల మిషనరీస్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీనికి ఆర్‌డబ్ల్యుఎస్‌ను అను సంధానం చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని నేను భావిస్తున్నాను.

ఆర్‌డబ్ల్యుఎస్ కింద టెక్నీషియన్ గా మండలానికి ఒకరు ఉండగా, వారు కేవలం మెకానిక్ గా ఉంటున్నారు కానీ ఆ మెకానిక్ పనిచేసేందుకు కావల్సిన సామగ్రి ఆ మండలంలో ఎక్కడా దొరకనటువంటి పరిస్థితి నెలకొంది. ఆ కారణంగా ఆ మెకానిక్ నిరుపయోగంగా ఖాళీగా కూర్చోవడం, కనీసం హ్యాండ్ పంప్స్ ఉపయోగించుకోకపోవడం వంటి పరిస్థితుల్లో ఉన్నాం. ఈనాడు మంచి ఆలోచనతో ఒక మహానీయుని పేరుమీద చేపడుతున్న కార్యక్రమం కాబట్టి దీనిని ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని పనిచేయాల్సిందిగా తమద్వారా కోరుతున్నాను.

...

అదేవిధంగా ప్రతీ మండలానికి సాంకేతిక నిపుణున్ని ఇవ్వడమే గాకుండా, ఫర్‌దర్‌గా దానికి కావలసినటువంటి మెయింటెనెన్స్‌ను ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవలసిన అవసరం ఉంటుంది. సాధారణంగా గ్రామపంచాయతీకి అప్పజెప్పినట్లయితే గ్రామపంచాయతీ నిధుల పరిస్థితి మీఅందరికీ తెలియనిది కాదు. మనందరం గ్రామీణ ప్రాంతాల నుంచే వచ్చాం. (అధికార పార్టీ సభ్యులు శ్రీ పి.శ్రీనివాసరెడ్డి తన సీటు వద్ద లేచి నిలబడి తమ అభ్యంతరం తెలిపారు.)

మిస్టర్ స్పీకర్ః దయచేసి కూర్చోండి.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట)ః వినండి సర్. మీ పథకం తప్పు అని చెప్పటం లేదు. మంచిదే అని చెబుతున్నాను. మీరు ఈ రకమైన ఇంట్రప్షన్స్ ఇస్తే, నేనేం చేయలేను.

మిస్టర్ స్పీకర్ః శ్రీనివాసులు రెడ్డి గారు దయచేసి కూర్చోండి.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట): సక్రమమైన సలహా ఇస్తున్నా కూడా మీరు దానిని తీసుకోలేని దురదృష్టకరమైనటువంటి పరిస్థితిలో ఉన్నారంటే చింతించాలి. సభ అన్నది ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ కాదు.

MR SPEAKER: Nehru garu, no cross talking please.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట): సభ అన్నది ప్రజలకు ఉపయోగపడే విధానంలో, సమస్యల పరిష్కారానికి సభలో ప్రతీ సభ్యుడూ మాట్లాడవలసిన అవసరం, ఆ బాధ్యత ఉంది. ఆ బాధ్యతతో నేను ఇక్కడ మాట్లాడుతున్నాను. దయచేసి వినండి. మా సలహాలను తీసుకోండి. మంచివైతే స్వీకరించండి, ఆచరించండి. నేను చెప్పేది ఒకటే అధ్యక్షా. పంచాయతీలు బాధ్యతలను నిర్వహించడమే తప్ప, నిర్వహణా ఖర్చులు మాత్రం కచ్చితంగా ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించే విధానం ఉన్నప్పుడు మాత్రమే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది. కాబట్టి ఈ పథకంలో ప్రభుత్వం నిధులు కేటాయించే విధానాన్ని చొప్పించాలని నేను మనవి చేస్తున్నాను. గత అనుభవాలను చూసుకుంటే ఎక్కువ శాతం సోషల్ ఆర్గనైజేషన్స్‌కే బాధ్యతలు ఇచ్చే పరిస్థితి ఉంది. ఇక్కడా చిన్న ఇబ్బందులు ఉంటాయి. సోషల్ ఆర్గనైజేషన్స్ ఏదో ఆరోజుకు పని చేసుకుని వెళ్లిపోయేటటువంటి పరిస్థితుల్లో ఉంటాయి. కాబట్టి వాటి భాగస్వామ్యం కన్నా ఎక్కువగా ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఈ పథకాన్ని అమలు చేయగలిగినప్పుడే గ్రామీణ ప్రాంతాలకు మంచినీటి సౌకర్యం అందించిన వాళ్లమవుతామని విన్నవించుకుంటున్నాం.

MR. SPEAKER: Minister for Panchayat Raj.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, పెద్దలు నెహ్రూ గారు అనేక సూచనలు చేయడం జరిగింది. వారు చెప్పేది వాస్తవం. గతంలో కొన్ని సందర్భాల్లో కొన్ని పథ ఫెయిల్ అయ్యాయి. అందుచేత మీరు చెప్పిన వాస్తవాలను, జాగ్రత్తలను తీసుకుంటాం. అధ్యక్షా, ఈ పథకం ప్రవేశ పెట్టడంలో ముఖ్యోద్దేశం ఏమంటే, గత పది సంవత్సరాలలో అప్పటి ప్రభుత్వాలు గాని, అప్పటి ముఖ్యమంత్రులు గాని, అప్పటి మంత్రులు గాని తీసుకున్న తప్పుడు విధానాల వల్ల ఆర్.డబ్ల్యు.ఎస్. వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. అందువల్ల గ్రామాలకు కనీసం సరైన మంచినీరు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. ఉదాహరణకు గత ప్రభుత్వంలో కొన్ని లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టారు. వాటర్ ట్యాంక్‌లు కట్టారు. కానీ వాటర్ సోర్స్ నిర్మాణం జరగలేదు. వాటర్ సోర్స్ లేకుండా పైప్‌లైన్ వేశారు. పోలవరం బ్యారేజీ లేకుండా కాలువలు తవ్వినట్టు. ఆవిధంగా ఆర్.డబ్ల్యు.ఎస్. వ్యవస్థను నిర్వీర్యం చేసేశారు. ఇప్పుడు ఆ వ్యవస్థను పునరుజ్జీవింప చేయాలని, స్వచ్ఛమైన మంచినీటిని ప్రజలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇవాళ రాష్ట్రంలో సుమారుగా 13,000 పంచాయతీలు ఉన్నాయి. మొదటి ఫేజ్‌లో 5,000 పంచాయతీలలో ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. దీనికి ప్రభుత్వం తరఫున కూడా బడ్జెట్‌ను కేటాయిస్తున్నాం. ఒక నిపుణుల కమిటీ ఉంది. ఇందులో రిటైర్డ్ చీఫ్

ఇంజనీర్ శ్రీ కొండలరావుగారు కూడా ఉన్నారు. వీరు అనంతపూర్‌లో శ్రీ సత్య సాయిబాబా స్కీమ్స్ తయారుచేసిన వారు. వీరికే బాధ్యతలు అప్పగించడం జరిగింది. అదే కాకుండా గ్రామాల్లో ఈ స్కీమ్‌ను అమలుచేసే బాధ్యత ప్రభుత్వ పర్యవేక్షణలో, పంచాయతీ ప్రెసిడెంట్ పర్యవేక్షణలో, అక్కడే ఉన్న డ్వాక్రా గ్రూపులకి ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది.

**MR. SPEAKER: Question No. 27 (30) Minister for Finance.**

**శ్రీ పీలా గోవింద సత్యనారాయణ, ఎం.ఎల్.ఎ.**

అ) విశాఖపట్టణం జిల్లా, అనకాపల్లిలోని తుంపాల చక్కెర ఫ్యాక్టరీని ఆధునకీకరణ కోసం ప్రభుత్వం వద్ద ఏదేని ప్రతిపాదన ఉన్నదా?

ఆ) అయితే, ఈ పనులను ఎప్పటిలోగా ప్రారంభించడమవుతుంది?

ఆర్థిక మరియు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు)ః
అ) లేదండీ.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ పీలా గోవింద సత్యనారాయణః అధ్యక్షా, ఈ సభలో మొదటిసారిగా మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు, అధ్యక్షుల వారికి, నాతోటి శాసనసభ్యులందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు తెలుపుకుంటున్నాను. గత యాభై సంవత్సరాల క్రితం శ్రీ వి.వి.రమణ గారు కోప రేటివ్ షుగర్ ఫ్యాక్టరీని స్థాపించారు. ప్రతీ సంవత్సరం కూడా అప్పులు తెచ్చుకొని చెల్లింపు చేయడం తప్ప, ఈరోజుకి కూడా రికవరీ లేదు. ఏడు శాతం కూడా రాని పరిస్థితి ఉంది. ఈ నెల ఏడవ తారీకున గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు మా నియోజక వర్గానికి వచ్చినప్పుడు ఈ ఫ్యాక్టరీకు 90 రోజులలో నిపుణుల కమిటీని పంపించి ఆధునీకరిస్తామని చెప్పారు. ఈ సభ ద్వారా మా అధ్యక్షులైన గౌరవ ముఖ్యమంత్రిగారిని మరొకసారి రిక్వస్ట్ చేస్తున్నాను. అదేవిధంగా ఒక చిన్న క్లారిఫికేషన్ ఏమంటే బేసిక్‌గా షుగర్ ఫ్యాక్టరీలో పేమెంట్లు రికవర్ కావటం లేదు.పేమెంట్లు ఇవ్వడానికి డబ్బు లేదు. రెండవది ఏమంటే చెరకును తీసుకుని బెల్లం ఆడించే పరిస్థితిలో నల్లబెల్లం అని కేసులు పెడుతున్నారు. మా నియోజకవర్గంలోని రైతులు చాలా దౌర్భాగ్యకరమైన పరిస్థితుల్లో ఉన్నారు. ఎట్టి పరిస్థితి లోనూ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించకపోతే మా మూడు నియోజకవర్గాలైన అనకాపల్లి, చోడ వరం, ఎలమంచిలిలోని రైతులు చాలా దౌర్భాగ్య పరిస్థితిలో ఉండిపోతారు. అందువల్ల ఈ సభా ముఖంగా మా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడి గారిని మరొక్కసారి రిక్వస్ట్ చేస్తున్నదేమంటే ఈ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించాలని వేడుకుంటున్నాను.

MR. SPEAKER: Minister for Finance.

శ్రీ యనమల రామకృష్ణుడు (ఆర్థిక మరియు శాసనసభ వ్యవహారాల శాఖ): అధ్యక్షా, వెంటనే నిపుణుల కమిటీని పంపిస్తాం. నిపుణుల కమిటి ఎగ్జామిన్ చేసి, రిపోర్ట్ ఇచ్చిన తర్వాత రిపోర్ట్‌ను బేస్ చేసుకుని చర్యలు తీసుకుంటాం.

**MR. SPEAKER: Question Nos. 226 (28) & 17 (29) deemed to have been answered.**

**Now Question No.33 (30) Minister for Forests & Environment.**

**ప్రశ్న నెం. 33 (30)**
**శ్రీ రాజన్నదొర పీడిక, ఎం.ఎల్.ఎ.**

అ) విజయనగరం జిల్లా, సాలూరు నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాలలో స్టోన్ క్రషింగ్ యూనిట్లకు అనుమతులను ఇచ్చిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఈ విషయంలో పాటిస్తున్న నియమ నిబంధనలతో కలుపుకొని అనుమతించిన క్రషింగ్ యూనిట్ల వివరాలు ఏమిటి?

ఇ) అనేక స్టోన్ క్రషింగ్ యూనిట్లు జనావాసాలకు ప్రమాదకరమైన రీతిలో క్రషింగ్‌ను చేస్తున్న విషయం ప్రభుత్వ దృష్టికి తేబడిందా?

ఈ) అనేక స్టోన్ క్రషింగ్ యూనిట్లు నియమ, నిబంధనలలో నిర్ణయించిన విధంగా అవసరమయిన ప్రమాణాలను పాటించడంలేదన్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తేబడిందా?

ఉ) సక్రమ పర్యవేక్షణ, పరిశీలన, తనిఖీలను నిర్వహించకుండా అనుమతులను ఇచ్చిన సంబంధిత అధికారులపై ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

**అడవులు, పర్యావరణం, శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి(శ్రీకాళహస్తి):**

అ) అవునండీ.

ఆ) మండలి ఈ క్రింది మూడు క్రషింగ్ యూనిట్లకు అనుమతిని జారీ చేసింది.

1) మెస్సర్స్ శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్, పెద్ద చీపురువలస (గ్రామం), పాచిపెంట మండలం, విజయనగరం జిల్లా. గడిచిన మూడు సంవత్సరాలలో యూనిట్ నిర్వహణలో లేదు.

2) మెస్సర్స్ నవదుర్గ స్టోర్ క్రషర్, దుద్ది సాగం రోడ్, సాలూరు గ్రామం & మండలం, విజ యనగరం జిల్లా.

3) మెస్సర్స్ జై వీర హనుమాన్ స్టోన్ క్రషర్, కొండ కరకవలస గ్రామం, కొత్త వలస పంచాయతీ, సాలూరు మండలం, విజయనగరం జిల్లా.

సిఎఫ్ఇ / సిఎఫ్ఓ కమిటీల సమక్షంలో ఉంచిన తరువాత, కమిటీల సిఫారసుల ప్రకారం స్టోన్ క్రషర్లకు ఏర్పాటు సమ్మతి (సిఎఫ్ఇ) / నిర్వహణ సమ్మతి (సిఎఫ్ఓ) లను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసింది. పై అన్ని స్టోన్ క్రషర్లను మండలి మార్గదర్శకాల ప్రకారం ఏర్పాటు చేయడమయినది.

ఇ) లేదండీ.

ఈ) లేదండీ.

ఉ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ పీడిక రాజన్న దొర (సాలూరు): అధ్యక్షా, ఈ ప్రశ్నలో ముఖ్యంగా మూడు అంశాలున్నాయి. ఒకటవది ప్రజా ఆరోగ్యం. ఎందుకంటే అక్కడ శబ్ద కాలుష్యం, నీటి కాలుష్యం, గాలి కాలుష్యం వలన ప్రజలంతా అనారోగ్యం పాలవుతున్నారు. రెండవది ఈ స్టోన్ క్రషర్స్ కోసం అనుమతులు లేకుండా బాంబులు పెట్టి పేలుస్తున్నారు. వీటివలన ఇప్పటికే ముగ్గురు చనిపోయారు. వీటికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు తీసుకొచ్చి ఇవ్వడం జరిగింది. మూడవది అక్కడ రాళ్లు కొట్టుకుని గిరిజనులు, హరిజనులు జీవిస్తున్నారు. చెన్నైకి చాలా మంది వెళ్లిపోతున్నారని గౌరవ కార్మిక శాఖామంత్రి చెప్పారు. ఈ ఉపాధి కూడా పోతే వాళ్లు చెన్నైకో, బెంగుళూరుకో, మరొకచోటుకో వెళ్లి, మొన్నటిలాగే జీవసమాధులుగా తిరిగొచ్చేవిధంగా పరిణమిస్తుంది.

మంత్రిగారు చెప్పిన మూడు స్టోన్ క్రషర్స్‌లో ఒకటి పనిచేయడం లేదు. మరొకటి పని చేస్తుంది. ఈమధ్య మేం అడిగిన తర్వాత వాళ్లు పద్ధతిని మార్చుకున్నారు, బాగానే ఉన్నారు. మెస్సర్స్ జై వీర హనుమాన్ స్టోన్ క్రషర్‌ను మొన్న చూసి వచ్చాను. దాని విషయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు ఏవిధంగా నిర్ణయం తీసుకున్నారో నాకు తెలియదు. నేను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకి, అలాగే ఎన్విరాన్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కి నేను రాసిన మొత్తం లేఖలు,

తహసిల్దార్ నుంచి గౌరవ ముఖ్యమంత్రిగారి వరకు, మా హరిజనులు, గిరిజనులు పెట్టుకున్న వినతిపత్రాలను తమరు ప్రభుత్వానికి పరిశీలించమని పంపిస్తారని, మీకు అందజేస్తున్నాను.
(సభ్యులు శ్రీ పి. రాజన్నదొర రాసిన లేఖలను, గిరిజనులు, హరిజనుల వినతి పత్రాలను గౌరవ సభాపతికి అందజేయడం జరిగింది.)

ఇక నిర్ణయానికి సంబంధించిన విషయానికొస్తే మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీ, రెవెన్యూ, పోలీస్ మొత్తం ఐదు శాఖలు ఇన్వాల్వ్ అయి ఉంటాయి. కానీ వీరు చెప్పే ప్లేస్ ఒకటి, కట్టబోయే ప్లేస్ ఒకటి. వాళ్లు సర్వే నెంబరు 251 లో కడతామని చెబుతున్నారు, అది ఇనాం భూమి. అది ఇంతవరకు ప్రభుత్వం ఎవరికిచ్చారో తెలియదు. ఇనాం భూమిని ప్రభుత్వం ఎవరికీ ఇవ్వదు. ఇక సర్వే నెంబరు 87 ఉంది. అది ఆ ప్రాంతంలోనే లేదు. కొత్తవ లస, కొండ కరకవలస ప్రాంతంలో ఇప్పుడు కట్టబోయేది మీరు చెప్పిన ప్రాంతంలో కాకుండా గిరిజన ఆవాస ప్రాంతంలో కట్టబోతున్నారు. దీనివలన ఎల్లవేళలా ధూళితో గాలి, నీరు కలుషిత మైపోతుంది. చుట్టుపక్కలున్న గిరిజనేతరులు, హరిజనులు, గిరిజనులు పూర్తిగా నష్టపోయి ఒకపక్క ఉపాధి లేకుండా అనారోగ్యాలతోపాటు బాంబు బ్లాస్టింగ్ వలన కూడా అనేక విధాలుగా నష్టపోతున్నారు. అందుకే తమరి ద్వారా మనవి చేస్తున్నాను. ఇచ్చిన రిపోర్టును రద్దు చేసి మీరు పూర్తిగా దర్యాప్తు చేయించండి. మీరు విచారణ చేసిన తర్వాత మంచిదే అని తేలిన తర్వాత మళ్లీ రిపోర్ట్‌ను ఇవ్వండి మేం కాదనం.

కానీ మీరిచ్చినది తప్పు. తహసిల్దారుగారు ఇచ్చిన రిపోర్టు కూడా దాంట్లో ఉంది. సర్వే నెంబర్లతోపాటు ఇచ్చాను. కాబట్టి ఇటు ప్రభుత్వానికి, అధికారులకు, అన్ని శాఖలకు రాసిన లేఖలు తమరికిచ్చిన దాంట్లో ఉన్నాయి. కాబట్టి తమరు ప్రభుత్వానికి పంపించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయకపోతే ఉపాధి, అనారోగ్యం, ప్రాణాలు కోల్పో వడం, ఈ మూడూ జరుగుతాయి.

MR. SPEAKER: Minister for Forests & Environment.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి (శ్రీకాళహస్తి)ః అధ్యక్షా, స్టోన్ క్రెషర్స్ యూనిట్స్‌కి సంబంధించిన సిట్టింగ్ గైడ్‌లైన్స్ ప్రకారం, స్టోన్ క్రెషర్స్ నేషనల్ హైవేస్‌కి 500 మీటర్లు, స్టేట్ హైవేకి 100 మీటర్ల కనీస దూరంలో ఉంటూ, స్టోన్ క్రెషర్స్ యూనిట్స్‌కి చుట్టూ ఐదు మీటర్ల వెడల్పుతో గ్రీన్ బెల్ట్ బౌండరీ ఉండాలని రూల్స్ చెబుతున్నాయి. గౌరవ సభ్యులు మీద్వారా పంపించే పత్రాలను కూడా ఎగ్జామిన్ చేసి తగిన న్యాయం చేస్తాం.

**MR.SPEAKER: Now the Question Hour is over. Zero Hour starts.**

# జీరో అవర్

శ్రీ శ్రీరామ్ రాజగోపాల్(జగ్గయ్యపేట): అధ్యక్షా, రాష్ట్ర విభజన తరువాత ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి ముఖద్వారం మా జగ్గయ్యపేట నియోజకవర్గం. మా ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని మా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. గతంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు మా నియోజకవర్గం వచ్చినప్పుడు మా ప్రాంతాన్ని కూడా హోసూరు లాగా ఇండస్ట్రియల్ కారిడార్‌గా డెవలప్ చేస్తామని అన్నారు. మా నియోజకవర్గంలో కావలసినన్ని ప్రభుత్వ భూములున్నాయి. పరిశ్రమలకు కావలసిన నీరు కూడా మా దగ్గర ఉంది. నేషనల్ హైవే-65 కూడా మా నియోజకవర్గం నుండి పోతోంది. ప్రభుత్వం క్రొత్తగా చేపట్టబోతున్న పారిశ్రామిక విధానంలో పరిశ్రమలకు రాయితీలు ఇస్తామని చెప్పడం జరిగింది. కాబట్టి అటువంటి పరిశ్రమలను మా ప్రాంతంలో నెలకొల్పడం వలన మా ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా మా ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి. అందుకొరకు, మా ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. తగు చర్యలు తీసుకుంటాను.

శ్రీ వి.వి.శివరామరాజు (ఉండి): అధ్యక్షా, మా జిల్లాలో కొల్లేరు ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఫారెస్ట్ అధికారులు మా వ్యవసాయదారులను వేధింపులకు గురిచేస్తున్నారు. చాలా మంది ఆ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయి. కాబట్టి, గౌరవ మంత్రివర్యులు కల్పించుకొని, ఫారెస్ట్ అధికారులు వేధింపులకు పాల్పడకుండా చూసి, మా రైతులు సాంప్రదాయ వ్యవసాయం చేసుకునే అవకాశం కల్పించవల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. తగు చర్యలు తీసుకుంటాను.

శ్రీ ఆకుల సత్యనారాయణ (రాజమండ్రి సిటి): అధ్యక్షా, రానున్న రాజమండ్రి పుష్కరాలకు సంబంధించిన తేదీని ఇంకా ఖరారు చేయలేదు. తేదీ ఖరారు చేసినట్లైతే కేంద్ర నాయకులను ఆహ్వానించడానికి వీలౌతుంది. దానికి సంబంధించిన కమిటీ ఫార్మేషన్ కూడా మరికొంత బ్రాడ్‌గా వేస్తే బాగుంటుందని మీద్వారా సంబంధిత మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. తగు చర్యలు తీసుకుంటాను.

శ్రీ వి.ప్రభాకర చౌదరి (అనంతపూరు అర్బన్): అధ్యక్షా, అనంతపురం నియోజకవర్గంలో, గత ప్రభుత్వంలో రూ.123 కోట్లతో త్రాగునీటి సరఫరా పైపులైను మరమ్మత్తు కోసం ఒక పథకాన్ని మొదలుపెట్టారు. దానికి సంబంధించిన కాంట్రాక్టర్, మరి గత ప్రభుత్వపు ఒత్తిడి మేరకో, లేదా ఆనాటి స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకో గానీ, ప్రపంచ బ్యాంకు నిధులతో పూర్తి చేయాల్సిన పథకం అయినప్పటికీ ఇంతవరకు ఆచరణయోగ్యం కాలేదు. సంబంధిత మంత్రివర్యులు తగువిధమైన చర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నాను.

అదేవిధంగా అనంతపురం నియోజకవర్గానికి రూ.360కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పథకం ప్రతిపాదన ఉంది. దానిని కూడా అమలు చేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. సదరు మంత్రి గారికి పంపించడం జరుగుతుంది.

శ్రీ కోన రఘుపతి (బాపట్ల): అధక్షా,మా బాపట్ల నియోజకవర్గం సముద్ర తీర ప్రాంతంలో ఉంది. ప్రత్యేకించి త్రాగు నీటికి చాలా ఇబ్బందులు పడేటువంటి పరిస్థితి. దాదాపు 7 నుండి 8 ప్రధాన మురుగు కాలువలు బయటి ప్రాంతాలనుండి వచ్చి మా బాపట్ల నియోజకవర్గంలోని సముద్రంలో కలవడం వలన ఉపరితల నీటినంతా కూడా మేము నష్టపోతున్నాము. అలాగే, నీటిపారుదల కాలువలకు లైనింగ్ ఉంటుంది గానీ మురుగు కాలువలకు లైనింగ్ ఉండడం లేదు. కాబట్టి మా నియోజకవర్గ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా మురుగు కాలువలకు లైనింగ్ వేయించడం గానీ, లేదా ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖకు అదనపు నిధులు కేటాయించడం ద్వారా త్రాగునీటి అవసరాలు తీర్చేవిధంగా ప్రతేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. సదరు మంత్రి గారికి పంపించడం జరుగుతుంది.

శ్రీ పులపర్తి నారాయణ మూర్తి (గన్నవరం): తోటి శాసనసభ్యులకు నమస్కారం. మా గన్నవరం నియోజకవర్గం వుండే తూర్పు గోదావరి జిల్లా పరిశ్రమలు లేని జిల్లా. కానీ మా రైతాంగానికి కూలీలు దొరకక పంటపొలాలు కూడా బీడు భూములుగా మారే పరిస్థితి ఉంది. కాబట్టి, అధ్యక్షా, పనికి ఆహార పథకాన్ని రైతాంగానికి కూడా వర్తింపజేస్తారని కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. సదరు మంత్రి గారికి పంపించడం జరుగుతుంది.

శ్రీమతి ఆర్.కె. రోజా (నగరి) : అధ్యక్షుల వారికి, నాతోటి సహచర శాసనసభ్యులకు నా నమస్కారం. అధ్యక్షా, తిరుపతిలో రుయా హాస్పిటల్, 150 బెడ్‌లు గల పెద్ద మెటర్నిటీ హాస్పిటల్. చిత్తూరు జిల్లా నుండే గాక, ప్రక్కన ఉన్న జిల్లాల నుండి కూడా ఎంతోమంది నిరుపేద గర్భిణీ స్త్రీలు వచ్చి, ఫ్రీ ఆఫ్ కాస్ట్‌తో ట్రీట్‌మెంట్ తీసుకుని వెళ్తారు. తల్లి, పిల్లలు ఇద్దరూ క్షేమంగా ఇంటికి చేరుకునే అవకాశం ఉండేది. కానీ, ఒక్కొక్కసారి ఒక్క బెడ్ మీదనే ఇద్దరు తల్లులను ఉంచాల్సిన పరిస్థితిలో బెడ్‌లను 150 నుండి 300 ల బెడ్‌లకు పెంచవలసినదిగా గతంలో ఆ హాస్పిటల్ నుండి ఎన్నో రిక్విజిషన్స్ వెళ్ళడం వల్ల 300ల బెడ్ హాస్పిటల్ జీ.ఓ.నెం.470 ప్రకారం శాంక్షన్ అయ్యింది. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ద్వారా చేపట్టబోయే ఈ ప్రాజెక్టు విలువ రూ.77 కోట్లు.

ఈమధ్యనే జారీ అయిన జీ.ఓ.నెం.78 ప్రకారం శ్రీ పద్మావతి మెడికల్ కళాశాలకు, రుయా హాస్పిటల్ బిల్డింగ్‌ను ఇచ్చేయాలని చెప్పడం జరిగింది. మన గౌరవ మంత్రివర్యులు శ్రీ కామినేని శ్రీనివాస్ గారు రుయా హాస్పిటల్ కన్నా బెటర్‌గా స్విమ్స్ హాస్పిటల్ సర్వీస్ చేయగలదని చెప్పడం జరిగింది. ఇది చాలా బాధాకరం అధ్యక్షా. ఎందుకంటే, రుయా హాస్పిటల్‌లో ఎంతో మంది పేదవాళ్ళకు ఫ్రీ ఆఫ్ కాస్ట్ తో ట్రీట్‌మెంట్ దొరుకుతుంది. కానీ, స్విమ్స్ అలా కాదు. **(బెల్)** అంతేకాదు, స్విమ్స్‌లో గైనకాలజీ డిపార్టుమెంట్ గానీ, పీడియాట్రీ డిపార్టుమెంట్ గానీ లేవు. ఈరోజు వాళ్ళు రుయా హాస్పిటల్ వంటి సర్వీస్ అందించగలగాలంటే కనీసం పది సంవత్సరాలు పడుతుంది. ఎస్.వి.మెడికల్ కాలేజ్‌కు 70 మెడికల్ సీట్లు, అలాగే 12 పి.జి.సీట్లు రావడంజరిగింది. ఇవన్నీ కూడా ఫ్రీ ఆఫ్ కాస్ట్‌తో పేదవిద్యార్థులకు వచ్చే సీట్లు. కానీ, రుయా హాస్పిటల్ బిల్డింగ్ లేకపోతే ఇవన్నీ కూడా నెక్స్ట్ ఇయర్‌కు రాకుండా పోతాయి. స్విమ్స్ ఫైనాన్షియల్‌గా స్ట్రాంగ్ మరియు టిటిడి రిలేటెడ్ కాబట్టి..,**(బెల్)**

MR.SPEAKER: Please tell exactly what do you want?

శ్రీమతి ఆర్.కె.రోజ (నగరి): జీ.ఓ.నంబర్ 78 రద్దు చేయాలి. ఆ భవనాన్ని రుయా వైద్యశాలకే కేటాయించాలని కోరుతున్నాం. గత ప్రభుత్వంలో విడుదలైన జీ.ఓ.నంబర్ 87 ప్రకారం 300 బెడెడ్ హాస్పిటల్‌లో 100 పోస్టులు ఉంటాయి. ఆ పోస్టులు భర్తీ చేస్తే 100 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముంటుంది. జీ.ఓ.నంబర్ 87 రాకపోతే చంద్రబాబు గారు చెప్పినట్లు 'బాబు వస్తే, జాబు వస్తుంది' అనేది లేకుండా పోతుంది, ఉన్న జాబులు పోయే పరిస్థితి వస్తుంది.

MR.SPEAKER: Please be seated, you can't make speeches in Zero Hour.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి (శ్రీకాళహస్తి)ః నోట్ చేసుకోవడం జరిగింది. సదరు మంత్రి గారికి పంపించడం జరుగుతుంది.

శ్రీ పి.శ్రీనివాసులు రెడ్డి (కోవూరు)ః నెల్లూరు జిల్లాలో 'కోవూరు సహకార సంఘ చక్కెర కర్మాగారం' సమస్యలపై గౌరవ ఆర్థికమంత్రి గారు సమాధానం ఇచ్చారు. రైతులకు రూ.8 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందోనని రైతులు 18 నెలలుగా ఎదురుచూస్తున్నారు. రైతులకు ఇవ్వాల్సిన బాకీలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవలసిందిగా ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరుతున్నాను. ఈ కర్మాకాగారాన్ని తిరిగి నడిపించడానికి రూ.4 కోట్లు కావాలి. దాదాపు రూ.20 కోట్లు ఈ కర్మాగారానికి కేటాయించి రైతులను ఆదుకోవలసిందిగా కోరుతున్నాను. గత 10 సంవత్సరాల నుంచి కర్మాగారం ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైంది.

మిస్టర్ స్పీకర్ః మీకు ఏమి కావాలో చెప్పండి. What do you want?

శ్రీ పి.శ్రీనివాసులు రెడ్డి (కోవూరు)ః 18 నెలలుగా జీతాలు లేక, పిల్లలను చదివించుకోలేక అనేక ఇబ్బందులకు గురి అవుతున్న కార్మికులు, రైతులను ఆదుకోవాల్సిందిగా కోరుతున్నాను. తక్షణమే రూ.4 కోట్లు విడుదల చేసి కర్మాగారాన్ని ఆధునీకరించి తెరిపించాల్సిందిగా కోరుతున్నాను. ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యేక 'వ్యవసాయ బడ్జెట్'ను ప్రవేశపెడుతుంది. కనుక కోవూరు షుగర్ కర్మాగారాన్నే కాకుండా రాష్ట్రంలోనున్న అన్ని షుగర్ ఫ్యాక్టరీలను కాపాడవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి (శ్రీకాళహస్తి)ః అధ్యక్షా, వివరాలు నోట్ చేసుకున్నాను. సదరు మంత్రి గారికి పంపించడం జరుగుతుంది.

## ANNOUNCEMENT

MR.SPEAKER: I am to announce that I have received two notices under Rule-344. They are; One with regard to Law and Order prevailing in the State, and the other with regard to Impact of Bifurcation of the State.

ఈ రెండు కూడా సరైన సమయంలో తీసుకోబడతాయి.

Now, Tea Break for 10 minutes.

**(The House then adjourned at 10.43 AM for Tea Break for ten minutes)**

–––

**The House, Reassembled at 11-00 AM with**
**Hon'ble Speaker in the Chair**

**BUDGET PRESENTATION (2014 -2015) BY THE FINANCE MINISTER FROM 11-00 AM TO 12-23 PM.**

**MR. SPEKER: Now Budget Presentation.**

## బడ్జెట్ ప్రసంగము

## 2014–15

**గౌ.ఆర్థికశాఖామాత్యులు(శ్రీ యనమల రామకృష్ణుడు): గౌరవనీయులైన అధ్యక్షా! మరియు సభ్యులారా!**

తమ అనుమతితో 2014–15 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమర్పించనున్నాను.

నా బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించేముందు మహాత్మాగాంధీ కలలు గన్న ఆదర్శసమాజాన్ని ఒక్కసారి గుర్తు చేయాలనుకుంటున్నాను. ఆయన దృష్టిలో ఆదర్శసమాజమనేది కులరహిత, వర్గరహిత సమాజం. అక్కడ సమాంతర విభేదాలే తప్ప నిచ్చెన మెట్ల విభేదాలుండవు. ఎక్కువ తక్కువ వ్యత్యాసాలుండవు. 2014–15 సంవత్సరానికి నేను సమర్పిస్తున్న బడ్జెట్ అటువంటి న్యాయబద్ధ మానవీయ గతిశీల సమాజాన్ని సాధించే దిశగా వేస్తున్న ముందడుగుగా విన్నవించుకుంటున్నాను.

2. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది తొలి బడ్జెట్. దాదాపు పదేళ్ల కాల వ్యవధి తర్వాత మరలా బడ్జెట్‌ను సమర్పించే అవకాశం నాకు లభించింది. ఈ మధ్యకాలమంతా పాలనావ్యవస్థ కుంటుబడడం, స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం, అభివృద్ధి గురించిన ప్రణాళికలు లేకపోవడం, అవినీతి ప్రబలడం గౌరవ సభ్యులకు తెలిసిన విషయమే. గత కొన్నేళ్లుగా నిరంతర ఆందోళనతో, సమ్మెలతో పౌరజీవనం అతలాకుతలమైనది. తర్వాత రాష్ట్రం విభజించబడ్డ తీరుతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా తయారయ్యింది.

3. ఈ దురదృష్టకరపరిస్థితిలో మా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రం ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలనూ, సంక్లిష్టతలను సరిదిద్దవలసిన కర్తవ్యం మా మీద పడింది. గతంలో చేసినట్లే ఇప్పుడు కూడా మనం మరొకసారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునాదుల నుంచి పునర్నిర్మించవలసిన పరిస్థితి ఏర్పడింది.

4. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పొందుపరచబడ్డ అవకాశాలు మొక్కుబడిగా చూపించినవే తప్ప రాష్ట్ర విభజల వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కోల్పోతున్న అవకాశాలను ఏవిధంగానూ పూరించగలిగినవి కావు. కొత్త రాష్ట్రానికి అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలు, ఆదాయకల్పన, వైద్యవిద్యా సంస్థలు, పరిశోధన మరియు శిక్షణ సదుపాయాలు, మౌలిక సామాజిక సదుపాయాలు కొత్త రాష్ట్రం మనుగడకు ఏమాత్రం సరిపోగలిగినవి కావు. కొత్త రాష్ట్రం యొక్క రాజధానిని కూడా నిర్ణయించకుండా రాష్ట్రాన్ని విభజించాలని తీసుకున్న నిర్ణయం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు.

5. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం క్రింద 1995-96 లో చేపట్టిన రెండవదశ సంస్కరణలు దాదాపు ఒక దశాబ్ద కాలంపాటు దారిద్ర్య నిర్మూలనకు, ఆర్థికాభివృద్ధి ద్వారా ఆర్థిక సంస్కరణలకు తోడ్పడ్డాయి. 90ల మధ్యకాలంలో సమాచారవిప్లవం పర్యవసానంగా భూమి, జలసంపద, అటవీ సంపదల భాగస్వామ్య నిర్వహణలో గొప్ప పురోగతి సాధ్యమయింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక బృందాలు, డ్వాక్రా సంఘాలు చేపట్టిన కృషి ప్రపంచవ్యాప్త విజయగాథగా మార్మోగింది. మహిళా సంఘాల ద్వారా సాధించిన సామాజిక గతిశీలత, సాధికారికత, సామర్థ్యకల్పన దారిద్ర్య నిర్వహణ వ్యూహంలో ప్రధానపాత్ర పోషించాయి. ఈ వ్యూహాలు ఆర్థికసంస్కరణల రంగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గొప్ప పేరును తీసుకురావడమే కాక, దేశంలోనూ, బయటాకూడా ఎన్నో ఆశలు రేకెత్తించాయి. కానీ 2004 తరువాత ప్రభుత్వం ఉదాసీనతతో ఈ బృహత్తర ఉద్యమం నెమ్మదిగా వన్నె తగ్గడం మొదలయింది.

6. ప్రణాళికేతర ఆదాయానికి సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మిగులు ఆదాయరాష్ట్రంగా ఉండేది. కానీ దురదృష్టవశాత్తూ రాష్ట్ర విభజన వల్ల శేషాంధ్రప్రదేశ్‌కు ప్రణాళికేతర రంగంలో రెవెన్యూ లోటు గుదిబండగా మారింది. రాష్ట్ర ఆర్థికపరిస్థితి మీద రాష్ట్ర విభజన తీవ్ర ప్రభావాన్ని చూపించింది. రాష్ట్ర ఋణాలు, ఉద్యోగులు, పింఛనుదారులు జనాభా ప్రాతిపదికన కేటాయించబడినందువల్ల రాష్ట్ర వ్యయం కూడా ఉమ్మడి రాష్ట్ర వ్యయంలోని 58 శాతం కన్నా ఎక్కువగానే ఉండే పరిస్థితి ఏర్పడింది. కానీ రాష్ట్రానికి ప్రధాన ఆదాయపు వనరు అయిన అమ్మకపు పన్ను ద్వారా వచ్చే రాబడి ఉమ్మడి రాష్ట్ర ఆదాయంలో దాదాపు 47శాతం మాత్రమే ఉండే పరిస్థితి ఏర్పడింది. అలాగే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషను ఫీజు, మోటారువాహనాల పన్ను మొదలయినవన్నీ 50శాతం కన్నా తక్కువగా ఉండే పరిస్థితి ఏర్పడింది. శేషాంధ్రప్రదేశ్ వాటాలో ఒక్క ఎక్సైజ్ ద్వారా వచ్చే ఆదాయం మాత్రమే దాదాపుగా 55శాతం ఉండగలదు. మైనింగ్ ద్వారా వచ్చే నాన్‌టాక్స్ ఆదాయం ఉమ్మడిరాష్ట్ర ఆదాయంలో 30శాతం కన్నా తక్కువగానే ఉంటుంది. శేషాంధ్రప్రదేశ్‌లో మొత్తం మీద పన్నుల ద్వారానూ, ఇతరత్రా రూపేణా రాగల ఆదాయం ఉమ్మడిరాష్ట్ర ఆదాయంలో 47శాతానికి దగ్గరగా ఉండగలదని అంచనా వేయడమైంది. కాబట్టి ఒక సక్రమమైన అంచనాతో ప్రణాళికను

రూపొందించుకోవడానికి అవసరమైన వనరులు రాష్ట్రానికి లేకుండా పోయాయని చెప్పక తప్పదు.

7. ఆదాయంలోని ఈ అసమాన పంపిణీతోపాటు, సామాజిక ఆర్థికరంగాలకు సంబంధించిన కీలక మౌలిక సదుపాయాలు కూడా తెలంగాణా రాష్ట్ర పరం కానున్నాయి. రాష్ట్ర పునర్వవస్థీకరణ చట్టంలోని 9వ 10వ షెడ్యూళ్లలో పొందుపరచబడిన ఎన్నో సంస్థలు హైదరాబాదులోనూ, హైదరాబాదు చుట్టుపక్కలా నెలకొని ఉన్నాయి. 9వ, 10వ షెడ్యూళ్లలో చేర్చని ఇతర సంస్థలు గాలికి వదలి వేయబడ్డాయి. శేషాంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. అందువల్ల ఇక్కడ స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో పన్నుల వాటా 6.8 శాతం కాగా, తెలంగాణ రాష్ట్రం పట్టణీకరణ చెందినందువల్ల అక్కడ ఆ వాటా 9.7 శాతం దాకా ఉంది. పరిమితమైన వనరులు మాత్రమే అందుబాటులో ఉన్నందువల్ల నవ్యాంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సామాజిక, ఆర్థిక రంగాల్లో అన్ని మౌలికసదుపాయాలు కల్పించడం కష్టసాధ్యమైన విషయం. ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టడానికి అవసరమైన పరిహారమేదీ అప్పటి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉండలేదు. అప్పటి కేంద్రప్రభుత్వం అనుసరించిన అహేతుక, అసంబద్ధ రాష్ట్ర విభజన ప్రక్రియ వల్ల శేషాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కలిగిన నష్టం ఎటువంటిదో ఈ నిర్లక్ష్యం ద్వారా మనం గమనించవచ్చు. నేడు మన ముందున్న సవాళ్లు ఎంత తీవ్రమైనవో దీన్ని బట్టి మనం గ్రహించవచ్చు.

8. ఇంతదాకా వివరించిన విషయాలే కాక, మరెన్నో సమస్యలూ, సవాళ్లూ నవ్యాంధ్రప్రదేశ్ ఎదుట మొహరించి ఉన్నాయి.

**దిశానిర్దేశం:**

9. ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక కోసం నిర్దేశించుకున్న ఆశయాలకు, లక్ష్యాలకూ అనుగుణంగా ప్రభుత్వం చేబడుతున్న కొన్ని ముఖ్య అభివృద్ధి వ్యూహాలను తమ ద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను.

**శ్వేతపత్రాల విడుదల :**

10. గత దశాబ్ద కాలంగా ఆర్థికపరంగానూ, అవకాశాల్లోనూ రాష్ట్రానికి సంభవించిన నష్టాన్ని ప్రజలు అవగాహన చేసుకోవడానికి వీలుగా ముఖ్య రంగాలకు సంబంధించి ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేసింది. మానవ వనరుల అభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, సాగునీరు, వ్యవసాయం, విద్యుచ్ఛక్తి, ఆర్థిక వనరుల సమీకరణ మరియు నిర్వహణ,

నైపుణ్యాభివృద్ధులకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిని, రాష్ట్ర విభజన ప్రభావాన్ని సామాజిక, ఆర్థిక సూచికల ప్రకారం ఈ శ్వేతపత్రాలు నిశితంగా పరిశీలించి వివరించాయి.

**ప్రాధాన్యతల నిర్ధారణః**

11. ఎన్నికల సమయంలో ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చడానికి ఈ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నందున ప్రధానంగా ఐదు అంశాలకు సంబంధించి ప్రభుత్వం ముఖ్య ప్రకటనలు చేసింది. అవి రైతులకు ఋణభారం నుండి ఉపశమనం, డ్వాక్రా మహిళాసంఘాలను బలోపేతం చేయడం, పింఛను మొత్తాల పెంపుదల, ప్రయివేటు రంగం నెరవేర్చవలసిన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా 2రూపాయలకు 20లీటర్ల మినరల్ వాటర్ సరఫరా, గ్రామాలలో బెల్టుషాపుల మూసివేత మరియు ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంపుదల. ఒక సమగ్ర అభివృద్ధి వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయాలు కూడా అమలు జరుపబడుతున్నాయి.

12. అర్హతగల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు కల్పించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఇంతేకాక, కాపులు మరియు బ్రాహ్మణుల సంక్షేమానికి పథకాలు చేపట్టడం కోసం కూడా బడ్జెట్‌లో కేటాయింపు చేయడం జరిగింది. ప్రస్తుత బి.సి. వర్గాల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా కాపులను బి.సి.ల జాబితాలో చేర్చేందుకు గాను ఒక కమీషన్‌ను నియమించనున్నాము.

**విజన్ 2029**

13. 2022 నాటికి స్వతంత్ర భారతదేశానికి 75ఏళ్లు పూర్తికానున్న సందర్భంగా దేశంలో అత్యున్నత పురోగతిని సాధించబోయే మొదటి మూడు రాష్ట్రాల్లో మన రాష్ట్రాన్ని కూడా నిలపడం కోసం మారిన పరిస్థితుల్లో ఒక నూతన అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేయడానికి తగిన ప్రమాణాలు నిర్దేశించిడం కోసం విజన్–2020 పత్రాన్ని పునర్లిఖించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సవాళ్లు అనేకం. అయినప్పటికీ దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఒక అత్యున్నత స్థానంలో నిలపాలనే చెక్కుచెదరని సంకల్పంతో, దీక్షతో ముందుకు పోగలమని ఆశిస్తున్నాను.

14. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, 2029 నాటికి పౌరజీవన సంతృప్తి మరియు సంతోష సూచికల ప్రకారంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా రూపుదిద్దాలనీ, అందుకుగాను రాబోయే 3 ఆర్థిక సంఘాల కాలవ్యవధిని కూడా ఉపయోగించుకోవాలనీ ఈ ప్రభుత్వ ప్రధానలక్ష్యం.

**100రోజుల కార్యాచరణ ప్రణాళికః**

15. అభివృద్ధి గమనాన్ని శీఘ్రతరం చేయడానికీ, ఫలితాలను ఉద్యమస్థాయిలో రాబట్టడానికి ఈ ధ్యేయాన్ని నెరవేర్చుకునే దిశగా పాలనాయంత్రాంగాన్ని పునరుత్తేజితం చేయడానికీ ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను చేపట్టింది.

**మిషన్ ఆధారిత అభివృద్ధి వ్యూహం**

16. ప్రజల యొక్క సంక్షేమాన్నీ, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం కోసం ఎన్నో పథకాల్నీ, కార్యక్రమాల్నీ అమలు చేయడం రాష్ట్ర అభివృద్ధి ప్రక్రియలో భాగంగా ఉంది. చెప్పుకోదగ్గ ప్రయత్నాలు చేసినప్పటికీ మనం సాధించగలిగి ఉండి కూడా సాధించలేకపోయిన ఫలితాలకూ మరియు వాస్తవంగా సాధించిన ఫలితాలకూ మధ్య వ్యత్యాసాలు ఉంటూనే ఉన్నాయి. సంస్థాగత సామర్థ్యాలు చాలినంత లేకపోవడం, వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడడం, లక్ష్యాలకు తగ్గట్టుగా ప్రయత్నాలు చేయకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఇన్నేళ్లుగా నెలకొల్పుతూ వచ్చిన ఎన్నో సంక్షేమ అభివృద్ధి నిర్మాణాలు మన అవసరాలను తీర్చలేకపోతున్నాయని తెలిసి వచ్చింది. ఇందువల్ల మనం మన విధానాలను మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. అభివృద్ధి కార్యక్రమాలను మిషన్ స్థాయిలో అంటే-ఉద్యమస్థాయిలో చేపట్టవలసిన అవసరం కలిగింది. అభివృద్ధికీ, ప్రగతికీ అంకితమైన పరిపాలన దిశగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా యథాతథంగా కార్యక్రమాలను అమలుచేసుకుంటూ పోయినందువల్ల సంక్షేమ సమాజపు అంతిమ లక్ష్యాలను సాధించడంలో యంత్రాంగం విఫలమయింది.

17. కాబట్టి ముమ్మరంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవలసిన అవసరాన్ని గుర్తించి, వివిధ స్థాయిల్లో కూలంకషంగా చర్చించిన అనంతరం ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాలకు చెందిన ముఖ్య రంగాల్లో 7మిషన్‌లను నెలకొల్పాలని నిర్ణయించింది. ఆ మిషన్‌లు వార్షిక ప్రణాళికల్లో స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను మేళవించి, ఒక నవీన అభివృద్ధి శకానికి దారితీయనున్నాయి. ప్రతి ఒక్క మిషన్‌కూ స్పష్టమైన తార్కిక నిర్మాణం, నిర్దిష్ట ఫలితాల నిర్వచనం ఉంటాయి. ప్రతి మిషన్‌కీ లక్ష్యాలు, కార్యక్రమాలు, కాలవ్యవధి, మైలు రాళ్లు, ఆశించిన ఫలితాలు స్పష్టంగా నిర్వచించబడ్డాయి. ఆ మిషన్‌లకు కొన్ని నిర్దిష్ట కార్యక్రమాల అమలుకోసం మరికొన్ని సబ్-మిషన్‌లు కూడా ఏర్పడనున్నాయి. అవిః 1. ప్రాథమిక రంగమిషన్, 2. సామాజిక సాధికారతా మిషన్, 3.విజ్ఞానం-నైపుణ్యాల అభివృద్ధి మిషన్, 4.పట్టణాభివృద్ధి మిషన్, 5.పరిశ్రమలు/వస్తూత్పత్తి మిషన్, 6.మౌలికసదుపాయాల మిషన్, 7. సేవారంగ మిషన్

18. ప్రతి మిషన్‌కూ గౌరవముఖ్యమంత్రి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ప్రతి మిషన్‌కూ స్పష్టంగా నిర్వచించబడ్డ లక్ష్యాలు, నిర్వహణ విధానం, వనరుల సమీకరణ, శాఖాపరమైన సహకారం అమలు చేసే పద్ధతి, జిల్లాస్థాయి విస్తరణ యంత్రాంగం, ప్రగతి నివేదికలు, సమీక్ష మరియు మూల్యాంకన విధానాలు, పని తీరును ప్రోత్సహించే అవార్డులు ఉంటాయి.

**జిల్లా అభివృద్ధి ప్రణాళిక**

19. జిల్లా స్థాయిలోనూ, జిల్లా కన్నా దిగువస్థాయిలోనూ కార్యక్రమాల అమలును వికేంద్రీకరించడం ద్వారా వికేంద్రీకృత సంస్థలు మరింత శక్తివంతంగా తమ పాత్రను ఏవిధంగా నిర్వహించగలవన్న విషయాన్ని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తున్నది. వికేంద్రీకరణ అంటే మరింత మెరుగైన పద్ధతిలో సేవలను అందించడంగానే నేడు మనం అర్థం చేసుకుంటున్నాం. ఆ దిశగా జిల్లాస్థాయిలో సేవలను మరింత మెరుగ్గా అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మరింత మెరుగైన ప్రణాళిక, పాలన, ఆర్థిక సేవా వ్యవస్థలను రూపొందించడానికి యోచిస్తున్నది.

20. ప్రణాళికా ప్రక్రియను కార్యక్రమ నిర్వాహకులు అవగాహన చేసుకోవడానికి వీలుగా ప్రణాళికల రూపకల్పనలోనూ, ప్రణాళికల వికేంద్రీకరణలోనూ అత్యున్నత విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వం ఈ దిశగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

21. కాగా ప్రస్తుత సంవత్సరానికి నేను పరిమితమైన అంచనాలు గల ప్రణాళికతో కూడుకున్న బడ్జెట్‌ను మాత్రమే సమర్పించగలుగుతున్నాను. గతం నుంచి మనకు లభించిన అనేక సమస్యలే ఇందుకు కారణం. అంతేకాక ఖచ్చితంగా ఆదాయపు వసూళ్లను లెక్కకట్టడంలో కొన్ని సాంకేతికమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న విషయాన్ని కూడా నేను తమద్వారా సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ప్రస్తుత బడ్జెటు మొదటి రెండు నెలలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ, తక్కిన పది నెలలకూ శేషాంధ్రప్రదేశ్ యొక్క పరిస్థితిని వివరించనున్నది. ఇందువల్ల వసూళ్లు మరియు వ్యయానికి సంబంధించిన అంచనాలు, ఆదాయం మరియు ఆర్థికలోటుకు సంబంధించిన అంచనాలు తీవ్రంగా ప్రభావితమవడం వల్ల ఎ.పి.ఎఫ్.ఆర్.బి.ఎమ్ చట్టంలో నిర్దేశించిన నిబంధనలను అనుసరించడం రాష్ట్రానికి కష్టసాధ్యమౌతున్నది. ఈ విషయాన్ని ఇప్పటికే భారతప్రభుత్వ దృష్టికి తీసుకురావడం జరిగింది. మనం దాదాపుగా ఆర్థిక సంవత్సరం మధ్యలో ఉన్నందున ఈ మిగిలిన ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం యొక్క అత్యవసర కనీస అవసరాలను తీర్చడం మీదనే ఈ బడ్జెట్ ప్రధానంగా దృష్టి పెడుతున్నది. అయితే మిగిలిన ఆర్థిక సంవత్సరకాలంలో మేము ఆర్థిక ఆదాయాన్ని వీలైనంత పెంచడానికి, రాష్ట్ర ప్రజలు తాము ఖర్చు పెట్టిన సొమ్ముకు మరింత విలువ పొందేవిధంగా వ్యయ నిర్వహణ చేయడానికి మేము శాయశక్తులా కృషిచేయనున్నాము. ప్రభుత్వ పథకాలు ఉద్దేశించిన లబ్ధిదారులకే చెందడానికీ, ఎటువంటి దుర్వినియోగం కాకుండా చూడడానికీ

ఆధార్ నంబరును తప్పనిసరిగా అన్ని పథకాలకూ అనుసంధానం చేయాలని నిర్ణయించడం జరిగింది. భారతప్రభుత్వ బడ్జెట్‌లో మన రాష్ట్రం కోసం ఉద్దేశించిన కొన్ని కేటాయింపులు ఉన్నాయి. కాని ఇవి చాలినంతగా లేవు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో పేర్కొన్న విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని భారతప్రభుత్వ ఆర్థికశాఖామాత్యులు తమ బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా పేర్కొన్నారని చెప్పడానికి సంతోషిస్తున్నాను. కాబట్టి బడ్జెట్‌లో చూపించిన కేటాయింపులకు మాత్రమే పరిమితం కాకుండా కేంద్ర ప్రభుత్వం నుండి మరింత అదనపు వనరులను రాబట్టే దిశగా మేం మరింత కృషిచేస్తామని విన్నవించుకుంటున్నాను.

22. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబునాయుడు గారు దాదాపు 3,000 కి.మీల తమ పాదయాత్రలో భాగంగా ప్రజాబాహుళ్యాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, వారితో మమేకమై వారి సమస్యలను లోతుగా అర్థం చేసుకున్నారు. ఆ అవగాహనపైనే మా పార్టీ మానిఫెస్టో రూపొందింది. ఆ అవగాహనతోనే ఇప్పుడు ప్రభుత్వ పథకాలు రూపుదిద్దుకుంటున్నాయి. పౌరులందరూ సమానావకాశాలు పొందగలిగే పేదరిక రహిత సమాజస్థాపనే మా ధ్యేయం. ఈ సందర్భంగా "కీర్ హార్డీ" గారి పలుకులను గుర్తుచేస్తున్నాను. "ప్రగతికి సిసలైన గీటురాయి ఏమిటంటే, సంపద కొద్ది మంది చేతుల్లో పోగవడాన్ని సూచించేది కాక, ప్రజలందరి ఉన్నతిని సూచించేది". మేము అవినీతి రహిత పారదర్శన పాలనను అందించడానికి కట్టుబడి ఉన్నాము. భూమి, అటవీ సంపద, గనులు, ఖనిజాలు మొదలగు సహజ వనరుల పరాధీనత, అక్రమమద్యం అమ్మకాలు, అటవీసంపద దోపిడీ, ప్రజాపనులలో ముఖ్యంగా నీటిపారుదల రంగంలో ప్రజాధనం దుర్వినియోగం వంటి అంశాలను సమీక్షించి అవినీతిని ఎదుర్కొని, ప్రభుత్వ ఆస్తులు ఆదాయాలను సంరక్షించాలనే నిర్దిష్ట సంకల్పంతో, ప్రభుత్వం మంత్రివర్గ సంఘాన్ని నియమించింది. ఈ సంఘము ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, నిజాయితీ, సమర్థతను పెంపొందించడానికి తగిన సూచనలు చేస్తుంది.

23. తక్కిన దేశంలోలాగానే మన రాష్ట్రంలో కూడా జనాభాలో యువత శాతం గణనీయంగా ఉంది. మధ్యతరగతి త్వరితంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ రెండు వర్గాలకూ చెందినవారికి చాలా ఉన్నతమైన ఆకాంక్షలున్నాయి. ఆ ఆకాంక్షలను నెరవేర్చడం కోసం మా ప్రభుత్వం శాయశక్తులా కృషి చేయటానికి సిద్ధంగా ఉంది. యువతకు తగిన నైపుణ్యాల కల్పన, సమర్థవంతంగానూ సకాలంలోనూ సేవలు అందించడం, అన్ని గ్రామాలనూ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా అనుసంధానించడం, రక్షిత మంచినీటి సరఫరా కోసం వాటర్‌గ్రిడ్ ఏర్పాటు, ప్రతి కుటుంబంలోనూ కనీసం ఒకరికి ఉపాధి కల్పించేలా ఉద్యోగ అవకాశాల కల్పన, జీవనప్రమాణాల మెరుగుదల మీదే మా దృష్టి, నిరుద్యోగులకు ఉపాధి కలిగే వరకు నిరుద్యోగ భృతిని అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాం. స్థూల రాష్ట్ర సంతోషసూచిక, స్థూల రాష్ట్ర వస్తూత్పత్తి సూచిక కన్నా ముఖ్యమని మేం ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం.

24. బడ్జెట్ రూపకల్పన, వ్యయ నిర్వహణలను మెరుగుపరచడంలో భాగంగా రాబోయే సంవత్సరం నుంచి బడ్జెట్‌లో యథాతథంగా కేటాయింపుల పెరుగుదల ఉండబోదని తెలియజేస్తున్నాను. అందుకు బదులు ఆయా ప్రభుత్వ శాఖలు తాము కేటాయింపుచేయనున్న ప్రతి అంశంలోనూ తాము ప్రతిపాదిస్తున్న వ్యయాన్ని ఎందుకు ప్రతిపాదిస్తున్నారో జీరోస్థాయి నుంచి వివరించి సమర్థించుకోవలసి ఉంటుంది.

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 2013-14**

25. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ముఖ్య అంశాలను క్లుప్తంగా వివరిస్తాను. ప్రస్తుత ధరల ప్రకారం 2012-13 సంవత్సరానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.4,19,391కోట్లు కాగా 2013-14 సంవత్సరానికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.4,75,859 కోట్లుగా అంచనా వేయబడింది. అంటే 13.46 శాతం వృద్ధి నమోదయింది. స్థిర (2004-05) ధరల ప్రకారం 2012-13 సంవత్సరానికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.2,35,930కోట్లు కాగా 2013-14 కు రూ.2,50,282కోట్లుగా అంచనా వేయబడింది. అంటే 6.08 శాతం వృద్ధి నమోదయింది స్థిర ధరల ప్రకారం వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాలు 2013-14 సంవత్సరంలో 6.94 శాతం, 2.16 శాతం, 7.25 శాతం వృద్ధి రేటును సాధించాయి.

26. ప్రస్తుత ధరల ప్రకారం 2012-13 సంవత్సరానికి తలసరి ఆదాయం ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.76,041 కాగా 2013-14 కు రూ.85,797 గా నమోదయింది. అంటే 12.8 శాతం పెరుగుదల సంభవించింది. స్థిర (2004-05) ధరల ప్రకారం తలసరి ఆదాయం 2012-13 కు రూ. 42,186 కాగా 2013-14 కు రూ.44,481 కి పెరిగింది. అంటే 5.4 శాతం వృద్ధి రేటు నమోదయింది.

**వ్యవసాయం**

27. మన రాష్ట్ర జనాభాలో అధికశాతం ఇప్పటికి జీవనోపాధి కోసం వ్యవసాయం మీదనే ఆధారపడినందువల్ల రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం 17శాతం దాకా ఉంది. పెరుగుతున్న జనాభాకు ఆహారధాన్యాలు అందించగలగడం ద్వారా మన దేశాన్ని స్వయం సమృద్ధ దేశంగా రూపొందించడంలో మన వ్యవసాయ సమాజం గొప్ప పాత్ర పోషించింది. అయితే దురదృష్టవశాత్తు వరుసగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు, ఖర్చుల పెరుగుదల, గిట్టుబాటుధర రాకపోవడం వంటి కారణాల వల్ల రాష్ట్రంలో వ్యవసాయ క్షేత్రంలో తీవ్ర సంక్షోభం నెలకొని ఉంది. ఈ సంక్షోభం ఏ స్థాయికి చేరుతుందంటే పరిస్థితుల ప్రభావానికి తట్టుకోలేక ఎందరో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉన్నారు. ఈవిధంగా గూడు కట్టుకున్న నైరాశ్యాన్నీ, సంక్షోభాన్ని

ఎదుర్కోవడం కోసం రైతు జనావళికి చేయూతనందించడం కోసం చరిత్రలో ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా రైతు రుణాలను మాఫీ చేయడం కోసం మేము ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకున్నాం. రైతులు వ్యవసాయం కొరకు బ్యాంకుల నుండీ, సహకార సంఘాల నుండీ తీసుకున్న పంట రుణాలను, బంగారంపై తీసుకున్న రుణాలతో సహా కుటుంబానికి రూ.1.50 లక్షల వరకు రుణభారం నుండి ఉపశమనం కలిగించడానికి నిర్ణయించాము. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఈ నిర్ణయం రాష్ట్రం మీద మరింత పెనుభారం మోపనున్నదని మాకు తెలుసు. కానీ రైతులకు ఈ సదుపాయం కలిగించకపోతే భవిష్యత్తులో వ్యవసాయరంగం నిలదొక్కుకోవడం దుస్సాధ్యం. అయితే ఈ పథకం అమలుచేయటంలో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా, మరియు బ్యాంకులు లేవనెత్తిన ఎన్నో సాంకేతిక అవరోధాలను మేం అధిగమించవలసి ఉంది. అయితే రైతులను రుణభారం నుంచి విముక్తులను చేయటానికి వనరులు సమకూర్చే దిశగా మేం శాయశక్తులా కృషి చేయనున్నాము. వ్యవసాయరంగాన్ని నిలదొక్కుకునే విధంగా, గిట్టుబాటు కలిగించే రంగంగా చేయటం కోసం వివిధ చర్యలు చేపట్టవలసింది. తన పాదయాత్రలో రైతులను కలుసుకున్నప్పుడు వారి కడగండ్లను స్వయంగా చూసిన గౌరవనీయులు మన ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడుగారు చలించిపోయారు. పలు విధాలైన రైతు సమస్యలను ఎదుర్కోవటానికి బహుముఖమైన వ్యూహమొకటి రూపొందించాలనే భావనకి అప్పుడే అంకురార్పణ జరిగింది. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాల అభివృద్ధి కోసం చేపడుతున్న వివిధ పథకాలనూ, కార్యక్రమాలనూ సమన్వయపర్చడం ఇందుకొక ముఖ్యమైన మార్గం. అటువంటి సమన్వయాన్ని సాధించే దిశగా సాధారణ బడ్జెట్‌లో భాగంగా వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా బడ్జెట్ రూపొందించి సమర్పించనున్నాము. వ్యవసాయం, వ్యవసాయ ప్రాసెసింగ్, మార్కెటింగ్, గిడ్డంగుల నిర్వహణ, పశు సంవర్థక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల గౌరవనీయ మంత్రివర్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుగారు వ్యవసాయానికీ, వ్యవసాయ సంబంధిత రంగాలనూ అభివృద్ధి చేయటం కోసం ఒక సమగ్ర వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్నారు.

## సంక్షేమ శాఖలు

### సాంఘిక సంక్షేమం

28. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల జనాభా 84.45 లక్షలు. రాష్ట్రం మొత్తం జనాభాలో వారిది 17.1 శాతం. ఒక బహుముఖీన అభివృద్ధి వ్యూహం ద్వారా షెడ్యూల్డ్ కులాల జనాభాకు సాధికారికత సమకూర్చే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

29. ఈ వ్యూహంలో షెడ్యూల్డ్ కులాల బాలబాలికల విద్యాభివృద్ధికి చేయూతనందించడం ప్రధాన కార్యక్రమం. 1445 వసతిగృహాలలో నివసిస్తున్న 1,44,500 విద్యార్థులకు నివాస, భోజన, విద్యా సదుపాయాలకు ప్రభుత్వం పూర్తి తోడ్పాటును అందిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 177 గురుకుల పాఠశాలల ద్వారా 1,24,000 మంది విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నది. ఈ సంస్థ పాఠశాలలు రాష్ట్రస్థాయి సగటు కన్నా మిన్నగా వరుసగా ఉన్నత ఫలితాలను సాధిస్తున్నది. ఎస్.సి./ఎస్.టి./బి.సి./మైనారిటీల ప్రయోజనార్థం ప్రభుత్వం నడుపుతున్న రెసిడెన్షియల్ స్కూల్స్ సాధించిన ఉత్తమ ఫలితాలను దృష్టిలో ఉంచుకొని దశలవారీగా అన్ని సంక్షేమ హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. విద్యాభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు ప్రీ–మెట్రిక్, పోస్ట్–మెట్రిక్ ఉపకారవేతనాల మంజూరు మరియు పేద షెడ్యూల్డ్ కులాలకు చెందిన పేద విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి వీలుగా అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఏర్పాటు చేయడం మరొక ముఖ్యమైన కార్యక్రమం.

30. షెడ్యూల్డ్ కులాల సాధికారికత దిశగా మరొక ముఖ్యమైన చర్య షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టడానికి వీలుగా ఆర్థిక సహాయం అందించడం. ఈ ఆర్థికసహాయం ఏ.పి. షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సొసైటీ లిమిటెడ్ ద్వారా సబ్సిడీ రూపంలో అందించడం జరుగుతుంది.

31. షెడ్యూల్డ్ కులాల సాధికారికతకు చేపట్టిన మూడో ముఖ్యమైన చర్య షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికను అమలు పరచడం. సాధారణ ప్రజానీకానికీ, షెడ్యూల్డ్ కులాలకూ మధ్య అభివృద్ధిలో ఉన్న వ్యత్యాసాలను పూరించే దిశగా వ్యక్తులకూ, కుటుంబాలకూ, జనావాసాలకూ ప్రత్యక్షంగానూ, నిర్దిష్టంగానూ లాభించే వివిధ కార్యక్రమాలను సంబంధిత శాఖలు రూపొందించి అమలుచేసే విధంగా షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికను అమలుచేయడం జరుగుతున్నది. 2014–15 లో రాష్ట్ర జనాభాలో 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల జనాభా నిష్పత్తి మేరకు ఉపప్రణాళిక కేటాయింపులను 17.1 శాతానికి పెంచడం జరిగింది.

32. ఇందుకు గాను 2014–15 బడ్జెట్ అంచనాల్లో రూ.2657కోట్లు ప్రతిపాదించడమైనది.

**గిరిజన సంక్షేమం**

33. రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల జనాభా 26.31 లక్షలు. వీరు రాష్ట్ర జనాభాలో 5.33 శాతం ఉన్నారు. మొత్తం 35 గిరిజన తెగలు ఉండగా వారిలో 6 తెగలను ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగలు (పిటిజిలు) గా గుర్తించడం జరిగింది.

34. షెడ్యూల్ తెగలకు సంబంధించి ఆర్థికపరమైన, విద్యాపరమైన సమానతతోపాటు మానవ వనరుల అభివృద్ధి మీద దృష్టి పెట్టి వారి సత్వర అభివృద్ధి సాధించడం కోసం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలుచేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.

35. గిరిజన ప్రాంతాల్లో షెడ్యూల్డ్ తెగల విద్యాభివృద్ధి ప్రభుత్వం నిర్దేశించుకున్న ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. గిరిజన సంక్షేమశాఖ బడ్జెట్‌లో దాదాపు 70 శాతం విద్యా కార్యక్రమాల అమలుకే కేటాయించడం జరిగింది.

36. 13వ ఆర్థికసంఘం వారి సహకారంతో మారుమూల గిరిజన ప్రాంతాల్లో వివిధ గ్రామాలకు రక్షిత మంచినీరు అందించడం, నాబార్డ్ సహాయంతో రహదారుల నిర్మాణం కూడా శాఖ చేపడుతున్నది.

37. ఈ శాఖకు 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.1150 కోట్లు ప్రతిపాదించడమైనది.

**వెనుకబడిన తరగతుల సంక్షేమం**

38. వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల కోసం రాష్ట్రంలో 692 బాలుర వసతిగృహాలు, 201 బాలికల వసతిగృహాలు పని చేస్తున్నాయి. వీటిలో 72,743 మంది బాలురు, 23,296 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో 10వ తరగతి పరీక్ష ఫలితాలు 90.87 శాతం కాగా, ఈ వసతిగృహాల విద్యార్థులు 93.73 శాతం ఫలితం సాధించారు. వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి వీలుగా ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలోనూ బాలుర కోసం, బాలికల కోసం ఒక్కొక్క హాస్టల్ చొప్పున నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది.

39. పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాల పథకంలో భాగంలో అర్హులైన బి.సి. విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు, ట్యూషన్ ఫీజు చెల్లించబడుతున్నాయి. అర్హులైన ఇబిసి విద్యార్థులకు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించబడుతున్నది.

40. వెనుకబడిన తరగతులకు చెందిన విద్యావంతులయిన నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షల్లో తక్కిన వారితో దీటుగా పోటీ పడడానికి రాష్ట్రంలో 13 బిసి స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేయబడుతున్నది.

41. బిసి విద్యార్థుల కోసం మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలు 31 నడుస్తున్నాయి. వాటిలో 17 బాలుర కోసం, 14 బాలికల కోసం నడుస్తున్నాయి. 2013–14 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ఈ పాఠశాలల విద్యార్థులు 98.99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

42. అంతేకాక వెనుకబడిన తరగతుల కోసం ఒక సమగ్ర ఉప ప్రణాళిక రూపకల్పన కోసం కూడా చర్యలు చేపట్టనున్నామని సంతోషంగా తెలియజేస్తున్నాను.

43. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 2014–15 బడ్జెట్ అంచనాల్లో రూ.3130 కోట్లు ప్రతిపాదించడమైనది.

## మైనారిటీల సంక్షేమం

44. ఆర్థికాభివృద్ధిలో మైనారిటీ వర్గాలకు సముచిత వాటా కల్పించడం, ప్రస్తుతం నడుస్తున్న పథకాల ద్వారా, కొత్త పథకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి పథకాలకూ, ఆర్థికాభివృద్ధి పథకాలకూ మెరుగైన రుణ సదుపాయం కల్పించడం, కేంద్ర–రాష్ట్ర సంస్థల్లో ఉద్యోగాలు పొందడం కోసం అవసరమైన నైపుణ్యాలు కల్పించడం, సాంకేతిక శిక్షణ కల్పించడం ఈ శాఖ ముఖ్యోద్దేశాలు. ప్రీ–మెట్రిక్, పోస్ట్–మెట్రిక్ ఉపకారవేతనాల మంజూరు, బ్యాంక్‌ల ద్వారా అందజేసే రుణాలకు సబ్సిడీ మంజూరు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల నిర్వహణ, పోటీ పరీక్షలకు శిక్షణ ఈ శాఖ చేపడుతున్న ముఖ్య కార్యక్రమాలు. మైనారిటీల సంక్షేమం కోసం దుకాన్–ఓ–మకాన్, రోష్నీ అనే కొత్త పథకాలు కూడా అమలు జరుగుతున్నాయి.

45. ఈ శాఖకు 2014–15 బడ్జెట్ అంచనాల్లో రూ.371 కోట్లు ప్రతిపాదించడమైనది.

## స్త్రీ, శిశు సంక్షేమం

46. ఒక జాతి సాధించిన ప్రగతిని ఆ జాతికి చెందిన స్త్రీల ప్రగతిని బట్టి అంచనా వేయవచ్చునని బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారని గుర్తు చేసుకుంటున్నాను. ఆ దిశగా మా ప్రభుత్వం మహిళా సాధికారికతకు కట్టుబడి ఉంది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 41,982 అంగన్ వాడీ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో 4,248 కేంద్రాలు, గిరిజన ప్రాంతాల్లో 2,169 కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇవికాక 6,625 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా పని చేస్తున్నాయి. 254 ప్రాజెక్టుల ద్వారా ఐసిడిఎస్ పథకం సార్వత్రీకరించబడింది.

పౌష్టికాహార పథకం కింద దాదాపు 27 లక్షల మంది శిశువులు, 8 లక్షల మంది గర్భిణీ స్త్రీలు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. ఇవికాక మరెన్నో పథకాలు అమలవుతున్నాయి.

47. స్త్రీ శిశు సంక్షేమానికి 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.1,049 కోట్లు ప్రతిపాదించడమైనది.

### వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమం

48. వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ విభిన్న సామర్థ్యాలు కలిగిన బాలబాలికల కోసం 20 హాస్టళ్లు, 2 నిలయాలు, 6 గురుకుల పాఠశాలలు మరియు ఒక గురుకుల జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నది. అటువంటి బాలబాలికలకు ప్రీ-మెట్రిక్ మరియు పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నది. దృష్టి సమస్య కలిగిన బాలబాలికలు కంప్యూటర్ శిక్షణ, ఆర్థిక పునరావాసం, వివాహాలకు ప్రత్యేక అవార్డులతోపాటు, విద్యార్థులకు ప్రత్యేక బోధన సామగ్రి పంపిణీ కూడా ఈ శాఖ చేపడుతున్నది.

49. వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమానికి 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.65 కోట్లు ప్రతిపాదించడమైనది.

### యువజన సేవలు

50. యువజన సేవా శాఖ యువత అసాంఘిక కార్యక్రమాల బారిన పడకుండా వారి శక్తి సామర్థ్యాలను నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించడానికి కృషి చేస్తున్నది. యువత అవసరాలనూ, మారుతున్న ఆకాంక్షలనూ దృష్టిలో పెట్టుకుని తగిన రీతిలో యువజన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నది.

51. ఈ శాఖకు 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.126 కోట్లు ప్రతిపాదించడమైనది.

### పర్యాటక మరియు సాంస్కృతిక రంగము

52. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచి ఉద్యోగ అవకాశాలు కల్పించే శక్తి పర్యాటక రంగానికి ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రాకృతికసంపద, చారిత్రిక, సాంస్కృతిక వారసత్వ సంపద వల్ల ఇప్పటికే భారతదేశంలో దేశీయ స్థాయి పర్యాటకులను ఆకర్షిస్తూ ఉన్నది. ఈ పరిస్థితిని మరింత మెరుగుపర్చుకోవడంతోపాటు, మరెంతో మంది పర్యాటకులను ఆకర్షించే

దిశగా రాష్ట్రంలోని అన్ని పర్యాటక కేంద్రాల్లోనూ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

53. 2014-15 లో రూ.100 కోట్ల మేరకు కేంద్ర ప్రభుత్వ సహాయంతో కృష్ణా, అనంతపురం జిల్లాలలో మెగా టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించడం జరిగింది. వీటితోపాటు శ్రీకాకుళం, గుంటూరులో కొత్త టూరిజం సర్క్యూట్లు, శ్రీకాళహస్తిలో సౌండ్ అండ్ లైట్ షో పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెంలో బీచ్ రీసార్ట్ అభివృద్ధికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

54. కళలు, హస్తకళలు మరియు ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని పునరుద్ధరించి, ప్రోత్సహించడం కోసం కాకినాడ, ఏలూరు, విజయవాడ, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో శిల్పారామాలు నెలకొల్పాలని ప్రతిపాదించడమైనది.

55. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తిరుపతిలో రూ.50 కోట్ల అంచనా వ్యయంతో ఇండియన్ కులినరి ఇనిస్టిట్యూట్ రూ.117 కోట్ల అంచనా వ్యయంతో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లను నెలకొల్పడానికి ప్రతిపాదించడం జరిగింది. ఆ సంస్థల ద్వారా పర్యాటక రంగానికి సుశిక్షితులైన మానవ వనరులను అందించడం సాధ్యమవుతుంది. అంతేకాక ఒక్కొక్కటీ రూ.12 కోట్ల అంచనా వ్యయంతో తిరుపతిలో, కాకినాడలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్లు నెలకొల్పబడుతున్నాయి. అంతేకాక మరికొన్ని ముఖ్య పర్యాటక ఉత్పత్తులకు సంబంధించి పిపిపి పద్ధతి ద్వారా ప్రైవేటు రంగం పెట్టుబడులను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

56. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.113 కోట్లు ప్రతిపాదించడమైనది.

## గృహ నిర్మాణం

57. ఆంధ్రప్రదేశ్‌ను గుడిసెలుగానీ, మురికి వాడలుకానీ లేని రాష్ట్రంగా రూపొందించడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టడం గృహ నిర్మాణ లక్ష్యం. ఇంత వరకు 65.35 లక్షల గృహాలు పూర్తికాబడ్డాయి. 4.93 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ స్థాయిల్లో ఉంది. 6.98 లక్షల ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కావలసి ఉంది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో భారత ప్రభుత్వం వారి ఆర్‌ఎవై పథకం ద్వారా ప్రస్తుత సంవత్సరంలో 25,000 ఇళ్లు నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

58. ప్రస్తుత ప్రభుత్వం ఎస్.సి/ఎస్.టి నిరుపేదలకు ఇంటికి రూ.1.50 లక్షల వ్యయంతోనూ, ఇతర బలహీన వర్గాల వారికి లక్ష రూపాయలతోనూ ఇళ్లు నిర్మించాలని సంకల్పించింది.

ఇందుకుగాను నిర్మాణ వ్యయం వృథా కాకుండా ప్రస్తుతం నడుస్తున్న పథకాన్ని సవరించనున్నాము.

59. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.808 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పౌర సరఫరాలు**

60. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు పౌష్టికాహారం అందుబాటులోకి తీసుకురావడం కోసం గతంలో మా ప్రభుత్వం రూపకల్పన చేసి అమలులోకి తీసుకొచ్చిన సబ్సిడీ బియ్యం పథకాన్ని కొనసాగించడంతోపాటు, తగిన ధరలకు వివిధ ఆహార వస్తువుల్ని అందించే కార్యక్రమం కూడా చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అల్పాదాయ వర్గాల వారికి తక్కువ ధరలో ఆహారాన్ని అందించేందుకు 'అన్న క్యాంటీన్స్' ఏర్పాటుకు కృషి చేయనున్నాము.

61. ధరల్ని నియంత్రించడంకోసం, ఎసెన్షియల్ కమాడిటీల సరఫరాను సమర్థవంతంగా అమలు చేయటానికి చర్యలు చేపట్టడంతోపాటు, వివిధ రకాల మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలను ప్రభుత్వం చేపట్టనుంది. రైతుబజారు ద్వారా కూరగాయలు మొదలైనవి సముచితమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతున్నది.

62. రేషన్ కార్డులను ఆధార్ నంబర్‌కు అనుసంధానం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. తూర్పుగోదావరి జిల్లాలో ఈపిఓఎస్ మిషన్‌ల ద్వారా చేపట్టిన బయోమెట్రిక్ నిర్ధారణ వల్ల 15 శాతం మిగులు కనబడింది. ఈ నిర్ధారణను తక్కిన రాష్ట్రం మొత్తానికి విస్తరించే విషయాన్ని పరిశీలించడం జరుగుతున్నది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులైన అందరు మహిళలకు కొత్తగా దీపం కనెక్షన్లను అందించాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నది. వరి పంటకు రైతుకు కనీస మద్దతు ధర పొందడానికి వీలుగా స్వయంసహాయక బృందాల ద్వారా ఎన్నో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటిదాకా 73 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది.

63. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.2318కోట్లు ప్రతిపాదించడమైనది.

**గ్రామీణాభివృద్ధి శాఖ**

64. దారిద్ర్య నిర్మూలన కోసం గ్రామీణాభివృద్ధి శాఖ ఎన్నో పథకాలు అమలుచేస్తున్నది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఇచ్చే వేతనాలను ప్రభుత్వ ఇటీవలనే రోజుకు రూ.149 నుంచి రోజుకు రూ.169కి పెంచడం జరిగింది. 2013-14లో 34.3 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించబడింది. మొత్తం పథకం కింద రూ.3,038 కోట్లు ఖర్చు కాగా

అందులో రూ.1970 కోట్లు నేరుగా వేతనరూపంలో చెల్లించబడింది. వ్యవసాయరంగంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో భాగంగా ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం కింద రైతులకు, వ్యవసాయ కూలీలకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవసాయ కార్యక్రమాలను అమలు చేస్తున్నది.

65. భూసారం, పచ్చదనం, జలసంపద వంటి ప్రాకృతిక వనరులు అంతరించిపోకుండా పరిరక్షించడానికి, అభివృద్ధి పరచడానికీ, తద్వారా నిరుపేద కుటుంబాలకు నికర జీవనోపాధి కల్పిస్తూ, వాతావరణ సమతౌల్యం కాపాడడం కోసం ఉద్దేశించబడ్డ సమగ్ర వాటర్ షెడ్ నిర్వహణ కార్యక్రమం (ఐడబ్ల్యుఎంపి) 11 డిపిఎపి/డిడిపి జిల్లాల్లో అమలుజరుగుతున్నది.

66. ఋణాలను సకాలంలో చెలిస్తున్న స్వయంసహాయక బృందాలకు వడ్డీలేని ఋణాల పేరిట గ్రామీణదారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రోత్సాహకాలను అందిస్తున్నది. కేవలం మహిళలే సభ్యులుగా గల 6.56 లక్షల స్వయం సహాయకబృందాల్లో సుమారు 70 లక్షల మంది సభ్యులున్నారు. ఈ మొత్తం సభ్యులు పొదుపు చేసుకున్నది రూ.3,064 కోట్లు కాగా, కార్పస్‌గా జమ చేసుకున్నది రూ.4,025 కోట్లు. ఒక్కొక్క బృందానికీ లక్ష రూపాయలు మించకుండా సరికొత్త పెట్టుబడి సమకూర్చడం ద్వారా స్వయం సహాయకబృందాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

67. సామాజికి భద్రత పింఛన్ల కింద 75 లక్షల మంది పింఛనుదారులకు రూ.2,505 కోట్ల మేరకు పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది. వృద్ధులకూ, వితంతువులకూ, నేతపనివారికీ, కల్లుగీత కార్మికులకూ ఎఆర్‌టి కేసులకూ, 40-79 శాతం మేరకు వైకల్యం కలిగిన వికలాంగులకూ ప్రస్తుతం ఇస్తున్న నెలకు రూ.200 పింఛనును నెలకు రూ.1,000కి ప్రభుత్వం పెంపుదల చేసింది. 80 శాతం కన్నా ఎక్కువ వైకల్యం కల్గిన వికలాంగులకు జీవనభద్రత కోసం పింఛనును నెలకు రూ.1,500 కు పెంచింది. ఈ పెంచిన రేట్లు సెప్టెంబరు 2014 నుంచి అమలులోకి రానున్నాయి. అక్టోబరు 2, 2014 నుంచి చెల్లింపు కానున్నాయి.

68. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.6,094 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పంచాయితీరాజ్**

69. నా ప్రసంగంలో ఇంతకు ముందే చెప్పిన విధంగా ఈ ప్రభుత్వం వికేంద్రీకరణను విశ్వసిస్తూ 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్నట్లు గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి కట్టుబడి వుంది. పంచాయితీరాజ్ శాఖ బిఆర్‌జిఎఫ్, ఆర్‌జిపిఎస్ఎ, 13వ ఆర్థికసంఘం నిధులు మరియు రాష్ట్ర ఆర్థికసంఘం నిధులు వంటి ముఖ్య కార్యక్రమాలను అమలుచేస్తున్నది.

70. ప్రాదేశిక అసమానతలను సరిదిద్దడం, మౌలిక సదుపాయాల కల్పనలో నెలకొన్న వ్యత్యాసాలను ప్రస్తుతం అమలుజరుగుతున్న పథకాల ద్వారా పూడ్చలేని కీలక ప్రాంతాలలో పూడ్చడానికి ప్రయత్నించడం కోసం నాలుగు జిల్లాల్లో బిఆర్‌జిఎఫ్ కార్యక్రమం అమలుజరుగుతున్నది.

71. దిగువస్థాయిలో ప్రజాస్వామిక పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం కోసం గ్రామీణప్రాంతాల్లో సేవల నిర్వహణను మెరుగుపర్చడం కోసం గ్రామసభలను, ఇతర పంచాయితీరాజ్ సంస్థలను బలోపేతం చేయడం కోసం ఆర్‌జిపిఎస్ఎ కార్యక్రమం ఉద్దేశించడబడింది.

72. 2013-14 లో వివిధ సమగ్ర తాగునీటి సరఫరా పథకాలను నిర్వహించడం కోసం, పారిశుధ్య నిర్వహణకోసం 13వ ఆర్థికసంఘం అందిస్తున్న నిధులు రూ.562 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది.

73. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కార్యక్రమంతోపాటు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రహదారులను బిటి ప్రమాణాల స్థాయికి అభివృద్ధి చేయడం కోసం రాష్ట్రప్రభుత్వం ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. 2013-14 లో 635.95 కిలోమీటర్ల మేరకు రూ.204.39 కోట్ల వ్యయంతో 346 పనులు చేపట్టబడ్డాయి.

74. ఎమ్ఆర్ఆర్, 13వ ఆర్థికసంఘం నిధులు, సిఆర్ఆర్ మరియు ఆర్‌డిఎఫ్ కార్యక్రమాల కింద సమాకూరుతున్న నిధులతో రహదారుల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతున్నది.

75. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచానాల్లో రూ.4,260 కోట్లు ప్రతిపాదించడమైనది.

## గ్రామీణ నీటి సరఫరా

76. నాణ్యత లోపించిన ప్రాంతాల్లోనూ, పాక్షికంగా నీటిసరఫరా అందుతున్న ప్రాంతాల్లోనూ, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల జనావాసాల్లోనూ రక్షిత మంచినీటి సరఫరా చేయడం, గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుధ్యశాఖ యొక్క ముఖ్య కార్యక్రమం. చేతిపంపులు బిగించిన బోరుబావుల ద్వారా, రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా, సమగ్ర మంచినీటి సరఫరా పథకాల ద్వారా మంచినీటి సరఫరా చేపట్టబడుతున్నది. ఇందుకు అవసరమైన నిధులు ఎస్ఆర్‌డిడబ్ల్యుపి, రాష్ట్ర ప్రణాళికా నిధులు, ఆర్థికసంఘం నిధులు మరియు నాబార్డు, ప్రపంచబ్యాంకు వంటి ఆర్థిక సంస్థలు అందిస్తున్న ఋణసదుపాయం ద్వారా చేకూరుతున్నవి.

77. ఇంతవరకు నెలకొల్పిన సదుపాయల్లో 1,83,533 చేతి పంపులు, 28,173 రక్షిత మంచినీటి సరఫరా పథకాలు, 463 సమగ్ర మంచినీటి సరఫరా పథకాలు, 105 నీటి పరీక్ష ప్రయోగశాలలు ఉన్నాయి. 01-04-2014 నాటికి రోజుకు కుటుంబానికి 55 లీటర్ల కన్నా అధికంగా నీటి సరఫరా అందుబాటులోకి వచ్చిన జనావాసాలు 16,742 ఉండగా, అంతకన్నా తక్కువ సదుపాయంతో పాక్షికంగా లబ్ధి పొందుతున్న జనావాసాలు 29,304 ఉన్నాయి. నీటి నాణ్యత సమస్యగా మారిన జనావాసాలు 1144 ఉన్నాయి.

78. ఎన్ఆర్‌డిడబ్ల్యుపి కింద 8901 జనావాసాలకు లబ్ధి చేకూర్చే 4071 ఎస్‌విఎస్/ఎమ్‌విఎస్ పనులు పురోగతిలో ఉన్నాయి. 9 తీరాంధ్ర జిల్లాల్లో సెలినిటీ సమస్యను ఎదుర్కోవడం కోసం 13వ ఆర్థికసంఘం నిధులతో 47 బహుళగ్రామ పథకాలు పురోగతిలో ఉన్నాయి. ప్రపంచబ్యాంకు సహాయంతో 159 ఏకగ్రామ/బహుళగ్రామ పథకాలు పురోగతిలో ఉన్నాయి.

79. ప్రజలకు అందుబాటులోకి తెస్తున్న మంచినీటి నాణ్యతను మెరుగుపర్చే దిశగా రాష్ట్రప్రభుత్వం ఎన్టీఆర్ సుజల పథకాన్ని అమలు చేయాలనే ఒక బృహత్తర విధాన నిర్ణయాన్ని తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికీ రెండు రూపాయలకు 20 లీటర్ల సురక్షితమైన మంచినీటిని సరఫరా చేయనుంది. నీటి సరఫరాతో, నీటి సరఫరాకై ఏర్పాటుచేసిన పంపిణీ వ్యవస్థలతో, ఇళ్లల్లో నీటిని భద్రపరిచి, వినియోగించే అలవాట్లతో మంచినీటి నాణ్యతా సమస్యలు ముడిపడి ఉన్నాయి. 2 అక్టోబరు 2014 నుంచి మొదటిదశలో భాగంగా 5000 జనావాసాల్లో ఈ కార్యక్రమాన్ని అమలుచేయడానికి ప్రతిపాదించడం జరిగింది.

80. ఇంతేకాక, ఒక వాటర్‌గ్రిడ్ కార్పొరేషన్ నెలకొల్పి ఇంతవరకూ నెలకొల్పిన మంచినీటి సరఫరా సదుపాయాలన్నిటినీ ఈ కార్పొరేషన్‌కు బదలాయించాలని కూడా నిర్ణయించడమైనది. ఈ కార్పొరేషన్ అవసరమైన నిధులను సేకరించి రాష్ట్రమంతటా ఒక వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటుచేయనున్నది.

81. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో నూటికి నూరుశాతం పారిశుధ్యం సాధించడం కోసం ప్రభుత్వం వ్యక్తిగత కుటుంబాల గృహాలకు, పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకూ మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నది.

82. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.1152కోట్లు ప్రతిపాదించడమైనది.

**పట్టణాభివృద్ధి**

83. రాష్ట్రంలో 111 పట్టణ స్థానికసంస్థలున్నాయి. 2013-14 లో 28 మేజర్ గ్రామీణ పంచాయితీలు నగర పంచాయితీలుగా, గ్రేడ్-3 మునిసిపాలిటీలుగా ఉన్నతీకరించబడ్డాయి.

కొన్ని ఆవాసాలను 6 మునిసిపల్ కార్పొరేషన్‌లలో చేర్చడం జరిగింది. పట్టణ స్థానికసంస్థలకు ఈ మధ్యనే ఎన్నికలు జరిగినప్పటికీ, కోర్టుకేసుల కారణంగా 6 మునిసిపల్ కార్పొరేషన్లు, 6 మునిసిపాలిటీలలో ఎన్నికలు నిర్వహించబడలేదు. ఈ పట్టణ స్థానిక సంస్థలలో ఎన్నికలు నిర్వహించమని ప్రభుత్వం త్వరలో రాష్ట్ర ఎన్నికల కమీషన్‌ను కోరనున్నది.

84. గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో పట్టణీకరణ శరవేగంతో జరుగుతున్నది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీసమౌలిక సదుపాయాలు కల్పించడం ఒక సవాలుగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్‌సిటీల నిర్మాణ పథకం నుండి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక లబ్ధిని పొందనుంది. ఈ పథకం క్రింద నిర్మించబడే స్మార్ట్‌సిటీలు మౌలిక సదుపాయాలు, కనీస అవసరాలతో పాటూ సాంకేతికతతో కూడిన జీవనోపాధి అవకాశాలను పెంపొందించే విధంగా అభివృద్ధి చెందుతాయి. రాష్ట్ర ప్రభుత్వం 10 నుండి 12 స్మార్ట్‌సిటీలను అభివృద్ధి చేయాలని భావిస్తోంది. పట్టణ ప్రాంతాలను సమగ్రంగానూ, సమూలంగానూ అభివృద్ధి చేయటానికి రాష్ట్రప్రభుత్వం ఎన్నో విధాన నిర్ణయాలను తీసుకుని ఎన్నో చర్యలు చేపట్టింది. భారతప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమం జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ కింద రాష్ట్రప్రభుత్వం నిధులను సమకూర్చుకుంటున్నది. ఇందులో భాగంగా నీటి సరఫరా, మురుగునీటి పారుదల, రవాణా, మురికివాడల సమగ్ర అభివృద్ధి, గృహనిర్మాణం, మౌలికసదుపాయాల కల్పన, వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టబడుతున్నాయి. ఈ పథకం కింద ఇంతదాకా రూ.6620 కోట్ల అంచనా వ్యయంతో 152 ప్రాజెక్టులు చేపట్టబడగా అందులో 94 పూర్తి చేయబడ్డాయి.

85. మునిసిపల్ ప్రాంతాల్లో దారిద్ర్య నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన మిషన్ (మెప్మా) ద్వారా 19 లక్షలమంది మహిళలకు 1.82లక్షల స్వయం సహాయకబృందాలుగా ఏర్పడడానికి తగిన సహాయం అందించబడింది. వారిలో 1.50 లక్షల స్వయంసహాయకబృందాలు రూ.7727 కోట్ల మేరకు బ్యాంకు ఋణాలు పొందగలిగాయి.

86. ప్రస్తుతమున్న నీటిసరఫరా వ్యవస్థనూ, మురుగునీటి వ్యవస్థనూ మెరుగుపర్చడం ద్వారా పట్టణ స్థానిక సంస్థల కింద ఉన్న ప్రజలకు రక్షిత మంచినీరు అందించడం, ఆరోగ్యకరమైన పరిశుద్ధ వాతావరణం కల్పించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

87. నేషనల్ అర్బన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎన్‌యుఐఎస్) ఒక కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకం. ఈ-గవర్నెన్స్‌లో భాగంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి, కీలక నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన సమాచార వ్యవస్థను నిర్మించడం ఈ పథకం ఉద్దేశం. దీని ద్వారా ఒక సమగ్ర సమాచారవ్యవస్థను నెలకొల్పడం జరుగుతుంది. దీనిలో భాగంగా జిఐఎస్ పటాలు రూపకల్పనలో ఉన్నాయి.

88. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.3,134కోట్లు ప్రతిపాదించడమైనది.

**కార్మిక మరియు ఉపాధిశాఖ**

89. శ్రామికుల సంక్షేమం కోసం పథకాలు అమలుచేయడం, కార్మిక చట్టాలను అమలుచేయటం కార్మికశాఖ బాధ్యత. 2013-14 లో 4,124 నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రూ.8.89 కోట్లు, 6,227 మంది ఇతర రంగాలకు చెందిన కార్మికుల సంక్షేమం కోసం రూ.2.25 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. పారిశ్రామిక శిక్షణ సంస్థల ద్వారా విద్యాభివృద్ధి కోసం నిరుద్యోగయువత శిక్షణ కోసం రూ.23.41కోట్లు ఖర్చు చేయడం జరిగింది.

90. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.276 కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఆరోగ్యం, వైద్యం, కుటుంబసంక్షేమం**

91. నాణ్యమైన, సత్వర వైద్యసేవలను, వైద్యవిద్యను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆరోగ్య, వైద్య కుటుంబసంక్షేమశాఖ ప్రధాన బాధ్యత.

92. ఈ దిశగా ప్రాథమిక, ద్వితీయ ఆరోగ్య రంగాలను బలోపేతం చేయడం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రాల పనితీరును మెరుగుపరచడం కోసం అవసరమైన మౌలికసదుపాయాలనూ, ఆరోగ్యపరీక్ష సదుపాయాలనూ సమకూర్చడం, తగినన్ని ఔషధాలనూ, మందులనూ సరఫరా చేయడం, రోగులకు నాణ్యమైన ఆరోగ్యసేవలను నిరంతరాయంగా అందించడానికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలనూ సమకూర్చడం శాఖ ముందున్న బాధ్యత.

93. నాణ్యమైన సూపర్‌స్పెషాలిటీ సేవలను అందించే విధంగా తృతీయస్థాయి సదుపాయాల కల్పన మీద, విద్యార్థులకు గుణాత్మక వైద్యవిద్యను అందించడం మీద కూడా శ్రద్ధ పెట్టడం జరుగుతుంది.

94. ఇవి కాక, విశాఖపట్నంలో విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను నిర్వహణలోకి తీసుకురావటం, ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షయోజన పథకం క్రింద లభించే ఆర్థిక సహాయంతో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని సదుపాయాలను మెరుగుపర్చడం కూడా జరుగుతుంది. ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ తరహాలో ఒక సూపర్ స్పెషాలిటీ మరియు శిక్షణ సంస్థను భారతప్రభుత్వ సహాయంతో రాష్ట్రంలో నెలకొల్పాలని కూడా ప్రయత్నాలు ప్రారంభించబడ్డాయి.

95. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.4,388 కోట్లు ప్రతిపాదించడమైనది.

**పాఠశాల విద్య**

96. అందరికీ విద్యనందించడం కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆ దిశగా ఎన్నో ముఖ్యమైన పథకాలనూ, కార్యక్రమాలనూ అమలుచేస్తున్నది.

97. భారతప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలలో ఒకటైన సర్వశిక్షా అభియాన్‌ను రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యతతో అమలుచేయడం జరుగుతున్నది. 6-14 సంవత్సరాల మధ్య గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, వారు కనీసం 8 సంవత్సరాల ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసుకునేలా సహకరించడం, లింగపరంగానూ, సామాజికవర్గపరంగానూ ఉన్న వ్యత్యాసాలను తగ్గించడం, నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించడం ఆ పథకం ముఖ్య లక్షణాలు.

98. 2014-15లో కొత్తగా 48 ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించబడ్డాయి. 11 పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ కాబడ్డాయి. 2,441 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి ప్రారంభించబడింది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులందరికీ ఇన్‌సర్వీస్ శిక్షణ ఇవ్వబడింది. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 8 వ తరగతి దాకా చదువుతున్న 35 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ 2 జతల చొప్పున యూనిఫాం అందించబడింది. విద్యాపరంగా వెనుకబడ్డ మండలాల్లో సామాజికంగా వెనుకబడ్డ బాలికలకు గుణాత్మకంగా విద్యను అందుబాటులోకి తీసుకురావడం కోసం 345 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. అవి ఎలిమెంటరీ స్థాయి దాకా విద్యనందిస్తున్నాయి.

99. 14 నుంచి 18 మధ్య వయసు గల పిల్లలకు విద్యనందిస్తూ మాధ్యమికవిద్య ఎలిమెంటరీ మరియు ఉన్నతవిద్యా రంగాల మధ్య ఒక సేతువుగా పనిచేస్తుంది. కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకమైన రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎమ్ఎస్ఎ) నాణ్యమైన మాధ్యమిక విద్యను అందుబాటులోకి తీసుకురావడం కోసం కృషి చేస్తున్నది. గుణాత్మక విద్యనందించడం, మౌలికసదుపాయాల కల్పన, సమత్వసాధన ఈ పథకం ముఖ్య ఉద్దేశాలు.

100. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, విద్యార్థుల హాజరు పెంపొందించడం, డ్రాప్‌ఔట్ రేట్లను తగ్గించడం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో **'బడి పిలుస్తోంది'** అనే కార్యక్రమాన్ని గౌరవనీయ ముఖ్యమంత్రివర్యులు 25.7.2014 న అనంతపురం జిల్లాలో ప్రారంభించారు.

101. పాఠశాలవిద్యకు 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.12,595 కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఇంటర్మీడియట్ విద్య**

102. రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో 431 జూనియర్ కళాశాలలు, 8 వొకేషనల్ జూనియర్ కళాశాలలు పనిచేస్తున్నాయి. 131 ప్రైవేట్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు కూడా ఇంటర్మీడియట్ విద్య సంచాలకుల పర్యవేక్షణలో పనిచేస్తున్నాయి. ఇవికాకా ప్రైవేటు రంగంలో చాలా కళాశాలలు పనిచేస్తున్నాయి.

103. 2013-14 లో మొత్తం 4.83 లక్షల విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తుండగా అందులో ప్రభుత్వ కళాశాలల్లో 1.23 లక్షలు, ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలల్లో 0.36 లక్షలు మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత 65.58 శాతం.

104. ఈ శాఖకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.812కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఉన్నత విద్య**

105. అన్ని వర్గాలకూ ఉపకరిస్తూ అందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా ఉన్నతవిద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావటానికీ, ఉన్నతవిద్యా సంస్థల్లో బోధించే బోధనను మెరుగుపర్చడానికీ, బోధనాంశాలను ప్రయోజనకరంగా ఉండేటట్లు చూడటానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది.

106. 18.8 శాతం మాత్రమే గల జాతీయ సగటు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి కన్నా రాష్ట్రం ఎక్కువ నిష్పత్తిని అనగా 21.6 శాతం నిష్పత్తిని నమోదుచేసింది. 13వ పంచవర్ష ప్రణాళికా ంతానికి దీనిని 32 శాతానికి పెంచాలని భారతప్రభుత్వం రాష్ట్రీయ ఉచ్చతర శిక్షాఅభియాన్ (రూసా) కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద 12వ పంచవర్ష ప్రణాళిక మొదలుకొని రూ.22,855 కోట్ల ప్రణాళికా కేటాయింపులున్నాయి. ఇందులో భాగంగా 12వ పంచవర్ష ప్రణాళికా కాలానికి రూ.1600 కోట్ల మేరకు ఆర్థికసహాయానికి రాష్ట్రప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తున్నది.

107. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చడం కోసం ప్రభుత్వం అండర్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో ఇంగ్లీషు బోధనలో భాగంగా సాఫ్ట్ స్కిల్స్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను బోధించడం కూడా మొదలుపెట్టింది. రూసా పథకంలో భాగంగా

రాష్ట్రంలో 2014-15 లో రూ.12కోట్ల అంచనా వ్యయంతో 4 మోడల్ డిగ్రీ కళాశాలలను ప్రభుత్వం నెలకొల్పనుంది. రూ.88.80 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో 11 విద్యా సంస్థల్లో గుణాత్మక సాంకేతిక విద్యాభివృద్ధి కార్యక్రమాన్ని (టిఇక్యూఐపి-II) ప్రభుత్వం అమలుచేస్తున్నది. చిత్తూరు జిల్లాలో ఐఐఐటిని మంజూరు చేయటమే కాక, పిపిపి పద్ధతి ద్వారా కాకినాడలో మరొక ఐఐఐటిని నెలకొల్పడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

108. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 లో 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా భారతప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో ఎన్నో జాతీయస్థాయి సంస్థలు నెలకొల్పబడనున్నాయి.

109. ఈ శాఖకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.2,275కోట్లు ప్రతిపాదించడమైనది.

**పర్యావరణం, అడవులు, సైన్స్ మరియు టెక్నాలజీ**

110. రాష్ట్రంలో అడవులు 36,917 చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉన్నాయి. ఇందులో దట్టమైన అడవులు కేవలం 9,764 చదరపు కిలోమీటర్ల మేరకు మాత్రమే అనగా మొత్తం రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 22.61 శాతం మేరకు మాత్రమే విస్తరించి ఉన్నాయి. రాష్ట్రంలో 13 వన్యప్రాణి అభయారణ్యాలు, 3 నేషనల్ పార్కులు, 2 జూ పార్కులు ఉన్నాయి. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఏర్పరచిన 4,320 వనసంరక్షణా సమితుల (విఎస్ఎస్) ద్వారా మరియు ఎకో డెవలప్‌మెంట్ కమిటీల ద్వారా ప్రస్తుతమున్న అడవులను సంరక్షించడానికీ, అభివృద్ధి చేయటానికీ వివిధ రకాల అటవీ కార్యక్రమాలు అమలుజరుగుతున్నాయి.

111. అడవులలోని వృక్షాల విస్తీర్ణం, సాంద్రత, అడవులలో అగ్నిప్రమాదానికి గురయ్యే ప్రాంతాల అంచనా మరియు అటవీ సరిహద్దుల సవరణ, నిర్ధారణ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, రిమోట్ సెన్సింగ్, గ్లోబల్ పొల్యూషనింగ్ సిస్టమ్ వంటి ఆధునిక సమాచార సాంకేతిక సాధనాలను అటవీ శాఖ వినియోగిస్తున్నది.

112. అడవులను రక్షించడం, అన్యాక్రాంతం కాకుండా కాపాడడం, ఎర్రచందనం వంటి విలువైన కలప స్మగ్లింగ్‌కు లోనుకోకుండా కాపాడడం నేడు రాష్ట్రం ముందున్న ముఖ్యమైన సవాళ్లు. అటవీ వనరులను సంరక్షించుకోవడం కోసం ప్రభుత్వం ఎన్నో ముఖ్య చర్యలను చేపట్టింది.

113. జాతీయ అటవీ విధానం మొత్తం భౌగోళిక ప్రదేశంలో 33 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలని నిర్దేశించింది. కాగా రాష్ట్రంలో వృక్ష విస్తీర్ణం సుమారు 25.64 శాతం మాత్రమే. ఈ రెండిటి మధ్యా వ్యత్యాసం 7.36 శాతం ఉంది. ఈ వ్యత్యాసాన్ని తగ్గించడం కోసం పెద్ద ఎత్తున చెట్లునాటి పెంచవలసి ఉంది.

114. రాష్ట్రంలో అంతరించి పోతున్న అటవీ ప్రాంతానికి సంబంధించిన 48,637.61 హెక్టార్ల ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ వివిధ పథకాలను చేపడుతున్నది. అందులో 26,932 హెక్టార్లో అధిక దిగుబడిని ఇవ్వగల యూకలిప్టస్ క్లోనల్ ప్లాంటేషన్స్ చేపట్టబడ్డాయి. ఇదికాకా, విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో 4010 హెక్టార్లలో కాఫీ తోటలు, 8950 హెక్టార్లలో జీడిమామిడి, 2380 హెక్టార్లలో వెదురు పెంపకం చేపట్టబడింది.

115. ఈ శాఖకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.418 కోట్లు ప్రతిపాదించడమైనది.

**మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడులు**

116. రాష్ట్రంలో మౌలికసదుపాయాల కల్పన మరియు పెట్టుబడుల శాఖ ఓడరేవులు, విమానాశ్రయాలు మరియు సహజవాయువుకు సంబంధించిన విషయాలను పరిశీలిస్తుంది. ఈ రంగంలో పబ్లిక్ ప్రైవేట్ రంగ భాగస్వామ్యపద్ధతిలో ప్రభుత్వం ఎన్నో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టింది.

117. ఆంధ్రప్రదేశ్‌కు సుమారు 975 కిలోమీటర్ల పొడవైన తీరరేఖ ఉంది. ఈ తీరంలో విశాఖపట్నంలో గల ఒక మేజర్ నౌకాశ్రయంతో పాటు 14 నాన్ మేజర్ నౌకాశ్రయాలు కూడా ఉన్నాయి. వీటిలో కాకినాడ యాంకరేజ్ పోర్ట్, కాకినాడ డీప్‌వాటర్‌పోర్ట్, కృష్ణపట్నం పోర్ట్, గంగవరం పోర్ట్ మరియు 'రవ్వ' లోగల ఒక కేప్టివ్ పోర్టులో వాణిజ్య కార్యక్రమాలు నడుస్తున్నాయి.

118. 2013-14 సంవత్సరంలో ఈ నౌకాశ్రయాలన్నిటిలోనూ ఇంతవరకూ ఎన్నడూ లేని విధంగా 58 మిలియన్ టన్నుల వస్తు రవాణా జరిగింది. తద్వారా రూ.144 కోట్ల ఆదాయం సమకూరింది. 2014-15 సంవత్సరంలో 65 మిలియన్ టన్నుల వస్తు రవాణా చేపట్టడం ద్వారా రూ.153 కోట్ల మేరకు ఆదాయం ఆశించడం జరుగుతున్నది.

119. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వం మచిలీపట్నం నౌకాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తున్నది. ప్రస్తుతమున్న నాన్‌మేజర్ నౌకాశ్రయాలతోపాటు, ప్రభుత్వం 14 మైనర్ పోర్ట్‌లను కూడా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వమ్యంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ఇందులో భావనపాడు, కళింగపట్నం రేవు పట్టణాలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో రెండవ పెద్ద నౌకాశ్రయాన్ని నెలకొల్పాలనే ప్రతిపాదనతో పాటు, ప్రైవేటు రంగంలో కాకినాడలో మరొక వాణిజ్య పోర్ట్ నెలకొల్పాలనే ప్రతిపాదనలు భారతప్రభుత్వం నుంచి అందినవి.

120. విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కడపలలో గల విమానాశ్రయాలను విస్తరించడానికీ/ఆధునీకరించడానికీ రాష్ట్రప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారికి సహకరిస్తున్నది. విజయవాడ విమానాశ్రయంలో ఒక కొత్త టెర్మినల్ భవనాన్నీ మరియు ఒక కంట్రోల్ టవర్‌ను నిర్మించడానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదిస్తున్నది. పొడిగించబడ్డ రన్ వే ప్రస్తుతం వాడుకలో ఉంది. విజయవాడ మరియు కాకినాడల మధ్య ఒక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ను కూడా ప్రతిపాదిస్తున్నది.

121. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రత్యేక కేటగిరి రాష్ట్రంగా ప్రకటించవలసి ఉన్నందున రాష్ట్రంలో చిత్తూరుజిల్లాలోని కుప్పం, కర్నూలు పట్టణం, నెల్లూరు మరియు శ్రీకాకుళంలో గల నో-ఫ్రిల్స్ ఎయిర్‌పోర్ట్‌లు ప్రతిపాదిస్తూ వాటికి సహాయం అందించవలసిందిగా భారతప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

122. భారతప్రభుత్వం నిర్వహించిన వేలంలో రాష్ట్రప్రభుత్వానికి చెందిన ఆంధ్రప్రదేశ్ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపిజిఐసి) కేజి బేసిన్‌లో 4 బ్లాకులకు అనుమతి సాధించింది.

123. ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిజిడిసి) ఎపిజిఐసి మరియు గెయిల్ ఇండియా లిమిటెడ్ వారి అనుబంధ సంస్థ అయిన గెయిల్‌గ్యాస్ లిమిటెడ్‌లచే సంయుక్తంగా ఏర్పరచబడిన సంస్థ. ట్రంక్ పైప్‌లైన్లు, సిజిడి నెట్‌వర్క్‌లు, రీజనల్ గ్రిడ్‌లు, సిఎన్‌జి, ఎల్ఎన్‌జి దిగుమతి మరియు దాని రీగాసిఫికేషన్ వంటి కార్యక్రమాలకు సంబంధించిన వ్యాపారంలో పాలుపంచుకోవడానికి ఎపిజిడిసి ఆసక్తి కనబరుస్తున్నది.

124. సహజవాయువుకు సంబంధించిన గిరాకీ మరియు సరఫరాలో నానాటికీ పెరుగుతున్న వ్యత్యాసాన్ని దృష్టిలో ఉంచుకుని తీరాంధ్రంలో ఒక ఎల్ఎన్‌జి ఇంపోర్టేషన్ టెర్మినల్‌ను నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహపడుతున్నది. ఇందుకు సంబంధించిన గిరాకీ రాష్ట్రంలోనే ముఖ్యంగా ఇంధనశాఖ, ఎరువులు, రిఫైనరీ, గ్లాసు పింగాణీ మరియు సీజిడి రంగాల్లో అధికంగా ఉంది. ఈ టెర్మినల్‌ను నెలకొల్పడానికి కాకినాడలోని కాకినాడ డీప్‌వాటర్ పోర్టును అత్యంత అనుకూల స్థలంగా ఎపిజిడిసి గుర్తించింది.

125. కాకినాడ డీప్‌వాటర్ పోర్టు దగ్గర ఎఫ్ఎస్ఆర్‌యు ఆధారిత ఎల్ఎన్‌జి టెర్మినల్‌ను నెలకొల్పడానికి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. పెట్రోనెట్ ఎల్ఎన్‌జి

టెర్మినల్‌తో కూడిన ఒక జె.వి కంపెనీ ద్వారా విశాఖపట్నం జిల్లాలోని గంగవరం పోర్టు దగ్గర కూడా మరొక ఎల్ఎన్‌జి టెర్మినల్‌ను నెలకొల్పడానికి కూడా అనుమతినివ్వడం కూడా జరిగింది.

126. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.73 కోట్లు ప్రతిపాదించడమైనది.

**రోడ్లు మరియు భవనాలు**

127. రాష్ట్రంలోని 46,440 కిలోమీటర్ల మేజర్ రోడ్ రవాణాకు అనుకూలంగా నిర్వహించడంతో పాటు సుదృఢమైన రహదారి వ్యవస్థను నిర్మించడం రోడ్లు, భవనాల శాఖ ముఖ్య బాధ్యత. జాతీయ రహదారులు 4302 కిలోమీటర్లు, రాష్ట్ర రవాదారులు 7,255 కిలోమీటర్లు, మేజర్ జిల్లా రహదారులు 19,783 కిలోమీటర్లు కాగా, జిల్లాపరిషత్తులు నిర్వహిస్తున్న రోడ్లు 15,100 కిలోమీటర్లు. కోర్‌నెట్ రోడ్లు 6,800 కిలోమీటర్లు. ఈ కోర్‌నెట్‌లో చేరని 35,338 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను రాష్ట్ర రహదారుల విభాగం నిర్వహిస్తున్నది.

128. రాష్ట్రంలో రహదారుల మీద సంభవిస్తున్న ప్రమాదాలను ప్రభుత్వం తీవ్రపరిగణనలోకి తీసుకుని, రహదారులు మరియు భవనాల శాఖ ఆధ్వర్యంలో అన్ని రహదారుల మీద రహదారి భద్రతా చర్యలను అమలు చేయటానికి సమగ్ర ఆదేశాలను జారీ చేసింది. ఈ ఆదేశాలు రహదారి భద్రతకు సంబంధించిన రాష్ట్రస్థాయి సాంకేతిక సంఘంవారి సిఫారసులకు అనుగుణంగా జారీచేయబడ్డాయి.

129. రైల్వేశాఖ వారి నియమనిబంధనలకు అనుగుణంగా ఎక్కువ జనసమ్మర్దం కలిగిన లెవెల్ క్రాసింగ్‌లకు బదులుగా రైల్ ఓవర్‌బ్రిడ్జిలు/రైల్ అండర్‌బ్రిడ్జిలు నిర్మించబడ్డాయి. కొన్ని ఆర్‌వోబిలు/ఆర్‌యుబిలు నూటికినూరు శాతం రాష్ట్రప్రభుత్వ నిధులతో కూడా చేపట్టబడుతున్నాయి.

130. నేషనల్ సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టు (ఎన్‌సిఆర్ఎమ్‌పి) 9 తీరాంధ్ర జిల్లాల్లో ప్రపంచబ్యాంకు సహాయంతో అమలుజరుగుతున్న పథకం. తుఫాను విపత్తు వాటిల్లిన సందర్భంలో పునరావాస సామాగ్రిని త్వరితంగా చేర్చటానికీ, లేదా ప్రజలను సత్వరమే సురక్షితప్రాంతాలకు తరలించడానికీ జనావాసాల అనుసంధానం, మరియు సైక్లోన్ షెల్టర్ల నిర్మాణం ఈ పథకం కింద చేపట్టబడుతున్నాయి.

131. ఈపిసి పద్ధతిలో రూ.130 కోట్ల అంచనా వ్యయంతో 4 బ్రిడ్జిల నిర్మాణాలూ మరియు రూ.165 కోట్ల అంచనా వ్యయంతో మరి 4 మేజర్ బ్రిడ్జిల నిర్మాణాలు రాష్ట్రంలో పురోగతిలో ఉన్నాయి.

132. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.2,612 కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఇంధనం**

133. భారతప్రభుత్వ కార్యక్రమం 'అందరికీ విద్యుచ్ఛక్తి' అమలుకు గాను ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా ఎంపికైంది. గృహోపయోగానికీ, వ్యాపార పారిశ్రామిక సంస్థలకు ఒక నిర్ణీత కాలవ్యవధిలో విశ్వసనీయమైన, న్యాయమైన మరియు సముచితమైన ధరకు 24X7 పాటు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

134. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎపిజెన్‌కో, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్‌లు మరియు స్వతంత్ర విద్యుచ్ఛక్తి ఉత్పత్తిదారుల ద్వారా అదనంగా మరొక 2925 మెగా వాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కానుంది. దీర్ఘకాలిక ప్రాతిపదికన 2000 మెగావాట్ల విద్యుచ్ఛక్తిని కొనుగోలు చేయటానికి ఆంధ్రప్రదేశ్ డిస్కమ్‌లకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి మంజూరు చేసింది. అలాగే సౌర, పవన వనరుల ద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పాదన చేసి, తద్వారా పెరుగుతున్న గిరాకీని తట్టుకొనాలని కూడా ప్రభుత్వం యోచిస్తున్నది. రాష్ట్రంలో సౌర, పవన విద్యుచ్ఛక్తి సామర్థ్యాలను ప్రోత్సహించడం కోసం ఒక సమగ్ర సౌర, పవన విద్యుత్ విధానాన్ని తీసుకురావాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

135. పారదర్శకంగానూ, పోటీపడగల వేలం ప్రక్రియద్వారానూ 1000 మెగావాట్ల సౌరవిద్యుత్‌ను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం డిస్కమ్‌లకు అనుమతి నిచ్చింది. 1000 మెగావాట్ల సామర్థ్యం కల్గిన 2 సౌరవిద్యుత్ పార్క్‌లను గుంటూరులోనూ, అనంతపురంలోనూ నెలకొల్పడానికి ప్రతిపాదించడం జరిగింది. రైతులకు సోలార్ పంపుసెట్లను ఇవ్వడం, ఇళ్ల పైకప్పుల మీద సోలార్ విద్యుత్ వ్యవస్థలను నెలకొల్పడం మీద ప్రభుత్వం దృష్టిపెట్టనున్నది.

136. దశల వారీగా సుమారు 3,000 మెగావాట్ల పవన విద్యుత్ మరియు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ సమకూర్చుకోవాలని ప్రతిపాదించడం జరుగుతున్నది. పవన మరియు సోలార్ విద్యుత్‌ల గ్రీన్‌కారిడార్ ఎవాక్యుయేషన్‌కిగాను రూ.5,000 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టాలని ప్రతిపాదించడం జరిగింది.

137. రాష్ట్రంలో వ్యవసాయదారులకు 7 గంటల ఉచితవిద్యుత్ సరఫరా చేయటానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉన్నది. రానున్న కాలంలో రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్

సరఫరా చేయబడుతుంది. గ్రామీణ ప్రాంతాలలో నాణ్యమైన విశ్వసనీయమైన త్రీ–ఫేస్ విద్యుత్ సరఫరాకు గాను వ్యవసాయ ఫీడర్‌లు దశలవారీగా ఏర్పాటు చేయబడతాయి.

138. ఇందుకుగాను 2014–15 బడ్జెట్ అంచనాల్లో రూ.7,164 కోట్లు ప్రతిపాదించడమైనది.

**నీటిపారుదల రంగం**

139. రాష్ట్రానికి గోదావరి, కృష్ణా, పెన్నా అనే మూడు నదులు వరదానంగా లభించాయి. ఈ మూడింటి కింద భారీ, మధ్య, చిన్నతరహా సాగునీటి పారుదల కింద 101.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. 2004 నుండి రూ.80,620 కోట్ల అంచనా వ్యయంతో 54 భారీ, మధ్య తరహా సాగునీటి పథకాలు చేపట్టబడ్డాయి. ఈ 54 పథకాల్లో 13 పథకాలు పూర్తి చేయబడ్డాయి. 14 పథకాలు పాక్షికంగా నీరు సమకూరుస్తున్నాయి. ఈ పథకాల ద్వారా రూ.19,378కోట్ల వ్యయంతో 11,878లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వచ్చింది. 3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడింది.

140. పోలవరం, ఉత్తరాంధ్ర సుజలస్రవంతి పథకాలు కాకుండా 39 పథకాలు పూర్తికావలసి ఉన్నాయి. ఇందులో 11 పథకాలు నిర్మాణ చివరిదశలో ఉన్నాయి. ఇవి 2014–15 లో పూర్తికానున్నాయి. వీటి ద్వారా 2,03,628 ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రానున్నది. మరియు 35,990 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడుతుంది.

141. రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను గుర్తించి భారతప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఒక జాతీయస్థాయి ప్రాజెక్టుగా ప్రకటించింది. అంతేకాక, సాగునీటి ప్రయోజనాల కోసం ఈ ప్రాజెక్టు అభివృద్ధి, నియంత్రణ మొత్తం కేంద్రప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుంటుందని ప్రకటించింది.

142. భారీ, మధ్యతరహా నీటిపారుదల రంగాలకు ఆవల ముఖ్యంగా దుర్భిక్షపీడిత ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధిలోనూ, జీవనోపాధులకల్పనలోనూ చిన్నతరహా నీటిపారుదల ప్రధానపాత్ర పోషిస్తుంది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్ర, కేంద్రప్రభుత్వ పథకాల కింద కొత్త నీటివనరులు కల్పించడం, మరియు చెరువులు, కుంటల పునరుద్ధరణ చేపట్టడం జరుగుతున్నది. మైక్రో ఇరిగేషన్ ద్వారా అవసరమైన చోట పొలాలకు నీరందించడం మాలక్ష్యం.

143. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 1,151 పథకాల కింద 7 లక్షల ఎకరాల ఆయకట్టును పరిరక్షిస్తున్నది. నాబార్డ్, ఎ.ఐ.బి.పి. మరియు రాష్ట్ర ప్రణాళికా నిధుల కింద రూ.581 కోట్ల అంచనా వ్యయంతో 1.45 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు కల్పన కోసం 89

పథకాలు నిర్మాణంలో ఉన్నాయి. 14,800 ఎకరాల ఆయకట్టు కోసం 16 కొత్త పథకాలు మంజూరు కాబడ్డాయి.

144. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.8,465కోట్లు ప్రతిపాదించడమైనది.

**పరిశ్రమలు, వాణిజ్యం**

145. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ పారిశ్రామికరంగాన్ని పూర్తి నిరుత్సాహ పరిస్థితిలోకి నెట్టివేసిందని చెప్పడానికి నేను చాలా చింతిస్తున్నాను. పారిశ్రామికీకరణ జరగాలంటే సాధారణంగా పెద్ద ప్రభుత్వరంగ సంస్థలు, పరిశోధనా సంస్థలు, పారిశ్రామిక ప్రయోగశాలలు, పేరెన్నికగన్న శిక్షణా సంస్థలు, వాటికి సంబంధించిన మౌలిక సదుపాయాలు ఉండాలి. కానీ రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఈ సదుపాయాలన్నీ మృగ్యమయ్యాయి.

146. యువతకు ఉద్యోగవకాశ కల్పనకూ, ప్రభుత్వానికి ఆదాయసమీకరణకూ పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం శీఘ్రగతిన పారిశ్రామికీకరణ జరగడం కోసం మిషన్ తరహాలో ఒక వ్యూహాన్ని రూపొందిస్తున్నది.

147. రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహించడానికి వనరులు అపారంగా ఉన్నాయన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా సముద్రతీర ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే విధంగా అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్ హబ్‌లనూ, కొత్త నౌకాశ్రయాలనూ నిర్మించడానికి అనువుగా రాష్ట్రానికి ఒక సుదీర్ఘ తీరరేఖ అందుబాటులో ఉంది. రాష్ట్రంలో ఉన్న విస్తారమైన వ్యవసాయ ఉద్యానవన విస్తీర్ణాన్ని ఉపయోగించి రాష్ట్రం ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించనుంది. అదేవిధంగా రాష్ట్రంలో అపారంగా ఉన్న ఖనిజ సంపదను ఉపయోగించి సిమెంటు, అల్యూమినియం, గ్రానైట్, ఉక్కు, ఫెర్రోఎల్లాయిస్, పింగాణీ, గ్లాసు, కాగితం, ఎరువులు, రసాయనాలు మరియు పెట్రోరసాయనాల పరిశ్రమలను ప్రోత్సహించడానికి కూడా ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ పరిశ్రమన్నిటికీ 24x7 విద్యుత్ సరఫరా అందించబడుతుంది.

148. రాయలసీమలోనూ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రత్యేక ప్రోత్సాహకాలివ్వటానికి ముఖ్యంగా పరిశ్రమలు నెలకొల్పటానికి ప్రత్యేక డెవలప్‌మెంట్ ప్యాకేజ్‌ను అందించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 అవకాశం కలిగిస్తున్నది. ఇందుకుగాను సముచితమైన ఆర్థికచర్యలు చేపట్టవలసిన బాధ్యత భారతప్రభుత్వం మీద ఉన్నది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికాభివృద్ధికీ, పారిశ్రామికీకరణకూ పన్నురాయితీలు కల్పించడం, అన్నిటికన్నా ముందుగా వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి పరచడం ఉన్నాయి.

149. అంతేకాక, రాష్ట్రంలో పెట్టే పెట్టుబడులను కొన్ని కేంద్రప్రభుత్వ పన్నులనుండి మినహాయించడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక కేటగిరీ ప్రతిపత్తి ఇచ్చే విషయం మీద కూడా భారతప్రభుత్వం హామీ ఇచ్చింది. పైగా ఇటీవల తమ బడ్జెట్ ప్రసంగంలో కేంద్రప్రభుత్వ ఆర్థికశాఖామాత్యులు నెల్లూరుజిల్లాలో ఒక స్మార్ట్‌సిటీని నెలకొల్పడంతోపాటు, కాకినాడలో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ కాంప్లెక్స్‌ను నెలకొల్పుతామని కూడా ప్రకటించారు.

150. పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. కొత్త పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే పారిశ్రామిక విధానం, ప్రస్తుతం అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ సింగిల్‌విండో చట్టాన్ని బలోపేతం చేయడం, ఆన్‌లైన్ ద్వారా ప్రాజెక్టుల పురోగతి పరిశీలన, పెద్దపెద్ద పారిశ్రామిక పథకాలకు ఎస్కార్ట్ ఆఫీసర్ల నియామకం, ఏపిఐఐసి ద్వారా భూమి కేటాయింపు విధానంలో సంస్కరణలు, భారీపారిశ్రామిక పార్కులకు అవసరమైన స్థలాలను గుర్తించడం, సేకరించడం, ఎన్ఐఎమ్‌జెడ్స్, సెజ్‌లు, పిసిపిఐర్ మరియు మెగా పారిశ్రామిక పార్కుల్ని నెలకొల్పడం మీద ప్రత్యేక దృష్టి, ప్రస్తుతమున్న పారిశ్రామిక పార్కులకు, పారిశ్రామిక ఎస్టేట్లకూ పూర్తిస్థాయి సదుపాయాలను కల్పించడం ద్వారా బలోపేతం చేయడం, తద్వారా ఎటువంటి అవరోధాలు లేకుండా పథకాలను అమలు పరచడం ప్రభుత్వం చేపడుతున్న కొన్ని ముఖ్యమైన చర్యలు.

151. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.615కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు కమ్యూనికేషన్లు**

152. ఈ-గవర్నెన్స్ మరియు ఐటి రంగాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక నాయకత్వ స్థితిని సాధించగలిగింది. కానీ కొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐటి ఉత్పత్తుల ఎగుమతుల టర్నోవర్‌లో కేవలం 2 శాతం ఉద్యోగకల్పనలో కేవలం 1.8శాతం మాత్రమే లభ్యమయింది. కాబట్టి రాష్ట్ర ఆర్థికవ్యవస్థ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత, భవిష్య అవసరాలకు తగ్గట్టుగా ఉద్యోగకల్పనను ప్రేరేపించేవిధంగా కొత్తరాష్ట్రం ఎన్నో చర్యలను చేపట్టక తప్పదని రూఢి అయింది. అంతేకాక ఐటి రంగంలో ప్రత్యక్షంగా కల్పించబడే ప్రతి ఉద్యోగ అవకాశానికీ పరోక్షంగా నాలుగురెట్లు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయన్నది అందరికీ తెలిసిన సంగతే.

153. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2020 నాటికి సాధించవలసిన నిర్దిష్ట లక్ష్యాలతో ఈ-గవర్నెన్స్, ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి రంగాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిపథంలోకి తీసుకువెళ్లే విధంగా అందుకు అనుసరించవలసిన విధానాలను సూచిస్తూ, ప్రభుత్వం ఒక బ్లూప్రింట్ రూపొందించింది.

154. శాఖ ముందున్న ప్రధాన లక్ష్యాలుః ప్రస్తుతం ఐటి రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందినవారు 21,795 మాత్రమే కాగా, అదనంగా ఐటి రంగంలో ప్రత్యక్షంగా 5 లక్షల అదనపు ఉద్యోగాల కల్పన, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల జాతీయ ఎగుమతిలో 5 శాతం వాటా సాధించడం, అంటే ప్రస్తుత రూ.1,622.20 కోట్ల విలువగల ఉత్పత్తుల ఎగుమతుల స్థానంలో రూ.43,000కోట్ల విలువ గల ఉత్పత్తుల ఎగుమతిని సాధించడం, ఐటి రంగంలో 2 బిలియన్ యుఎస్ డాలర్ల విలువగల పెట్టుబడులను ఆకర్షించడం, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలో 5 బిలియన్ యుఎస్ డాలర్ల విలువగల పెట్టుబడులను ఆకర్షించడం, వస్తూత్పత్తి కేంద్రాలను అనుసంధాన పరిచే సిలికాన్ కారిడార్‌ను ఏర్పరచడం, అన్ని గ్రామాలను గిగాబిట్‌తో అనుసంధాన పరచి, ప్రతి కుటుంబంలోనూ కనీసం ఒక్క వ్యక్తినైనా డిజిటల్ అక్షరాస్యుడిగా రూపొందించి, రాష్ట్రాన్ని డిజిటల్ ఆంధ్రప్రదేశ్‌గా రూపొందించడం.

155. ఒక నిర్దిష్ట కాలవ్యవధిలో సమన్వయ పద్ధతిలో ఆశించిన ఫలితాలను రాబట్టడం కోసం 18 విధాన పత్రాలు/ఫ్రేమ్ వర్క్‌లు మరియు ఈ-గవర్నమెంట్ మిషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి ప్రమోషన్ మిషన్ మరియు ఇన్నొవేషన్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ మిషన్ అనే మూడు మిషన్‌లను కూడా నెలకొల్పడం జరుగుతున్నది.

156. ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఐటి/ఐటిఇఎస్/ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ రంగాలకు సంబంధించిన గమ్యస్థలంగా నలుగురూ కోరుకునే విధంగా రూపొందించడం కోసం ప్రభుత్వం వివిధ చర్యలను చేపట్టనున్నది. వాక్‌టు వర్క్, మరియు సైకిల్ టు వర్క్ పద్ధతిన మెగా ఐటి హబ్‌లను అభివృద్ధి పర్చడం ద్వారా అంతర్జాతీయ స్థాయి మౌలికసదుపాయాల కల్పన, ఐటి ఇన్వెస్టిమెంట్ రీజియన్ల ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మానుఫాక్చరింగ్ క్లస్టర్లు, ఐటి టవర్లు, ఐటి పార్కులు, ఐటి లేఅవుట్‌లు మొదలైనవి నెలకొల్పడం అటువంటి చర్యల్లో భాగం. వ్యాపారాన్ని నెలకొల్పటానికి అవసరమైన కాలవ్యవధిని తగ్గించడం కోసం సమర్థవంతమైన సింగిల్‌విండో వ్యవస్థ నెలకొల్పబడుతుంది. నిర్ణీత కాలవ్యవధిలో పారదర్శకంగా ఈ-బిజ్ ద్వారా వ్యాపార నిర్వహణ వ్యయం తగ్గించబడుతుంది. పారిశ్రామికరంగం తాలుకు భాగస్వామ్యంతో మానవవనరుల సామర్థ్యాన్ని పెంపొందించడం మీద, ఇన్నోవేషన్ మీద, స్టార్ట్‌అప్‌ల మీద ప్రత్యేకశ్రద్ధ పెట్టబడుతుంది. ప్రస్తుతమున్న 'సమాచార సమాజాన్ని 'విజ్ఞాన సమాజం' గా మార్చడమే ఈ చర్యలన్నిటి తాలూకు అంతిమ ధ్యేయం. ఈ సందర్భంగా మన పూర్వ రాష్ట్రపతి డా.ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ గారి మాటలను గుర్తు చేస్తున్నాను. 'మన ప్రగతి కోసం సామాజిక పరివర్తన, సుస్థిర అభివృద్ధి అత్యావశ్యకం. ఇవి రెండూ నిర్దిష్ట కాలపరిమితిలో సాధ్యం కావాలంటే విజ్ఞానసమాజాన్ని నిర్మించడం ఒక్కటే మార్గం. అదొక్కటే జాతిని సాధికారికం చేయగలుగుతుంది. '

157. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.111కోట్లు ప్రతిపాదించడమైనది.

**విపత్తుల నిర్వహణ**

158. ఇటీవల ఆంధ్రప్రదేశ్ 5 ప్రకృతి వైపరీత్యాలను చవిచూసింది. అవి, ఫైలీన్ తుఫాను, భారీ వర్షాలు, వరదలు, 'హెలెన్', 'లెహెర్' తుఫానులు మరియు 2013–14లో సంభవించిన అకాల భారీవర్షాలు. ఈ విపత్తుల ద్వారా వాటిల్లిన నష్టాన్ని పూరించడానికి గాను రూ.2,969కోట్ల ఆర్థిక సహాయాన్ని కోరుతూ భారతప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞాపనలు సమర్పించడం జరిగింది. ఇందుకుగాను భారతప్రభుత్వం రూ.700కోట్లు తక్షణ సహాయాన్ని అందిస్తూ, తక్కిన సహాయాన్ని విపత్తు వల్ల కల్గిన నష్టాలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాత అందిస్తామని తెలియజేసింది.

159. 2012 లో సంభవించిన దుర్భిక్షపరిస్థితులకు గాను, నీలం సైక్లోన్ వల్ల సంభవించిన విపత్తుకు గాను రూ.1,464 కోట్ల మేరకు వ్యవసాయ, ఉద్యానవన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ 2013–14 లో విడుదల చేయడం జరిగింది. విపత్తుల వల్ల నష్టపడ్డ రైతులకు ఈ సబ్సిడీ నేరుగా అందడం కోసం ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేపట్టబడ్డాయి.

160. ఇందుకుగాను 2014–15 బడ్జెట్ అంచనాల్లో రూ.403కోట్లు ప్రతిపాదించడమైనది.

**శాంతిభద్రతలు**

161. 2014 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలతోపాటు వివిధ సంస్థలకు నిర్వహించవలసి వచ్చిన ఎన్నికలను శాంతిభద్రతలకు విఘాతం లేకుండా నిర్వహించడం, ఫైలీన్, హెలెన్, లెహెర్ సైక్లోన్ల సందర్భంగా రెస్క్యూ కార్యక్రమాలు నిర్వహించడం, తమిళనాడు పోలీస్ వారి సహకారంతో చిత్తూరు జిల్లాలో అల్–ఉమా సంస్థకు చెందిన ఉగ్రవాదులను అక్టోపస్ కమాండోలు అరెస్టు చేయడం, దేశంలోనే మొదటిసారిగా 21 కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్‌లను ప్రారంభించిన ఘనత సాధించడం మన శాంతిభద్రతల యంత్రాంగం ఇటీవల కాలంలో సాధించిన కొన్ని ముఖ్య విజయాలు.

162. ప్రజా సమస్యలకు సత్వరమే ప్రతిస్పందించి సమర్థవంతంగా పరిష్కరించడం కోసం డయల్ 100 కమాండ్ కంట్రోల్ సెంటర్ నెలకొల్పడం జరిగింది. కేంద్రం ప్రారంభించి ఇప్పటిదాకా 2.14 మిలియన్ కాల్స్‌ను స్వీకరించడం జరిగింది. వాటి పరిష్కారానికి సంబంధించిన సంతృప్తి 95 శాతం నమోదయ్యింది. ప్రజా సమస్యలను సన్నిహితంగా వినడం కోసం పోలీస్ స్టేషన్‌లలో రిసెప్షన్ సెంటర్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది.

163. విభజన తర్వాత రాష్ట్రంలో రూ.683కోట్ల అంచనా వ్యయంతో అత్యున్నత స్థాయి గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కోసం, రూ.412కోట్ల అంచనా వ్యయంతో కర్నూలులో గ్రేహౌండ్స్ హబ్ ఏర్పాటు కోసం మరియు 6 ఏపిఎస్‌పి బెటాలియన్ల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది.

164. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.3,739 కోట్లు ప్రతిపాదించడమైనది.

**రెవిన్యూ**

165. భూములకు సంబంధించిన రికార్డులను నిర్దిష్టంగానూ, సక్రమంగానూ నిర్వహించడం ద్వారా రెవిన్యూ శాఖ ప్రజలకూ, ముఖ్యంగా రైతులకు అమూల్యమైన సేవలు అందిస్తున్నది. ఇటీవలనే ఈ శాఖ భూమి రికార్డులను కంప్యూటరీకరించి 'మీ-సేవ' కేంద్రాల ద్వారా 68 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. రెవిన్యూ మరియు రిజిస్ట్రేషన్ రికార్డులను కూడా అనుసంధానపరచడానికి చర్యలు మొదలుపెట్టింది. అంతేకాక ఈ-పట్టాదార్ పాస్ పుస్తకాలను కూడా ఇవ్వడం మొదలుపెట్టింది. ప్రభుత్వ భూములను గుర్తించి వాటి సవివరమైన జాబితాలు తయారుచేయడం కోసం 'సర్కార్ భూమి' పేరిట ఒక కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడం మొదలుపెట్టింది. ఇప్పటిదాకా 17 లక్షల రికార్డులు నమోదు చేయబడ్డాయి. ప్రహరీ గోడలు మరియు ఇనుపకంచెలు ఏర్పాటుచేయడం ద్వారా ప్రభుత్వ భూముల్ని రక్షించడం కోసం 2013-14 లో రూ.30 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.

166. ఇందుకుగాను 2014-15 బడ్జెట్ అంచనాల్లో రూ.1,177కోట్లు ప్రతిపాదించడమైనది.

**ఆర్థిక శాఖ**

167. ప్రజాధన నిర్వహణలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనాలను నెలకొల్పడం కోసం, ఆర్థిక శాఖ, కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సిఎఫ్ఎమ్ఎస్)ను రూపొందిస్తున్నది. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన 'సత్యమంతా ఒక్క చోటనే' చూడగలగడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందులో అంతర్గతంగా సంబంధించిన వారందరికీ ఒకరితో ఒకరికి పూర్తిగా అనుసంధానం కలిగించడం, ఆర్థిక విషయాలతో సంబంధించిన బయటివారికి ఎలక్ట్రానిక్ సమాచారం అందించడం ఇందులో ముఖ్య అంశాలు. ఈ అప్లికేషన్ రూపకల్పన తుది దశలోనూ, మరియు ప్రయోగదశలోనూ ఉన్నది.

168. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ-పేమెంట్ పద్ధతి ద్వారా భూసేకరణ పరిహారాల చెల్లింపు, వన సంరక్షణ సమితులకు ఆన్‌లైన్ చెల్లింపు, పర్సనల్ డిపాజిట్ ఎకౌంట్‌ల

నిర్వహణకు సాఫ్ట్‌వేర్ రూపకల్పన, మరియు రాష్ట్రంలోని ట్రెజరీలలోనూ, పే అండ్ ఎకౌంట్ ఆఫీసుల్లోనూ బిల్ మానిటరింగ్ సిస్టమ్ మరియు ఈ-పేమెంట్ల వ్యవస్థాపన ప్రధానంగా చేపట్టబడుతున్నాయి.

169. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వబడ్డాయి. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి అనువైన విధాన నిర్ణయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనున్నదని నేను ఈ సందర్భంగా తమ ద్వారా సభకు హామీ ఇస్తున్నాను.

**2012-13 లెక్కలు**

170. 2012-13 సంవత్సరానికి చెందిన తుది లెక్కల ప్రకారం రూ.1,128 కోట్ల రెవిన్యూ మిగులు ఉండగా, రూ.17,508 కోట్లు ఆర్థిక లోటు నమోదయింది. మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.32 శాతం అయిన ఈ లోటు ఎఫ్ఆర్‌బిఎమ్ చట్ట పరిధి దాటలేదని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

**2013-14 సంవత్సరానికి సవరించిన అంచనాలు**

171. 2013-14 సంవత్సరపు సవరించిన అంచనాల లావాదేవీలను బట్టి రూ.1023 కోట్ల రెవిన్యూ మిగులు సూచిస్తున్నది. ద్రవ్యలోటు రూ.24,487 కోట్లుగా అంచనా వేయడమయింది. ఇది జి.ఎస్.డి.పి. లో 2.87 శాతం.

**2014-15 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు**

172. 2014-15 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం రూ.1,11,824కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నది. అందులో రూ.85,151 కోట్లు ప్రణాళికేతర వ్యయంగా, రూ.26,673 కోట్లు ప్రణాళికా వ్యయంగా అంచనా వేయబడింది. రెవిన్యూ లోటు రూ.6,064 కోట్లుగా మరియు ఆర్థిక లోటు రూ.12,064 కోట్లు గానూ అంచనా వేయబడింది. స్థూల జాతీయ ఉత్పత్తిలో ఆర్థిక లోటు 2.30 శాతం కాగా రెవిన్యూ లోటు 1.16 శాతం. ఈ అంచనాలలో అవిభక్త రాష్ట్రానికి సంబంధించిన 2 నెలల ఆదాయ వ్యయాలు, రాష్ట్ర విభజనను పురస్కరించుకొని కేంద్రప్రభుత్వం నుండి అదనంగా వస్తాయని భావిస్తున్న 14,500 కోట్ల రూపాయలు ఇమిడి ఉన్నాయి. వీటిని మినహాయిస్తే ఆర్థిక అంశాలపై ప్రకటించిన శ్వేతపత్రంలో పేర్కొన్న విధంగా, ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రకారం శేష రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.25,574 కోట్లు, ద్రవ్య లోటు రూ.37,910 కోట్లుగా ఉంటాయి. ఇవి జి.ఎస్.డి.పి.లో వరుసగా 4.84 మరియు 7.18 శాతం.

173. ఈ రానున్న సంవత్సర కాలంలో ముందంజ వేయడానికి వీలుగా కొత్త రాష్ట్రాన్ని సువ్యవస్థితంగా నిర్మించే ప్రక్రియకు 2014-15 బడ్జెట్ శ్రీకారం చుట్టనున్నదని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. ఆర్థిక వృద్ధి సాధనలో భాగస్వాములందరికీ సమానావకాశాలు కల్పించే మరియు సమాజంలోని అన్ని వర్గాల వారికీ ముఖ్యంగా బలహీన వర్గాల వారికి అభివృద్ధి ఫలాలు అందించే సమ్మిళిత వృద్ధి సాధనే మా ధ్యేయం. ఈ సందర్భంగా మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పలుకులను ప్రస్తావిస్తున్నాను. " ఒకానొక రోజు ప్రతి లోయ పైకెత్తబడుతుంది, ప్రతి పర్వతం క్రిందకు దిగుతుంది, ఎగుడుదిగుళ్లు చదునవుతాయి, వంకర నేలలు తిన్నగా మారుతాయి – అన్నది నా స్వప్నం ".

పై లక్ష్యాలను చేరుకోవడానికీ, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికీ మా ప్రభుత్వం నిరంతరాయంగా, అవిశ్రాంతంగా శ్రమించడానికి కృత నిశ్చయంతో ఉంది. చివరగా రాబర్ట్ ఫ్రాస్ట్ యొక్క ఈ పద్య పాదంతో ముగిస్తున్నాను.

"విశ్రమించడానికి ముందు పయనించాల్సిన దూరం ఎన్నో మైళ్లు"

174. ఈ బడ్జెట్‌ను సభవారి ఆమోదం కోసం సమర్పిస్తున్నాను.

**జైహింద్ !**

MR. SPEAKER: The House is adjourned to meet again at 9.00 AM on 22.08.2014.

**(The House then adjourned at 12.23pm to meet again at 9.00 am on Friday, 22th August, 2014.)**